www.jagritiweekly.com
సంపుటి : 77 సంచిక : 43 పుటలు : 52

# జాగృతి

కలి 5127-శ్రీ విశ్వావసు శ్రావణ బహుళ దశమి
వెల : ₹20/-
18-24 ఆగస్ట్ 2025




## విపక్షాల వీధి నాటకం

## డాలర్ 'చావు' కొచ్చిన ట్రంప్ సుంకాల పెంపు

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

77 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక











# మువ్వన్నెల రెపరెపలు

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా మువ్వన్నెలు రెపరెపలాడేలా మంత్రులు, సైన్యాధికారులు, సామాన్య పౌరులు తిరంగ ర్యాలీ చేపట్టారు. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా బాలికలు చేపట్టిన తిరంగా సైకిల్ యాత్రను న్యూఢిల్లీలో ప్రారంభించడం ద్వారా జాతీయ పతాకం పట్ల గౌరవప్రపత్తులను చాటుకున్నారు. కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు దేశరాజధానిలో హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ప్రయాగరాజ్‌లో పాఠశాల విద్యార్థులు జాతీయపతాకాన్ని చేబూని తిరంగా ర్యాలీలో పాల్గొన్నారు. ఇండో-టిబెటిన్ సరిహద్దు పోలీసు-ఐటీబీపీకి చెందిన 53వ బెటాలియన్ అధికారులు, జవాన్లు ఆంధ్రప్రదేశ్‌లోని కలికిరిలో తిరంగా ర్యాలీ చేపట్టారు. జార్ఖండ్ రాజధని రాంచీలో ప్రజలు అత్యంత పొడవైన జాతీయ పతాకంతో పురవీధుల్లో ప్రదర్శనగా ముందుకు సాగారు.

(ఆగస్ట్ 15 వరకు ఈ యాత్ర కొనసాగింది.)

భారతీయ సాహితీ ద్రష్ట

భండారు సదాశివరావు స్మారక



# కథల పోటీ

**జాగృతి వారపత్రిక దీపావళి ప్రత్యేక సంచిక కోసం ప్రఖ్యాత సాహితీవేత్త స్వర్గీయ భండారు సదాశివరావు స్మారక 'కథల పోటీ - 2025' నిర్వహిస్తున్నాం. రచయితలకు ఆహ్వానం..**



**ప్రథమ బహుమతి : రూ. 12000/-**
**ద్వితీయ బహుమతి : రూ. 7000/-**
**తృతీయ బహుమతి : రూ. 5000/-**

## నిబంధనలు :



1. సమకాలీనం, చారిత్రకం, సైన్స్ ఫిక్షన్ ఇతివృత్తంతో కూడిన కథలను పంపవచ్చు. భారతీయ సామాజిక జీవనమే నేపథ్యంగా ఉండాలి. సాధ్యమైనంత వరకు ఆంగ్ల పదాలను పరిహరించండి.
2. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ఎనిమిది కథలకు రూ.1,000 చొప్పున ప్రోత్సాహక బహుమతి, సాధారణ ప్రచురణకు స్వీకరించిన ప్రతి కథకు జాగృతి పారితోషికం ఉంటాయి.
3. కథ నిడివి 1500 పదాలకు మించరాదు. ఒక రచయిత 2 కథలకు మించి పంపరాదు.
4. కథ స్వంతమేనని, అనువాదం, అనుసరణ కాదని, బ్లాగుల్లోనూ, వెబ్ పత్రికల్లోనూ మరెక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదని; పరిశీలనలో లేదని విడిగా హామీపత్రం జతచేయాలి. హామీపత్రంలో రచయిత పేరు, చిరునామా, ఇ-మెయిల్ ఐడి, ఫోన్ నంబర్ తప్పక రాయండి. కథ రాసిన పుటలలో ఎక్కడా రచయిత పేరు గానీ, ఇతర వివరాలేవి ఉండరాదు.
5. కథలను తెలుగులో అను లేదా యూనికోడ్ ఫాంట్‌లో డిటిపి చేసి jagriticompetition@gmail.com కు మెయిల్ చేయాలి.
6. పోస్టు లేదా కొరియర్ ద్వారా పంపాలనుకుంటే 'కథల పోటీ' జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, జాగృతి భవన్, కాచిగూడ, హైదరాబాద్-500027 కు పంపొచ్చు. జాగృతికి కథల్ని చేర్చే బాధ్యత రచయితలదే.
7. కథల ఎంపికలో ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావులేదు. సంపాదకునిదే అంతిమ నిర్ణయం.
8. దీపావళి సంచిక నుంచి ఆరంభించి, వరుసగా ఈ కథలను ప్రచురిస్తాం.

**కథలు జాగృతికి చేరడానికి చివరి తేది : 10 సెప్టెంబర్, 2025**

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి : | అసోసియేట్ ఎడిటర్ | - |
| సబ్ ఎడిటర్ : | - | 9959991304 |

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

Link / QR Code ద్వారా మీ చందా చెల్లించినప్పుడు Remarks దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 సంవత్సర చందా రూ.850

**బ్యాంకు ఖాతా వివరాలు**

A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

– సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

పెహల్గావ్ నెత్తుటికాండకు పాల్పడి భారత్ చేతిలో చావు తప్పి కన్ను లొట్ట పోయినా పాకిస్తాన్‌కు బుద్ధి రాలేదు. భారత్ పట్ల అపరాధాల మీద అపరాధాలు చేస్తూనే ఉంది. వియన్నా సదస్సు నిబంధనలను ఉల్లంఘించి ఆ దేశంలో ఉన్న భారత దౌత్యవేత్తలకు వంట గ్యాస్, వార్తాపత్రికలు, ఆఖరికి తాగు నీరు కూడా నిలిపివేసినట్టు తాజాగా వెల్లడైంది. ఇందులో ఎవరి ప్రమేయం ఉన్నదో అధికారికంగా బహిర్గతం కాకున్నా, అంతిమంగా పాకిస్తాన్ నిఘా వ్యవస్థ ఐఎస్ఐ పేరే వినిపిస్తున్నది. రెండు మూడు దేశాలు తప్ప, ప్రపంచమంతా చీదరించుకుంటున్న ఈ వ్రణానికి ఇప్పుడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కాస్త లేపనం పూసి, ఊపిరి కూడా పోసే ప్రయత్నం చేస్తున్నారు. భారత్ మీద కడుపు మంటతో సుంకాలు పెంచి, పనిలో పనిగా పాకిస్తాన్‌ను దువ్వడం మొదలెట్టారు టారిఫ్‌ల ట్రంప్. దీనితో దృశ్యం పరమ వికృతంగా మారిపోయింది.

పాకిస్తాన్ సర్వ సైన్యాధ్యక్షుడు, ఫీల్డ్‌మార్షల్ ఆసిమ్ మునీర్‌ను ఈ మధ్య శ్వేతసౌధం విందులు కుడిపిస్తూ, ముద్దు చేస్తున్న సంగతి తెలిసిందే. దీనితో మునీర్ వెర్రెత్తినట్టు వదరుతున్నాడు. షెహబాజ్ షరీఫ్‌ను ఈడ్చి తన్ని, తానే పాకిస్తాన్ భావి ప్రధాని కాబోతున్నాడన్న తీరులో మునీర్ అమెరికాలో మాట్లాడాడు. భారత్ భవిష్యత్‌లో తమ దేశం మీద యుద్ధానికి దిగితే జరగబోయేదేమిటో చెప్పి బెదిరించాడు. తాము నాశనం కావడమే కాకుండా, సగం ప్రపంచాన్ని కూడా తమతో నాశనమయ్యే అవకాశం కల్పిస్తారట. భారత్ మెర్సిడెజ్ బెంజ్ కారులా ధగధగలాడే దేశమే కావచ్చు. పాకిస్తాన్ చెత్తాచెదారం, రాళ్లూరప్పలు మోసుకెళ్లే డంప్‌ట్రక్ కావచ్చు. కానీ ట్రక్ వెళ్లి బెంజ్‌ను గుద్దితే ఎవరికి నష్టమో తెలుసుకోవాలంటూ యావత్ విశ్వం ముక్కు మూసుకునేటంత స్థాయి కంపు మాట వదిలాడు. అమెరికా చంకనెక్కిన మునీర్‌కు మళ్లీ తమ వద్ద అణ్వాయుధాలు ఉన్న సంగతి అమాంతం గుర్తుకు వచ్చింది. అమెరికాలోని ఫ్లోరిడాలోని టాంపా అనే చోట మునీర్ ప్రవాస పాకిస్తానీల సమావేశంలో మాట్లాడాడు. కశ్మీర్ గురించి నోరు పారేసుకున్నాడు. కశ్మీరం తల నుంచి గుండెకు రక్తాన్ని తీసుకువెళ్లే నరం అంటూ కవిత్వం వెలగబెట్టాడు. ఈ విషయం పాకిస్తాన్ వ్యవస్థాపకుడు

**శాలివాహన 1947 శ్రీ విశ్వావసు శ్రావణ బహుళ దశమి**

## లోపలి పేజీలలో...





ముఖపత్ర కథనం
**విపక్షాల వీధి నాటకం**
6లో

ముఖపత్ర కథనం
**డాలర్ 'చావు' కొచ్చిన ట్రంప్ సుంకాల పెంపు**

20లో

ప్రత్యేక వ్యాసం
**ధీరోదాత్తుడగు నాయకుడు**

26లో

# జాగృతి

## సంపాదకీయం

మహమ్మదలీ జిన్నాయే చెప్పాడని సాక్ష్యం తెచ్చుకున్నాడు. పైగా కశ్మీర్ అంశం అంతర్జాతీయ అంశమని పాచి పాట వినిపించాడు. ఇటీవలి ఘర్షణలో (ఆపరేషన్ సిందూర్) ఘన విజయం సాధించింది తామేనంటూ పాకిస్తానీలే విస్తుపోయే రీతిలో కోతలు కోశాడు. ఆఖరికి సింధు నది భారత్ సొత్తేమీ కాదని కూడా ప్రకటించాడు మునీర్.

ఇదంతా ఒక ఎత్తయితే, గుజరాత్‌లోని రిలయన్స్ వారి అతి పెద్ద చమురు శుద్ధి కర్మాగారం మీద టాంపాలోనే చేసిన వ్యాఖ్య మరొక ఎత్తు. భారత్ ఎదుగుదలను చూసి పాకిస్తాన్ ఎంత కుళ్లుకుంటున్నదో ఈ వ్యాఖ్యతో అర్థం చేసుకోవచ్చు.

## మురికి మాటల మునీర్

ప్రపంచంలోనే అతి పెద్ద పారిశ్రామిక ప్రాంగణమది. దానిని కూడా లక్ష్యంగా చేసుకుంటామని తప్పుడు పేలాపన పేలాడు మునీర్. భారత ఆర్థిక పరిపుష్టికి దోహదం చేస్తున్న పారిశ్రామిక వాడల మీద పాకిస్తాన్ కన్నేసి ఉంచిందన్న మన నిఘా వర్గాల సమాచారం నిజమని దీనితో వెల్లడైంది. ప్రధానంగా పాకిస్తాన్‌కు సరిహద్దుగా ఉన్న గుజరాత్ వంటి రాష్ట్రంలోని సంపద సృష్టి కేంద్రాల మీదనే పాకిస్తాన్ కన్ను చిరకాలంగా ఉందన్నదీ నిజం.

శ్వేతభవనం అంటే ఇప్పుడు ప్రపంచ దేశాలకు ఒక సర్కస్ కంపెనీలా, ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ ఒక బఫూన్‌లా కనిపిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్‌ను ఆపేసింది తానే అంటూ ఎన్నిసార్లు అరిచాడో ట్రంప్! స్వీడిష్ అకాడమీకి ఆ అరుపులు, పెడబొబ్బలతో చెవులు గంట్లు పడి, ఇక భరించలేక శాంతి నోబెల్ పురస్కారాన్ని తెల్లారేసరికి తిరుగు టపాలో పంపుతారని ట్రంప్ ఆశ. యుద్ధం తానే నిలిపేశానంటూ ట్రంప్ అన్నిసార్లు టాం టాం వేసుకున్నా, ఆ మాటకు మన ప్రధాని నరేంద్ర మోదీ పూచికపుల్లకు మించి విలువేమీ ఇవ్వలేదు. ఆపరేషన్ సిందూర్‌ను నిలిపివేయమని తమకు ఏ దేశాధినేత నుంచి కబురు అందలేదని సాక్షాత్తు పార్లమెంట్ సాక్షిగా భారత ప్రధాని ప్రకటించారు. మోదీ సర్వస్వతంత్రుడైన నాయకుడు. కాబట్టి ఇలాంటి ప్రకటన చేయగలిగారని అనుకోనక్కరలేదు. అమెరికా కాంగ్రెస్ ప్రముఖులు, భద్రతా వ్యవహారాల మాజీ సలహాదారు వంటివారు కూడా ట్రంపరితనాన్ని తూర్పార పడుతున్నారు. ఒక నిపుణుడైతే ట్రంప్ సుంకాల వ్యూహం డాలర్‌ను మరణశయ్యకు చేర్చిందని ప్రకటించేశారు కూడా. భారత్–అమెరికాల మధ్య కొన్ని దశాబ్దాలుగా గట్టి పడుతూ వచ్చిన సత్సంబంధాలను సుంకాల వంకతో నాశనం చేయడం సరి కాదని, రెండు దేశాల ప్రజల మధ్య గొప్ప సుహృద్భావ వాతావరణం ఉందన్న సంగతి విస్మరించరాదని ఆ దేశ ప్రముఖులు చెబుతున్నా ట్రంప్ పెడచెవిన పెడుతున్నాడు. నిజానికి ఈ దేశాధ్యక్షుడు, ఆ సైన్యాధ్యక్షుడు మొదట తమ ఇళ్లు చక్కబెట్టుకోవాలి. ఒకరి కోతలు చూసి ఒకరు డంగైపోతే వాళ్లే భంగపడతారు.

పాకిస్తాన్ నుంచి భారత్ చమురు కొనుగోలు చేసే విధంగా పరిస్థితులు సృష్టిస్తామని వారి దగ్గర ఏదో మంత్రదండం ఉన్నట్టే ట్రంప్ ప్రకటించాడు. ఇది ఎంత హాస్యాస్పదమో ట్రంప్‌కు తెలియదా? ఇంతకీ అమెరికా గడ్డ మీద నుంచి పాక్ సైన్యాధ్యక్షుడు వాగిన ఈ వాగుడును అధ్యక్షుడు ట్రంప్ సమర్థించ గలరా? ఇది ప్రపంచం అడగవలసిన ప్రశ్న. అలాగే రిలయన్స్ వారి చమురు శుద్ధి కర్మాగారాన్ని లక్ష్యంగా చేసుకుంటామన్న పాకిస్తాన్ మునీర్ మాట గురించి మన ప్రతిపక్ష నేత స్పందన ఏమిటి? రిలయన్స్ అంబానీలది కాబట్టి, ఆ పారిశ్రామికవేత్తలు మోదీకి సన్నిహితులని రాహుల్ నమ్మకం కాబట్టి మునీర్ నిర్ణయం సరైనదేనంటారా? ఇది భారత ప్రజానీకం అడగవలసిన ప్రశ్న. ★

18 ఆగస్ట్ 2025, సోమవారం

అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్



38లో

కథ

**కిరాయిబంధం**

– కటుకోజ్వల మనోహరాచారి





| | | |
|---|---|---|
| వినాశకర విపక్ష నేత (జాతీయం) | - | 12 |
| నీటివనరుల నిర్వహణలో నిర్లక్ష్య ధోరణి (తెలంగాణ) | - | 14 |
| 'కమల' వికాసానికి సారథ్య పర్యటనలు (ఆంధ్రప్రదేశ్) | - | 16 |
| సుంకాల కాటుకు స్వదేశీ దెబ్బలు! (అంతర్జాతీయం) | - | 18 |
| కీలక భూమిక (మహిళ) | - | 28 |
| విశ్వనాథశాస్త్రి ఫొటో జర్మనీలో ఎందుకుంది? (గళమెత్తిన గతం) | - | 30 |
| అదే గాంధీజీ ఆఖరి నిరాహార దీక్ష (వేదిక) | - | 32 |
| భారత టెస్టు క్రికెట్లో నవశకం..! (క్రీడ) | - | 43 |
| ఉత్తరాఖండ్ ఉత్పాతం.. పర్యావరణ ప్రకోపం (వానాకాల పాఠం) | - | 44 |
| షూటింగ్స్ బంద్: నేర్చుకోవాల్సిన పాఠాలు! (సినిమా) | - | 50 |

**ఆగస్టు 11న దేశరాజధానిలో, పార్లమెంట్‌కు దగ్గర్లో విపక్షాలు ఆడిన వీధి నాటకం రక్తి కట్టలేదు సరికదా.. నవ్వులపాలైంది. అభాసుపాలైన ఈ నాటకానికి కథానాయకుడు, సూత్రధారి కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఐతే ఆయన్ను అధిగమించి మరీ నటించడానికి తృణమూల్ కాంగ్రెస్ పార్టీ మహిళా ఎంపీలు, సమాజ్‌వాది పార్టీ-ఎస్‌పీ అధినేత, ఎంపీ అఖిలేశ్ యాదవ్ ప్రయత్నించారు. ఈ వీధినాటకానికి పెట్టుకున్న పేరు ఓట్ల చోరీ.. ప్రజాస్వామ్యం ఖూనీ. నిజానికి వీధినాటకం అనే స్ట్రీట్ ప్లేను జనసమ్మర్థం ఉన్న ఒక చోట మాత్రమే ఆడతారు. కానీ విపక్షాలు జట్టు కట్టిన ఇండియా కూటమి మాత్రం పార్లమెంట్ నుంచి కేంద్ర ఎన్నికల సంఘం-ఈసీ ప్రధాన కార్యాలయం కొలువైన నిర్వాచన్ సదన్ వరకు ఆడాలని నిర్ణయించుకున్నాయి. కళాకారులు ఆడే వీధినాటకానికి నటులు మహా అయితే 10 మందికి మించి ఉండరు. కానీ ఈ రాజకీయ నటుల కళాఖండంలో 250 మంది పాలుపంచుకున్నారు.**



# విపక్షాల వీ

ఉదయాన్నే అందరూ సిద్ధమైపోయారు. సభా కార్యకలాపాలు మరికాసేపట్లో మొదలవుతాయనగా పార్లమెంట్‌కు చేరుకున్నారు. రాహుల్ గాంధీ అయితే తన కారు డోరు తెరుచుకొని ఒక్క అంగలో బైటకు దూకి మిగిలినవారికి తోడయ్యారు. పార్లమెంట్ ఉదయం 11 గంటలకు మొదలైతే.. ఉభయసభల్లో సభ్యులందరూ కలిసి చర్చించి, ప్రజాపయోగకరమైన మార్పులు చేర్పులు సూచిస్తే, అందరి అంగీకారంతో చట్టబద్ధత పొందుదామని కీలకమైన ఎనిమిది బిల్లులు ఎదురుచూస్తున్నాయి. వాటిలో ముఖ్యమైన ఆర్థిక బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టడానికి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సిద్ధంగా ఉన్నారు. భారత్ వచ్చే 2036 ఒలింపిక్స్ క్రీడలకు ఆతిథ్యమిచ్చే దిశగా బిడ్డింగ్‌కు ఉపకరించే క్రీడా బిల్లులను సభ ముందు ఉంచడానికి క్రీడల శాఖా మంత్రి మన్‌సుఖ్ మాండవీయా ఉద్యుక్తులవుతున్నారు. రాజ్యసభలో మరికొన్ని కీలకమైన బిల్లులను ప్రవేశపెట్టడానికి మంత్రులు అర్జున్ రామ్ మేఘ్‌వాల్, సర్బానంద సోనోవాల్ సిద్ధంగా ఉన్నారు. అయితే ప్రజలకు ఉపకరించే, ప్రపంచ క్రీడా వేదికపై దేశ ప్రతిష్టను పెంచే బిల్లులకు చట్టబద్ధత కల్పించే క్రతువులో పాలుపంచుకోవాలనే కనీసపు ఇంగిత జ్ఞానం విపక్ష కూటమికి లేకుండా పోయింది. ముందుగా చేసుకున్న ప్రణాళికలో భాగంగా ఉభయసభల్లోకి అడుగుపెట్టారు విపక్ష ఎంపీలు. వారి మనసంతా వీధినాటకం ఎలా ఆడాలనే దానిపైనే ఉండిపోయింది. పార్లమెంట్ మొదలుకాగానే రభసకు నడుం బిగించారు. లోక్‌సభలో స్పీకర్, రాజ్యసభలో ఛైర్మన్ స్థానంలో ఉన్నవారు వద్దు వద్దు అంటున్నా కానీ వినకుండా వెల్‌లోకి దూసుకొని వచ్చారు. కేంద్ర ప్రభుత్వానికి, కేంద్ర ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సభాసంప్రదాయాలకు విరుద్ధంగా ప్లకార్డులు ప్రదర్శించారు. అధికార పక్షం బిల్లుల ప్రస్తావనను చేసినప్పటికీ బేఖాతరు చేశారు. దీంతో మొదలైన కొద్ది సేపటికే ఉభయసభలు వాయిదాపడ్డాయి. అక్కడితో ప్రజాప్రతినిధులనే మాటకు పాతరేస్తూ విపక్షాల వీధి నాటకంలో మొదటి అంకం పూర్తయ్యింది. అంతా పార్లమెంట్ మకర్ ద్వార్ వద్దకు చేరుకున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే రాజ్యసభలో చెప్పిన దాని ప్రకారం 250 మంది ఇండియా కూటమి ఎంపీలు జమ అయ్యారు. జాతీయ గీతాన్ని ఆలపించారు. సమయం 11.30 గంటలవుతుందనగా వీధుల్లో నాటకం ఆడటానికి నిర్వాచన్ సదన్‌కు గుంపుగా బయలుదేరారు. వీరికి తోడు వారివారి స్థాయిని బట్టి వ్యక్తిగత భద్రతా సిబ్బంది కూడా ఉన్నారు. అయితే ఈసీ తనను కలుసుకోవడానికి 30 మందికి మాత్రమే అనుమతి ఇచ్చింది. కానీ ఇక్కడ చూడబోతే 250 మంది ఉన్నారు. పైగా నిత్యం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య ఉండే కీలకమైన ప్రాంతంలో వందలమంది మరీముఖ్యంగా వందలాది ఎంపీలు ప్రదర్శనగా బయలుదేరారు. ఏ మాత్రం తేడా వచ్చినా దేశ రాజధాని సాక్షిగా శాంతి, భద్రతలకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంది. దీన్ని ముందే గ్రహించిన ఢిల్లీ పోలీసులు భారీ సంఖ్యలో రంగంలోకి దిగారు. ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేశారు. అంబులెన్సులను, అగ్నిమాపక శకటాలను, ఎంపీలను తరలించడానికి వాహనాలను సిద్ధం చేశారు. నినాదాలు, ప్లకార్డులతో నానా హంగామా చేస్తూ ట్రాన్స్‌పోర్టు భవన్ దాకా వచ్చిన విపక్ష ఎంపీలను పోలీసులు అడ్డుకున్నారు. ఈసీ దగ్గరికి 30 మంది అని చెప్పి 250 మందితో




# ధి నాటకం

బయలుదేరిన విపక్ష కూటమికి వీధుల్లో ప్రదర్శన చేయడానికి పోలీసులు అనుమతి ఇవ్వలేదు. అదే విషయాన్ని తమతో వాగ్వాదానికి సిద్ధమైన ఎంపీలకు పోలీసులు చెప్పారు. అక్కడితో ఆగిపోతే విపక్షాలు చెప్పుకుంటున్నట్టుగా అది శాంతియుత ప్రదర్శనగా మిగిలిపోయేది. ప్రజల్లో దానికి కాస్తో కూస్తో గుర్తింపు వచ్చేది. కానీ అలా చేస్తే వారు విపక్షాలు ఎందుకవు తారు? దశాబ్దాలుగా దేశాన్ని పాలించి, పత్రికల్లో పతాక శీర్షికలకు ఎక్కడానికి ఎంతకైనా తెగించే కాంగ్రెస్ పార్టీ నేతలు ఎందుకవుతారు? ఆ సమయానికి కుర్చీలు ఎక్కడి నుంచి వచ్చాయో, ఎవరు తెచ్చారో కానీ 83 ఏళ్ల వయస్సు ఉన్న కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే, ఇంచుమించు అదే వయసులో ఉన్న రాజ్యసభ సభ్యుడు శరద్ పవార్ వాటిల్లో కూర్చున్నారు. పోలీసుల వైఖరిని ఖండిస్తూ రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, తదితరులు రోడ్డుపైన బైఠాయించారు.

వీధి నాటకానికి కథానాయకుడు, సూత్రధారి రాహుల్ గాంధీ నేతృత్వంలో మిగిలిన పాత్రధారులు రెచ్చిపోయారు. అఖిలేష్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ మహిళా ఎంపీలు మహువా మొయిత్రా, సుస్మితా దేవ్ బారికేడ్లపైకి ఎక్కేశారు. అటువైపు దూకడానికి ప్రయత్నించారు. కొందరు ఎంపీలు అత్యుత్సాహంతో వారిని అనుసరించారు. పోలీసులతో పెనుగులాడారు. ఘర్షణకు దిగారు. వాగ్వాదానికి దిగారు. అరుపులు, కేకలతో గందరగోళ వాతావరణం నెలకొంది. ఈ హడావుడిలో తృణమూల్ కాంగ్రెస్ మహిళా ఎంపీ మిథాలి భేగ్ సొమ్మసిల్లిపడిపోయారు. అక్కడే ఉన్న పోలీసులు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి శ్రుతిమించడంతో పోలీసులు విపక్ష ఎంపీలను అదుపులోకి తీసుకు న్నారు. నినాదాలు చేస్తూ, మీడియా ప్రతినిధుల ముందు మోదీ సర్కారుపైన, ఈసీపైన రంకెలు వేస్తూ రాహుల్, ఖర్గే తదితరులు వాహనాలు ఎక్కారు. పోలీసులు వారిని అక్కడి నుంచి తరలించారు. ఆ తర్వాత వారిని విడుదల చేశారు. ఇంత జరిగినా కానీ కాంగ్రెస్ నేతలు మాత్రం తమది శాంతియుత ప్రదర్శన అని చెప్పుకోవడం విశేషం. బారికేడ్ల మీద నుంచి దూకడానికి ప్రయత్నించి పోలీసులకు విషమపరీక్ష పెట్టిన ఎంపీల్లో ఒకరు తమ ప్రదర్శన 30 సెకండ్లలోనే ముగిసిపోయిందని వాపోవడం గమనార్హం. ఖర్గే లాంటివారైతే ఈసీకి వినతిపత్రాన్ని ఇద్దామని బయలుదేరిన తమను పోలీసులతో అడ్డుకుంటారా? అని ప్రధాని మోదీపై మండిపడ్డారు. కానీ ఈసీ చెప్పినట్టుగా 30 మందితో ప్రదర్శనగా కాకుండా ఎవరికి వారు సొంతవాహనాల్లో నిర్వాచన్ సదన్‌కు చేరుకొని ఆ వినతి పత్రమేదో అక్కడి అధికారులకు ఇచ్చి, ఆ తర్వాత మీడియాతో తాము చెప్పాల్సింది చెప్పుకొని ఉంటే పోలీసులకు పని తప్పేది కాదా? కానీ అలా చేస్తే ఇది ఒక మామూలు కార్యక్రమంగా మిగిలిపోయేది. కానీ మొదట్లో చెప్పుకున్నట్లుగా కాంగ్రెస్ పెద్దలు కోరుకున్న రీతిలో నవరసాల వీధి నాటకం హస్తినలోని ట్రాన్స్‌పోర్ట్ భవన్ వద్ద ఆవిష్కృతమయ్యేది కాదు. అలాగని అది విజయవంతమైందా అంటే అదీ లేదు. ఎందుకంటే దానిలో ప్రజలకు పనికొచ్చే విషయం ఏదీ లేదు కాబట్టి. ఓట్ల చోరీ... ఓట్ల చోరీ అంటూ ఈసీ మీద పడి ఏడుస్తున్న కాంగ్రెస్ పార్టీ తన ఏలుబడిలోని కర్ణాటక రాష్ట్రాన్ని కార్యక్షేత్రంగా చేసుకొని బొక్కాబోర్లాపడింది. మన హయాంలోనే కదా ఓటర్ల జాబితా తయారైంది.. దానికి ఇతరులను తప్పు పట్టడం ఎందుకు? ఇంత హడావుడి ఎందుకు? అని కాంగ్రెస్ అధిష్టానాన్ని, మరీ ముఖ్యంగా రాహుల్ గాంధీని నిజాయితీగా నిలదీసిన కర్ణాటక మంత్రి రాజన్నపై ఇదే వీధి నాటకం రోజున వృద్ధ పార్టీ వేటు వేసింది. ఓట్ల చోరీ పేరిట నెలల తరబడి తాను సాగిస్తున్న నాటకానికి ఒక మంత్రి పదవిని బలిగొంది. కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ లబ్ధి కోసమని ముమ్ముందు మరెంత మందిని బలిపెడు తుందో, ఇంకెన్ని వీధినాటకాలు ఆడేదీ వేచి చూడాలి. ఈ రాజకీయ చదరంగంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పావులుగా వాడుకోవడానికి ప్రయత్నించడం ద్వారా, దేశానికి స్వరాజ్యం తెచ్చామని ఘనంగా చెప్పుకునే ఆ పార్టీ అత్యంత హేయమైన స్థితికి దిగజారడం యావత్ జాతి స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోవడానికి



సిద్ధమవుతున్నవేళ చోటు చేసుకోవడం అత్యంత దురదృష్టకరం. జైరామ్ రమేశ్ లాంటి కాంగ్రెస్ నేతలు చేసే వ్యాఖ్యలు దీనికి నిదర్శనంగా నిలుస్తాయి. తమకు ఏదైనా నచ్చకపోయినా, ఎన్నికల్లో గెలవక పోయినా ప్రజాస్వామ్యం హత్యకు గురైందని అనడం ఇలాంటి కాంగ్రెస్ నేతలకు పరిపాటిగా మారి పోయింది. అయినదానికి, కానిదానికి ప్రజా స్వామ్యంతో ముడిపెట్టడం ఓ అలవాటైపోయింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేది మరీ విచిత్రమైన పరిస్థితి. ఆయన కాంగ్రెస్ అధ్యక్షుడు మాత్రమే కాదు. రాజ్యసభలో విపక్ష నేత కూడా. హస్తినలో వీధినాటకం ముగిసిన తర్వాత తీరుబడిగా సాయంత్రం నాలుగు గంటలకు రాజ్యసభకు వచ్చారు. కీలకమైన బిల్లులపై మాట్లాడాలని ఛైర్మన్ స్థానంలో కూర్చున్న సురేంద్ర సింగ్ నాగర్ మైకును ఇస్తే ఖర్గే దాన్ని వదిలేసి తాము చేపట్టిన వీధినాటకానికి హాజరైన ఎంపీల సంఖ్యను, నాటకం జరిగిన తీరును వివరంగా చెప్పడం మొదలు పెట్టారు. బిల్లులపై మాట్లాడాలని ఛైర్మన్ అదేపనిగా కోరినా పట్టించుకోలేదు. ఇదేమిటని అడిగిన అధికార పక్ష సభ్యులపై కాంగ్రెస్ ఎంపీ విరుచుపడ్డారు. చివరకు తోటి విపక్ష సభ్యులతో రాజ్యసభ నుంచి వాకౌట్ చేశారు. ఇక లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ వ్యవహారశైలి అయితే మరీ విడ్డూరంగా ఉంటుంది. ఎక్కడికైనా సరే తన వెంట జేబులో పట్టేంత ఉండే ఒక ఎరుపు రంగు పుస్తకాన్ని తీసుకొనివెళుతుంటారు. దాని మీద రాజ్యాంగం అని రాసి ఉంటుంది. పోనీ పుస్తకంలో అచ్చువేసిన పేజీలను చూపిస్తారా? అంటే అలాంటిదేమీ ఉండదు. కేవలం ఓ ఇంద్రజాలికుడి తరహాలో ఆ పుస్తకాన్ని ఒక్క చేత్తో పట్టుకొని గాల్లోకి లేపి అందరికీ చూపిస్తారు. గతంలో ఆయన చేసే విమర్శలు మోదీ ప్రభుత్వానికి మాత్రమే పరిమితమై ఉండేది. కానీ తాజాగా రాహుల్ కళ్లకు ఈసీ కూడా ఓ పాపాల భైరవుడిలా కనిపిస్తోంది. ఇటీవల ప్రధాని మోదీ తన నియోజకవర్గమైన వారణాసిలో ప్రభుత్వ కార్యక్రమాలు పెట్టుకునే రోజునే రాహుల్ గాంధీ న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో పార్టీ న్యాయవాదుల విభాగం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఎప్పటిలాగానే వేదికపైన ఎర్రటి పుస్తకాన్ని రాజ్యాంగం అని పరిచయం చేశారు. అక్కడితో ఆగకుండా రాజ్యాంగం దేశ ప్రజల రక్తంతో తయారైందని వ్యాఖ్యానించారు. ఇక ఈసీపై విరుచుకుపడ్డారు. అంతటి పవిత్రమైన రాజ్యాంగాన్ని అవమానించేలా ఈసీ వ్యవహరిస్తోందని మండి పడ్డారు.

**స్వంత లాభానికి కూటమిని కలపడానికి ఎరగా ఈసీ**

కాంగ్రెస్ పార్టీ ఇండియా కూటమికి దూరంగా తలో దిక్కుకు పారిపోతున్న పార్టీలను మళ్లీ ఒక దగ్గరకు చేర్చడానికి ఈసీని ఎరగా వాడుకుంటుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. మరి రెండు రోజుల్లో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు మొదలవుతాయనగా ఇండియా కూటమి ఆన్‌లైన్‌లో నిర్వహించిన సమావేశం ఇందుకు నిదర్శనంగా నిలిచింది. సమావేశానికి తాము హాజరయ్యేది లేదని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రకటించింది. కూటమి నుంచి ఇప్పటికే నిష్క్రమించినట్టు వెల్లడించింది. కాంగ్రెస్ పార్టీ ఇప్పటిదాకా ఏం ఘనకార్యం చేసిందని కూటమికి నేతృత్వం వహిస్తోందని నిలదీసింది. ఆ పార్టీ కూటమిని ఏర్పాటు చేసిన ఇన్నేళ్లలో ఎన్నిసార్లు కూటమిని సమావేశపరిచిందీ చెప్పాలని ప్రశ్నించింది. విపక్షాల కూటమి విషయంలో కాంగ్రెస్ ఉదాసీన వైఖరిని మొదట్నుంచి గమనిస్తూ వస్తున్న పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కూడా ఆన్‌లైన్ సమావేశానికి దూరంగా ఉంటున్నట్టు ప్రకటించింది. పార్లమెంట్ సమావేశాలు మొదలవుతున్న తరుణంలో తనకు నష్టం కలిగించే విధంగా కూటమి కకావికలై పోతుండటం కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందికరంగా మారింది. దీంతో ఓట్ల చోరీ అనే కట్టు కథను అల్లి కూటమిని పేకమేడలా కూలిపోకుండా కాపాడు కోవాలని నిర్ణయించుకుంది. అంతకుమునుపు మహారాష్ట్రలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయని, ఆ కారణంగానే అక్కడ తమ పార్టీ ఓటమి పాలైందంటూ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీతో ఒకానొక ఆంగ్ల దినపత్రికలో పెద్ద వ్యాసాన్ని రాయించినప్పటికీ అది ఎందుకూ పనికిరాకుండా పోవడాన్ని పార్టీ పెద్దలు గ్రహించారు.

ఇదిలా ఉండగా ఈసీ బిహార్‌లో ఓటర్ల జాబితాపై ప్రత్యేక సమగ్ర సవరణ–సర్ చేపట్టాలని నిర్ణయించ డాన్ని తనకు అనుకూలంగా మార్చుకోవాలని కాంగ్రెస్ పార్టీ తలపోసింది. సర్ జరుగుతున్న వేళ దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. విదేశాల నుంచి భారత్‌కు అక్రమంగా తరలి వచ్చినవారు దేశ భద్రతకు పెను ముప్పుగా మారుతున్న తరుణంలో బిహార్‌లోని ఓటర్ల జాబితాలో నేపాల్, బాంగ్లాదేశ్ లాంటి పొరుగుదేశాలకు చెందినవారు ఓటర్లుగా నమోదై ఉన్నారని ఈసీ గుర్తించింది. అలా గుర్తించిన వారి పేర్లను జాబితా నుంచి తొలగిస్తామని ప్రకటించింది. సర్‌ను దేశవ్యాప్తంగా చేపడతామని వెల్లడించింది. దీంతో ఇన్నాళ్లూ అక్రమ వలసదారులను తమ ఓటు బ్యాంకుగా మార్చుకొని బిహార్ రాజకీయాల్లో ఆడిందే ఆటగా, పాడిందే పాటగా వ్యవహరిస్తోన్న కాంగ్రెస్, సమాజ్‌వాది పార్టీ, రాష్ట్రీయ జనతాదళ్ పార్టీలకు తోడు, పశ్చిమబెంగాల్ అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి, తమిళనాడులో అధికార ద్రవిడ మున్నేట్ర కళగం–డీఎంకే పార్టీలకు గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. సర్‌ను మొగ్గలోనే తుంచివేయకపోతే తమ అస్తిత్వానికే ముప్పు వస్తుందని భయపడ్డాయి. సుప్రీంకోర్టును ఆశ్రయించాలని నిర్ణయించుకున్నాయి.

**సుప్రీంకోర్టులోనూ చుక్కెదురు**

బిహార్‌లో ఓటర్ల జాబితాలో ప్రత్యేక సమగ్ర సవరణ –సర్ పేరిట ఈసీ అక్కడి ప్రజలను ప్రస్తుతం ఉన్న డాక్యుమెంట్లు కాకుండా కొత్త కొత్త డాక్యుమెంట్లు సమర్పించాలని కోరుతూ ఇబ్బంది పెడుతుందని ఆరోపిస్తూ, సర్‌ను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో కొన్ని పిటిషన్లు దాఖలైనాయి. పిటిషన్‌లు దాఖలు చేసినవారిలో ప్రజాస్వామ్య సంస్కరణల అసోసియేషన్–ఏడీఆర్ అనే ఎన్జీవో, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ మహువా మొయిత్రా, రాష్ట్రీయ జనతాదళ్ నేత మనోజ్ ఝా సహా తొమ్మిది రాజకీయ పార్టీలు, సామాజిక విశ్లేషకుడు, ఆమ్ ఆద్మీ పార్టీ మాజీ నేత యోగేంద్ర యాదవ్, సామాజిక కార్యకర్త అర్షద్ అజ్మల్ ఉన్నారు. సీనియర్ అడ్వకేట్లు గోపాల్ నారాయణన్, కపిల్





సిబల్, అభిషేక్ మను సింఘ్వీ,షాదన్ ఫరాసత్, బృందా గ్రోవర్, నిజామ్ పాషాతో కూడిన బృందం పిటిషనర్ల తరఫున రంగంలోకి దిగింది. సీనియర్ అడ్వకేట్లు కేకే వేణుగోపాల్, రాకేశ్ ద్వివేది, మణీందర్ సింగ్ ఈసీ తరఫున నిలిచారు. అయితే సర్‌కు వ్యతిరేకంగా పిటిషన్లు దాఖలు చేసిన ఏ ఒక్కరూ బిహార్‌కు చెందిన ఓటర్లు కాకపోవడం విశేషం. ఇదే విషయాన్ని ఈసీ తరఫు న్యాయవాదులు సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొనివచ్చారు. అయితే సర్‌ను దేశవ్యాప్తంగా చేపడతామనిఈసీ ప్రకటించినందున ఆ ప్రక్రియ బిహార్ రాష్ట్రేతర ఓటర్లకు కూడా వర్తిస్తుందని పిటిషనర్ల తరఫు సీనియర్ అడ్వకేట్లు వాదించారు. ఈ సందర్భంగా ఆధార్ లాంటి డాక్యుమెంట్లను గుర్తించాలని సుప్రీంకోర్టు ఈసీని కోరగా బిహార్‌లో సర్ చేపట్టిన సందర్భంగా ఓటర్ల జాబితాలో ఉన్న అక్రమ వలసదారులు ఆధార్ కార్డు కలిగి ఉన్న వైనాన్ని ఈసీ సర్వోన్నత న్యాయస్థానం దృష్టికి తీసుకొని వచ్చింది. సుప్రీంకోర్టు ఆ తర్వాత కొద్దిరోజులు వాదోపవాదాలు విన్న తర్వాత సర్‌పై స్టే విధించేది లేదని తేల్చి చెప్పింది. అక్రమ ఓట్ల ఏరివేతలో ఈసీకి పచ్చజెండా చూపింది. విపక్షాలు ఇంత రాద్ధాంతం చేసిన సర్‌కు బిహార్ ఓటర్లు బ్రహ్మరథం పట్టారు. పెద్ద సంఖ్యలో ఆ ప్రక్రియలో పాల్గొన్నారు. ఈసీ చెప్పిన దాని ప్రకారం 92.5 శాతానికి పైగా ఓటర్లు సర్‌కు మద్దతు ఇచ్చారు. ఓటర్ల జాబితాకు మార్పులు, చేర్పులు చేయడంలో కీలకమైన పాత్రను పోషించారు. ఈసీ ఆగస్టు ఒకటవ తేదీన బిహార్‌లో ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. 65 లక్షల మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించినట్టు ప్రకటించింది. ఓటర్ల తొలగింపు వ్యవహారం సుప్రీంకోర్టులో వాదోప వాదాలకు దారి తీసింది. తొలగింపునకు గురైన 65 లక్షల మంది ఓటర్ల వివరాలను కోర్టుకు సమర్పించా లని, కారణాలను తెలపాలని ఈసీని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. అయితే తొలగించిన ఓటర్ల వివరాలను, కారణాలను వెల్లడించాల్సిన అవసరం ఈసీకి లేదని ఈసీ తరఫు న్యాయవాదులు వాదించారు.దీంతో ఓటర్ల తొలగింపు, చేరిక ఈసీ పరిధిలోనే ఉంటుందని సుప్రీంకోర్టు పేర్కొంది.

**పార్లమెంట్‌లోనూ విపక్షాల ఆటకట్టు**

ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లోనూ విపక్షాల వైఖరి విస్తుగొలిపేలా ఉంది. జూలై 21న సమావేశాల ఆరంభంలో ఆపరేషన్ సిందూర్‌పై చర్చ జరపాలని భావించి నప్పటికీ అప్పట్లో ప్రధాని మోదీ విదేశీ పర్యటనలో ఉన్న కారణంగా చర్చను జూలై 28న చేపట్టాలని నిర్ణయించారు. కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ లోక్‌సభలో చర్చకు నాంది పలికారు.ఆపరేషన్ సిందూర్ సాధించిన ఘనతను, అంతర్జాతీయ వేదిక భారత్ ప్రతిష్ట వైనాన్ని సభకు వివరించారు. అయితే దశాబ్దాల కాలంగా తాము సాధించలేనిది, కేవలం 11 ఏళ్లలో మోదీ ప్రభుత్వం సాధించడాన్ని కాంగ్రెస్ పార్టీ సభ్యులు జీర్ణించుకోలేకపోయారు. ముఖ్యంగా లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే చర్చ జరుగుతున్నప్పుడు వ్యవహరించిన తీరు ప్రజల విమర్శలకు గురైంది. రాహుల్ గాంధీ చర్చలో మాట్లాడుతూ "నిన్ను కొట్టాము.. నువ్వు మమ్మల్ని కొట్టవద్దు అని ఎవరైనాశత్రువుతో అంటారా? మన ప్రభుత్వం మాత్రం ఆపరేషన్ సిందూర్ చేపట్టిన తర్వాత పాకిస్తాన్‌కు దాని గురించి చెప్పింది" అని అంటూ ఏదేదో మాట్లాడుతూ ఎదురుగా ఉన్న బల్లను అదేపనిగా చేతితో కొట్టడం మొదలుపెట్టారు. అది ఎంత దాకా వెళ్లిందంటే... మీ ఎదురుగా ఉన్న బల్ల పార్లమెంట్ ఆస్తి.. దాని జోలికి వెళ్లకండి అని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా రాహుల్‌కు పదేపదే చెప్పేదాకా వెళ్లింది. ఇక మల్లికార్జున్ ఖర్గే విషయానికి వస్తే ప్రధాని మోదీ ఇదివరకే లోక్‌సభలో చర్చకు సమాధానం ఇచ్చినప్పటికీ రాజ్యసభలో చర్చకు కూడా సమాధానం ఇవ్వాలని పట్టుపట్టారు. చర్చకు సమాధానం ఇస్తున్న హోమ్ మంత్రి అమిత్ షాను అడుగడుగునా అడ్డుకున్నారు.

అయితే ముంబై ఉగ్రదాడులపై పార్లమెంట్‌లో జరిగిన చర్చకు అప్పటి హోమ్ మంత్రి సమాధానం ఇచ్చిన వైనాన్ని ఖర్గేకు అమిత్ షా గుర్తు చేశారు. దీంతో కంగుతిన్న ఖర్గే నోటమాట రాక రాజ్యసభ నుంచి వాకౌట్ చేశారు. ఇలా ఆపరేషన్ సిందూర్ విషయంలో ప్రభుత్వాన్ని పార్లమెంట్‌లో ఇరకాటంలో పెడతామనుకున్న ఉభయ సభల విపక్ష నేతల ఆటలు ఏ మాత్రం సాగలేదు.

**సర్‌పై పార్లమెంట్‌లో చర్చ నిషిద్ధం**

విపక్షాలు ఆపరేషన్ సిందూర్ విషయంలో అభాసు పాలుకావడంతో పార్లమెంట్‌లో సర్ అంశాన్ని భుజానికి ఎత్తుకున్నాయి. అదేపనిగా పార్లమెంట్ కార్యకలాపాలకు అడ్డుపడ్డాయి. సర్‌పై సాకులు చెప్పకుండా చర్చకు అనుమతించాలంటూ రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్‌కు ఖర్గే లేఖ రాశారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు ఈ విషయమై దీటుగా స్పందించారు. ఈసీ లాంటి స్వయంప్రతిపత్తి కలిగిన రాజ్యాంగ బద్ధమైన సంస్థ పనితీరును పార్లమెంట్ చర్చించ రాదనే రూలింగ్‌ను సుదీర్ఘకాలానికి లోక్‌సభ స్పీకర్‌గా పనిచేసిన బలరామ్ జాకర్ ఇచ్చారని గుర్తు చేశారు. అదీ కాకుండా సర్ సుప్రీంకోర్టు పరిధిలో ఉన్న కారణంగా అది చర్చనీయాంశం కాదని స్పష్టం చేశారు.

**కాంగ్రెస్ నట్టింట్లో పేలిన రాహుల్ ఆటంబాంబు**

రాహుల్ గాంధీ పార్లమెంట్ ఇంటా బయటా తమ పప్పులు ఉడకకపోవడంతో కంగారుపడ్డారు. ఓటర్ల జాబితాలో అక్రమాలపై త్వరలో ఆటంబాంబు పేల్చుతానని ప్రకటించారు. ఆగస్టు 8న ఇండియా కూటమి నేతలను తన ఇంట రాత్రిపూట విందుకు ఆహ్వానించారు. ఇదిగో ఆటంబాంబు అంటూ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ ప్రజంటేషన్ వెనుక ఆరు నెలల శ్రమ దాగి ఉందని చెప్పుకొచ్చారు. అనేక రాష్ట్రాల్లో ఓట్ల చోరీ జరిగిందంటూ ఏవేవో లెక్కలు చూపించారు. తమ పార్టీ ఏలుబడిలోని కర్ణాటకలోని మహదేవపుర నియోజకవర్గంలో ఒక లక్షకుపైగా ఓట్లు చోరీకి గురయ్యాయని తెలిపారు. లెక్కలకు పత్రమూ, ఆధారమూ చూపించాలంటూ ఆయా రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు రాహుల్ గాంధీకి నోటీసులు పంపించారు. మహదేవ పుర వ్యవహారంతో కర్ణాటక కాంగ్రెస్‌లో అగ్గిరాజుకుంది. కాంగ్రెస్ నేతృత్వంలో విపక్షాలు హస్తినలో వీధి నాటకం ఆడుతున్నప్పుడే ఆ అగ్గి కర్ణాటక మంత్రి రాజన్న పదవికి మంటపెట్టింది. ఈ మంట ఎక్కడి దాకా వ్యాపిస్తుందో చెప్పలేని పరిస్థితి. కాంగ్రెస్‌కు దాన్ని ఆర్పడం వల్లకాని పని.

**– జాగృతి డెస్క్**



**కర్ణాటకలో ప్రజల విశ్వసనీయతను కాపాడుకోవడానికి నానాతంటాలు పడుతున్న అధికార కాంగ్రెస్ పార్టీకి రాష్ట్ర సహకార మంత్రి కేఎన్ రాజన్న రూపేణా కొత్త సంక్షోభం వచ్చిపడింది. రాజన్న ఓటరు గుర్తింపు వ్యవహారంపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు పార్టీని ఇబ్బందికర పరిస్థితిలోకి నెట్టివేయడమే కాకుండా బీజేపీకి కాంగ్రెస్‌పై అన్ని వైపుల నుంచి దాడి చేయడానికి ఒక సరికొత్త ఆయుధాన్ని అందించింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగిందంటూ కనిపించినవారికల్లా చెబుతున్న రాహుల్ గాంధీ వైఖరిని, ఆరోపణలను రాజన్న తోసిపుచ్చారు.**

# రాజన్నను చూసి నేర్చుకో రాహుల్..!

రాష్ట్రంలో బెంగళూరు సెంట్రల్ లాంటి కీలకమైన నియోజకవర్గాలను కోల్పోవడానికి కూడా పార్టీ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రాహుల్ తరహాలోనే రాజన్న కూడా ఓ ఆటంబాంబు పేల్చారు. మన ప్రభుత్వం ఏలుబడిలోనే రాష్ట్రంలో ఓటర్ల జాబితాల సవరణ జరిగిందనే విషయాన్ని కాంగ్రెస్ పార్టీలో ప్రతీ ఒక్కరు గుర్తుంచుకోవాలని హితవు చెప్పారు. “అప్పుడెందుకని మన పార్టీ (కాంగ్రెస్) ఈ విషయాన్ని (ఓట్ల చోరీ) చూసీచూడనట్టుగా వదిలేసింది? అవకతవకలు ఉన్న మాట నిజమే. కానీ అది మన ఏలుబడిలో జరగడం మనకు అత్యంత అవమానకరం” అని వ్యాఖ్యానించారు. కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసిన తర్వాత ఏమైనా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకొనిరావాలని ప్రకటించిన విషయాన్ని పార్టీ సహచరులకు ఆయన గుర్తు చేశారు. “ఓటర్ల జాబితా లాంటి విషయాల్లో సకాలంలో స్పందించాల్సిన బాధ్యత మనకు ఉండాలి. మనం అప్పట్లోనే ఏమైనా ఉంటే అభ్యంతరాలను (ముసాయిదా ఓటర్ల జాబితా) లేవనెత్తి ఉండాల్సింది. ఇన్నాళ్లూ మౌనంగా ఉండిపోయి


రాజన్న

ఇప్పుడు దాని గురించి మాట్లాడుతున్నాం” అని రాజన్న పరోక్షంగా రాహుల్ గాంధీకి చురకలు అంటించారు. అయితే రాజన్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వర్గానికి చెందినవారు కావడంతో సీఎం పోస్టు కోసమని సిద్ధరామయ్యపై అంతర్గతంగా పోరాడుతున్న ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ వర్గం రాజన్నపై నిప్పులు చెరిగింది. పార్టీ ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారంటూ మండిపడింది. ఇదే విషయమ్పై డీకే శివకుమార్ మద్దతుదారుడు, కునిగల్ ఎమ్మెల్యే హెచ్‌డీ రంగనాథ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఓట్ల చోరీ వ్యవహారంపై దర్యాప్తు జరిపించాలని నిర్ణయించింది. అడ్వకేట్ జనరల్‌ను ఒక నివేదిక సమర్పించాలని కోరింది అని తెలిపారు. దర్యాప్తు చేపట్టకముందే మన సొంత పార్టీకి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడటం క్షమించరానిది. పార్టీ అధిష్టానం ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించాలి. ఇలాంటి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు ముగింపు చెప్పాలి అని అన్నారు.

అయితే ఈ విషయం ఇక్కడితో ఆగిపోలేదు. పార్టీ బెంగళూరు కేంద్రీయ ప్రచార కమిటీ అధ్యక్షుడు జీ ప్రకాష్ నేతృత్వంలోని కాంగ్రెస్ నేతలు, కార్యకర్తల బృందం రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జ్ రణదీప్ సింగ్ సుర్జేవాలాకు తీవ్రమైన పదజాలంతో ఒక రాతపూర్వకమైన ఫిర్యాదును చేసింది. రాజన్న ప్రకటనలు అయోమయాన్ని సృష్టిస్తున్నాయి. ఓట్ల చోరీ అంటూ రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలను కాలరాస్తున్నాయి. పార్టీలో ఐకమత్యాన్ని దెబ్బతీస్తున్నాయి అని ఫిర్యాదులో పేర్కొన్నారు. కర్ణాటక కాంగ్రెస్ శ్రేణుల నుంచి ఈ రకమైన ఆగ్రహం వ్యక్తం కావడం సబబైనదే. ఎందుకంటే రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ – కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, వేలాదిగా కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు రాజన్న వివాదాస్పద వ్యాఖ్యలు చేయడానికి రెండు రోజుల ముందు బెంగళూరులో

శ్రీ ఆంజనేయ స్మాల్ అగ్రి టూల్స్
కలుపు పరికరాలు, కూరగాయల పంటలు, టెర్రస్ గార్డెన్‌లో వాడే పరికరాలు
1) అయ్యన్న వీడర్ రూ.1200/- 2) అన్నమయ్య వీడర్ రూ. 2000/-
3) ఒంగోలు గిత్త ప్లోయింగ్ వీడర్ రూ. 3000/- 4) రామయ్య వీడర్ రూ. 1500/-


Visit Youtube Link:
• Agriculture Implements at low cost - Rythu Nestham
• Low Cost agriculture machines to farmers - HMTV
Contact Number : 9849140465

భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఆ ఆందోళన కార్యక్రమం 2024 లోక్‌సభ ఎన్నికల్లో మహదేవపుర నియోజకవర్గంలో బీజేపీ పెద్ద ఎత్తున ఓటర్ల అక్రమాలకు పాల్పడిందని ఆరోపించడం ముఖ్య ఉద్దేశంగా జరిగింది. ఒక లక్షకుపైగా ఓట్లు చోరీకి గురైనాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. అలాంటి ఒక తీవ్రమైన ఆరోపణ చేయడం ద్వారా ప్రజల భావోద్వేగాలను సొమ్ము చేసుకొని, తనకు అనుకూలంగా మార్చుకోవాలని కాంగ్రెస్ కోటి ఆశలు పెట్టుకుంది. అయితే రాజన్న చేసిన ఏక వాక్య విమర్శతో పార్టీ ఆత్మరక్షణలో పడిపోయింది. రాజన్న కాంగ్రెస్ హయాంలోనే ఓట్ల జాబితా రూపొందిందని ఒప్పుకోవడం ద్వారా పార్టీ తన సొంత వైఫల్యాలకు ఇతరులను నిందిస్తున్నదని ప్రజలకు అత్యంత ప్రభావ వంతంగా చెప్పగలిగారు. ఇది బీజేపీ అమ్ముల పొదిలోకి అయాచితంగా వచ్చిపడిన ఆయుధం. అది బీజేపీ ప్రమేయం లేకుండానే రాహుల్ గాంధీ ఆరోపణల వెనుక విశ్వసనీయతను తునాతునకలు చేసింది. కాంగ్రెస్ నాయకత్వానికి నిజాయితీ, సమర్థత లేదని నిరూపించింది. కర్ణాటక కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలను అర్థం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదే రాజన్నపై చేసిన ఫిర్యాదులోనూ జరిగింది. ఆయన ఒక సీనియర్ మంత్రిగా ప్రజల మధ్యలో పార్టీని వెనుకేసుకొని రావాలి తప్ప దాన్ని కాలరాయకూడదని ఫిర్యాదు పేర్కొంది. ఆయన అదేపనిగా వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం రాష్ట్రంలో కాంగ్రెస్ పరిస్థితిని బలహీన పరిచింది. పార్టీకి మరింత నష్టం జరగకమునుపే రాజన్నను ప్రభుత్వం నుంచి, పార్టీ నుంచి వెంటనే తొలగించాలని కాంగ్రెస్ అధిష్టానానికి పార్టీనేతలు విజ్ఞప్తి చేశారు. బీజేపీకి ఓట్ల చోరీ విషయమై ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ చిత్తశుద్ధిని ప్రశ్నించే అవకాశం వచ్చింది. ఇదే విషయమై విపక్ష నేత ఆర్ అశోక ఎక్స్‌లో చేసిన పోస్టులో "మంత్రి రాజన్న కాంగ్రెస్ ప్రభుత్వం



అశోక

**కర్నాటకలో మహదేవపుర నియోజకవర్గానికి చెందిన 70 ఏళ్ల శకున్ రాణి రెండు సార్లు ఓటు వేశారంటూ చేసిన అభియోగానికి తగిన పత్రాలను సమర్పించాలని ఆదేశించారు. అభియోగానికి సంబంధించి శకున్ రాణిని విచారించగా, తాను ఒకసారి మాత్రమే ఓటు వేసినట్టు ఆమె తెలిపారని రాహుల్‌కు పంపించిన నోటీసులో సీయీవో పేర్కొన్నారు.**




హయాంలోనే ఓటర్ల జాబితా సిద్ధమైందనే సత్యాన్ని బహిర్గతం చేశారు. అప్పుడు చూసీచూడనట్టుగా వదిలేసి దాని గురించి ఇప్పుడు మాట్లాడటంలో ప్రయోజనం ఏముంటుంది? రాజన్న ఈ విషయం గురించి రాహుల్ గాంధీతో మాట్లాడిందీ లేనిదీ డీకే శివకుమార్ లేదా సీఎం సిద్ధరామయ్య స్పష్టం చేయాలి" అని డిమాండ్ చేశారు. ఈ తీవ్రమైన రాజకీయ విమర్శ రాహుల్ గాంధీ నాయకత్వాన్ని ఎద్దేవా చేయడంతో ఆగి పోలేదు. అది కాంగ్రెస్‌లో లోతైన లుకలుకలను బహిర్గతం చేసింది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని పాలించడం లేదా బీజేపీని బాధ్యురాలిని చేసే సంగతి కాదు కానీ కనీసం మంత్రులను దారిలో పెట్టుకోలేక పోతున్నదనే అభండాన్ని మూటగట్టుకున్నది. రాజన్న చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ బెంగళూరులో నిర్వహించిన అతిపెద్ద ఆందోళన కార్యక్రమం వెనుక ఔచిత్యాన్ని ప్రశ్నార్థకం చేసింది. వారి సొంత సర్కారు కన్నుసన్నల్లోనే ఓట్ల చోరీ జరిగిన పక్షంలో అదే అంశంపై వారు చేపట్టిన ఆందోళన కార్యక్రమం నిజాయితీతో కూడుకున్నదని ప్రజలు ఎందుకు నమ్మాలి? ఈ ఆత్మవంచన రాహుల్ గాంధీ చేపట్టిన ప్రచారం నుంచి లబ్ధి పొందాలని కాంగ్రెస్ కంటున్న కలలను కల్లలు చేసింది. అది ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారడం వృద్ధ జాతీయ పార్టీ స్వయంకృతాపరాధం.

**రాహుల్‌కు కర్ణాటక సీయీవో నోటీసులు**

కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి కర్ణాటక ప్రధాన ఎన్నికల అధికారి–సీయీవో ఆగస్టు 10న నోటీసులు జారీ చేశారు. కర్ణాటకలో మహదేవపుర నియోజకవర్గానికి చెందిన 70 ఏళ్ల శకున్ రాణి రెండు సార్లు ఓటు వేశారంటూ చేసిన అభియోగానికి తగిన పత్రాలను సమర్పించాలని ఆదేశించారు. అభియోగానికి సంబంధించి శకున్ రాణిని విచారించగా, తాను ఒకసారి మాత్రమే ఓటు వేసినట్టు ఆమె తెలిపారని రాహుల్‌కు పంపించిన నోటీసులో సీయీవో పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎంపీ తన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లో చూపించిన ఇమేజ్‌లలో శకున్ రాణి పేరుతో ఉన్న ఇమేజ్‌లో కనిపిస్తున్న డాక్యుమెంట్ పోలింగ్ అధికారి జారీ చేసిన డాక్యుమెంట్ కాదని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ ఆగస్టు ఎనిమిదవ తేదీన తన యూట్యూబ్ చానెల్‌లో అప్‌లోడ్ చేసిన ఒక వీడియోలో మహదేవపుర నియోజకవర్గంలో 1,00,250 ఓట్లు చోరీకి గురయ్యాయని ఆరోపించారు. అందులో డూప్లికేట్ ఓటర్లు దాదాపు 12 వేల మంది, నకిలీ లేదా చెల్లుబాటి కాని చిరునామాల్లో 40 వేల మంది, ఒకే చిరునామాలో నమోదు చేసుకున్న వారు 10 వేల మంది, చెల్లుబాటుకాని ఫొటోలతో ఓటర్లుగా నమోదు చేసుకున్నవారు 4,100 మంది, కొత్త ఓటర్లుగా ఫామ్–6ను దుర్వినియోగం చేసుకున్నవారు దాదాపు 34వేల మంది ఉన్నారని గణాంకాలతో సహా నిరూపించడానికి ప్రయత్నించారు. తన గణాంకాలు నిజమే అని నమ్మించడానికి అన్నట్టుగా శకున్ రాణి రెండుసార్లు ఓటు వేశారని ఆరోపిం చారు. అలా చెప్పడం ఆయన మెడకు చుట్టుకుంది. ఆరోపణకు తగిన పత్రాలు సమర్పించాలని కర్ణాటక సీయీవో నోటీసు జారీ చేయడంతో రాహుల్ పరిస్థితి అగమ్యగోచరంగా మారిపోయింది.

**కర్ణాటక మంత్రి రాజన్న రాజీనామా**

ఓటర్ల జాబితా తయారైంది మన ఏలుబడిలోనే కదా అని సొంత పార్టీని నిజాయితీగా నిలదీసిన సహకార మంత్రి కేఎన్ రాజన్న ఆగస్టు 11న తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు పంపించారు. ఆయన్ను నిలువరించేందుకు సిద్ధరామయ్య చివరి నిమిషం వరకు ప్రయత్నాలు చేశారు. పార్టీ అధిష్టానంతో చర్చలు జరిపారు. అయితే ఎలాంటి సంజాయిషీలకు అధిష్టానం అంగీకరించలేదని పార్టీ వర్గాలు వెల్లడించాయి. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ లేవనెత్తిన ఓట్ల చోరీ అంశానికి వ్యతిరేకంగా రాజన్న వ్యాఖ్యలు చేయడంపై అధిష్టానం ఆగ్రహించిందని తెలిపాయి. దీంతో రాజన్న రాజీనామాను ఆమోదించి, దానిని వెంటనే గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ కార్యాలయానికి పంపించాలని ముఖ్య మంత్రిని ఆదేశించింది. ఫలితంగా సిద్ధరామయ్య రాజన్న రాజీనామా లేఖను గవర్నర్‌కు పంపించడం, గవర్నర్ దాన్ని ఆమోదించడం జరిగిపోయాయి.

– జాగృతి డెస్క్

**ఆయనకు అధికార పార్టీ మీద నమ్మకం లేదంటే అర్థం చేసుకోగలం. కానీ దేశాన్నే నమ్మడం లేదు. మన ఆంతరంగిక భద్రతను, ఆర్థికరంగాన్ని, రక్షణ వ్యవస్థను దెబ్బ తీయాలని ప్రయత్నించి బొక్క బోర్లాపడ్డారు. ఇప్పుడు మన ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తున్న ఎన్నికల వ్యవస్థ మీద పడుతున్నాడు. బట్ట కాల్చి మీదేసి తేల్చుకోండి అని సవాళ్లు విసరడం, బురద చల్లి కడుక్కోమని సలహా ఇవ్వడం ఆయన నైజం. ఇదీ హిట్ అండ్ రన్ కేసే. ఇదంతా రాహుల్ గాంధీ అనే విపక్ష నేత గురించే. ఇదంతా చూస్తే రాహుల్ ఉండగా మనకు శత్రుదేశం ఎందుకు? వేరే విదూషకుడు ఎందుకు? అన్న ప్రశ్నలు వస్తాయి.**



# వినాశకర

రాహుల్ నిజమైన భారతీయుడేనా? ఇదేదో బీజేపీ ప్రశ్న కాదు. ఇటీవల సుప్రీంకోర్టు రాహుల్ గాంధీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్య. నిజమే, దేశ రక్షణ వ్యవహారాలపై కూడా రాహుల్ ఉద్దేశపూర్వకంగా పలు సందర్భాల్లో తన వాచాలత్వాన్ని ప్రదర్శించారు. ఫలితంగా న్యాయస్థానంలో చివాట్లు తినక తప్పలేదు. పలు సందర్భాల్లో న్యాయస్థానాలు మందలించినా ఆయన తీరు మాత్రం మారలేదు. రాహుల్ దాదాపు 20 వరకు పరువు నష్టం, మోసం, వంచన వంటి కేసులను ఎదుర్కొంటున్నాడని ఆయన న్యాయవాది అభిషేక్ సింఘ్వియే చెబుతున్నారు. భారత్‌లో చేపట్టిన 'మేక్ ఇన్ ఇండియా'తో మన దేశానికి ఎలాంటి లాభం లేకపోగా చైనాయే ఎక్కువగా లాభపడిందని రాహుల్ విమర్శించారు. చివరకు మన దేశ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తున్న ఎన్నికల వ్యవస్థ మీద కూడా దాడి చేశారు. ఆరోపించడం, ఆధారాలు చూపకుండా పారిపోవడం అలవాటుగా మారింది.

### వీరసావర్కర్ విషయంలో..

సావర్కర్ మీద రాహుల్ గాంధీ పలు సందర్భాల్లో అనుచిత వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. ఆ స్వాతంత్ర్య సమరయోధుని గురించి రాహుల్ గాంధీ చేసిన బాధ్యతారహిత ప్రకటనలు గందరగోళాన్ని సృష్టిస్తున్నాయని అభినవ్ భారత్ కాంగ్రెస్ వ్యవస్థాపకుడు పంకజ్ కుముద్‌చంద్ర ఫడ్నిస్ ఆరోపించారు. ఈ అంశంపై ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు ఆయన్ని తీవ్రంగా మందలించింది. 'మీ నానమ్మ ఇందిరాగాంధీ ప్రధానిగా ఉండగా సావర్కర్‌ను ప్రశంసిస్తూ లేఖ రాశారని మీకు తెలుసా? మనకు స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు తెచ్చిపెట్టిన వారిని ఇలా అవమానిస్తారా?' అంటూ ఆగ్రహం వెలిబుచ్చింది. 'మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. వాటిని సుమోటోగా తీసుకుంటాం' అని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్ ధర్మాసనం హెచ్చరించింది. "ఇలాగే వదిలేస్తే ముమ్ముందు 'గాంధీ బ్రిటిష్‌వారికి సేవకుడు' అని కూడా చెబుతారు. వైస్రాయ్‌ను ఉద్దేశించి ప్రసంగించేటప్పుడు గాంధీ 'మీ నమ్మకమైన సేవకుడు' అంటూ మాట్లాడేవారు. స్వాతంత్ర్య యోధులకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడాన్ని అనుమతించబోం" అని స్పష్టం చేసింది. గాంధీజీని హత్య చేసినది ఆర్‌ఎస్‌ఎస్ అని చేసిన ఆరోపణలకు రాహుల్ ఒక కోర్టులో క్షమాపణ కోరాల్సి వచ్చింది. కర్ణాటలో గౌరీ లంకేశ్ హత్యలో ఆర్ఎస్ఎస్ హస్తం ఉందని ఆరోపించి కేసులో ఇరుక్కున్నాడు.

### వ్యక్తిగత ఆరోపణలు.. అబద్ధాలు

ప్రధాని నరేంద్ర మోదీని లక్ష్యంగా చేసుకొని ఎన్నో వ్యక్తిగత ఆరోపణలు చేశారు రాహుల్. మోదీ ఇంటి పేరు ఉన్నవాళ్లంతా దొంగలేనంటూ నిందించారు. 'చౌకీదార్ చోర్ హై' అంటూ ప్రధాని మోదీపై ఆరోపణలు చేసి వాటిని కోర్టుకు ఆపాదించారంటూ బీజేపీ నేత మీనాక్షి లేఖీ అప్పట్లో కోర్టు ధిక్కరణ వ్యాజ్యం వేశారు. దీనిపై విచారించిన కోర్టు రాహుల్ గాంధీ భవిష్యత్తులో జాగ్రత్తగా వ్యవహరించాలంటూ హెచ్చరించింది. చివరకు మోదీ వేసుకునే బట్టలను, ఆయన తినే తిండిని కూడా వదల్లేదు. వీటన్నింటికీ కోర్టులో క్షమాపణ చెప్పక తప్పదు. 2019లో లోక్‌సభ ఎన్నికల సమయంలో జార్ఖండ్‌లో జరిగిన బహిరంగసభలో అమిత్ షా హంతకుడు అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీనిపై కేసు నమోదైంది.

దేశ పారిశ్రామికవేత్తలతో మోదీ కుమ్మక్కయ్యారని నిత్యం ఆరోపిస్తూనే ఉంటారు రాహుల్. అంబానీ, అదాని.. మోదానీ అంటూ వ్యంగ్యోక్తులు విసిరాడు. దేశీయ పారిశ్రామిక రంగాన్ని, స్థైర్యాన్ని దెబ్బ తీయడమే రాహుల్ లక్ష్యమైపోయింది. అయితే రేవంత్ రెడ్డి సహా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్య మంత్రులు ఈ పారిశ్రామికవేత్తలను తమ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని కోరడంతో ఇబ్బందుల్లో పడ్డారు రాహుల్.

### దేశ రక్షణలో ఆటలా?

మన దేశ రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం విదేశాల నుంచి కొనుగోలు చేసిన యుద్ధ పరికరాల విషయంలోనూ కుట్రపూరిత ఆరోపణలు చేశారు రాహుల్. ముఖ్యంగా ఫ్రాన్స్ నుంచి కొనుగోలు చేసి రఫేల్ యుద్ధ విమానాల విషయంలో భారీ అవినీతి జరిగిందని రచ్చ చేసి చర్చకు పెట్టారు. ఈ అంశం న్యాయస్థానానికి చేరింది. ఫ్రాన్స్ కంపెనీ ద సాల్ట్ నుంచి భారత్ 36 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంలో అవకతవకలు జరిగాయంటూ రాహుల్ చేసిన ఆరోపణలపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు డిసెంబరు 14, 2018న కేంద్ర ప్రభుత్వానికి క్లీన్ చిట్ ఇచ్చింది. '36 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు ప్రక్రియపై అనుమానాలు వ్యక్తం చేసేందుకు ఎలాంటి ఆస్కారం లేదని ప్రధాన న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఈ విషయంలో రాహుల్ గాంధీని న్యాయ స్థానం మందలించడంతో క్షమాపణలు చెప్పాల్సి వచ్చింది



దేశ పారిశ్రామిక వేత్తలతో మోదీ కుమ్మక్కయ్యారని నిత్యం ఆరోపిస్తూనే ఉంటారు రాహుల్. అంబానీ, అదాని.. మోదానీ అంటూ వ్యంగ్యోక్తులు విసిరాడు. దేశీయ పారిశ్రామిక రంగాన్ని, స్థైర్యాన్ని దెబ్బ తీయడమే రాహుల్ లక్ష్యమైపోయింది. అయితే రేవంత్ రెడ్డి సహా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్య మంత్రులు ఈ పారిశ్రామిక వేత్తలను తమ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని కోరడంతో ఇబ్బందుల్లో పడ్డారు రాహుల్.



# విపక్ష నేత

భారత్‌లో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని రాహుల్ గాంధీ మూడేళ్ల క్రితం ఆరోపణలకు దిగారు. బ్రిటన్ పర్యటన వేళ కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం పెగాసస్ స్పైవేర్ ను ఉపయోగించి తనపై గూఢచర్యం చేసిందని ఆయన ఆరోపించారు. అయితే దీనిపై దర్యాప్తు చేపడితే సహకరించలేదు.

**హిండెన్‌బర్గ్, జార్జ్ సోరోస్..**

అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ రీసెర్చ్ జనవరి 2023 నివేదికలో, అదానీ గ్రూప్ స్టాక్ మార్కెట్ అవకతవకలకు పాల్పడిందని ఆరోపించింది. దీని వెనుక రాహుల్ గాంధీ పాత్ర కూడా బయటకు వచ్చింది. ఇజ్రాయెల్ గూఢచార సంస్థ "మొసాద్" ఆపరేషన్‌లో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. భారత ఆర్థిక వ్యవస్థను అస్థిరపరిచేందుకు ప్రపంచ వ్యాప్తంగా ప్రయత్నం జరుగుతోందని బయటపడింది. హిండెన్‌బర్గ్‌తో కాంగ్రెస్ పార్టీకి సంబంధాలున్నాయని ఆరోపణలు వచ్చాయి. ప్రపంచంలో బలమైన ఆర్థిక వ్యవస్థలో ఒకదానిని అస్థిర పర్చడం, కించపర్చడం, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాన్ని గందరగోళ పర్చడమే వారి లక్ష్యం అనే ఆరోపణలు వచ్చాయి. చివరకు హిండెన్‌బర్గ్ అనేదే మూత పడక తప్పలేదు. ఇదే అంశంపై పార్లమెంట్‌లో చర్చ సందర్భంగా భారత దేశంలో ప్రజాస్వామ్య విధ్వంసానికి కుట్రపన్నిన అమెరికా బిలియనీర్ జార్జ్ సోరోస్‌తో రాహుల్ గాంధీ బంధాన్ని బీజేపీ ఎండగట్టింది. మన దేశాన్ని అస్థిరపరిచేందుకు పనిచేస్తున్న అమెరికన్ ఏజెన్సీలతో రాహుల్ ప్రమాదకర బంధాన్ని కలిగి ఉన్నారని బీజేపీ ఎంపీలు సంబిత్ పాత్ర, డా.కె. లక్ష్మణ్ పార్లమెంటులో ఆరోపించారు. రాహుల్ అత్యున్నతస్థాయి ద్రోహి అని చెప్పేందుకు నేను ఏ మాత్రం వెనుకాడను అంటూ తీవ్రంగా స్పందిం చారు సంబిత్ పాత్ర.

**రాహుల్ నోట ట్రంప్ పాట**

భారత్–పాక్‌ల యుద్ధాన్ని ఆపానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే చెప్పినా ప్రధానిమోదీ తిరిగి ఎందుకు స్పందించడం లేదని రాహుల్ ప్రశ్న. ఎన్ని భారత యుద్ధవిమానాలను పాకిస్తాన్ కూల్చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. పెహల్గావ్ ఉగ్రదాడి నిందితులను భారత సైన్యం మట్టుపెడితే.. ఇప్పుడే ఎందుకు వారిని ఎన్‌కౌంటర్ చేసిందని పార్లమెంట్ సమావేశాల మొదటి రోజునే కాంగ్రెస్ పార్టీ ప్రశ్నించింది. ఇందుకు పార్లమెంట్ వేదికగా ప్రధాని మోదీ సమాధానమిచ్చారు. ఉగ్రవాదుల్ని మట్టుబెట్టడానికి ఏమైనా ముహూర్తం కావాలా? అని ప్రశ్నించారు. ఆపరేషన్ సిందూర్‌ను ఆపమని ఏ ప్రపంచాధినేత చెప్పలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ పాకిస్తాన్ ఎజెండాను దిగుమతి చేసుకునే పనిలో ఉందని ఆరోపించారు. మనదేశ సామర్థ్యాలపై కాంగ్రెస్‌కు నమ్మకం లేదని, పాక్ తప్పుడు వార్తల్ని ఆ పార్టీ నేతలు ప్రచారం చేశారని మోదీ ధ్వజమెత్తారు. 'రాహుల్ అడగాల్సింది.. ఎన్ని రఫెల్ విమానాలు కూలాయి అని కాదు.. ఎంతమంది ఉగ్రవాదులు చనిపోయారు అని అడిగితే బాగుండు. ఆయనకు 55 ఏళ్లు వచ్చినా, ఇంకా మెచ్యూరిటీ రాలేదు. ఈ జన్మలో ప్రధాని అయ్యే అవకాశం లేదు' అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు.

**దేశంతో పోరాడుతున్నా..**

తాము దేశంతో పోరాడుతున్నామని ఈ ఏడాది జనవరిలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. ఢిల్లీలో కాంగ్రెస్ నూతన ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించిన రాహుల్ ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'బీజేపీ, ఆరెస్సెస్ దేశంలోని ప్రతి సంస్థను తమ గుప్పిట్లో పెట్టుకున్నాయి. మేము ఇప్పుడు బీజేపీ, ఆరెస్సెస్‌తోపాటు భారతదేశంపై కూడా పోరాడుతున్నాం' అని వ్యాఖ్యానించారు.

**రాహుల్ బ్రిటిష్ పౌరుడా?**

ఇంతకీ రాహుల్ గాంధీ ఏ దేశ పౌరుడు? కొంత కాలంగా ఈ అంశంపై వివాదం నడుస్తోంది. బ్రిటన్ అధికారులకు సమర్పించిన పత్రాల్లో తనను తాను బ్రిటిష్ పౌరుడిగా రాహుల్ గాంధీ చెప్పుకున్నారని డా. సుబ్రమణ్యంస్వామి ఆరోపించారు. రాహుల్ పౌరసత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ ఢిల్లీ హైకోర్టులో ఇలాంటి పిటిషన్ వేశారు. ఇదే అంశంపై కర్ణాటకకు చెందిన ఎస్. విఘ్నేష్ శిశిర్ న్యాయ పోరాటం చేస్తున్నారు. ప్రతిపక్ష నాయకుడికి రెండు దేశాల పౌరసత్వాలు ఉండటం భారతీయ న్యాయ సంహిత, పాస్‌పోర్ట్ చట్టం కింద నేరమని రాహుల్ పౌరసత్వంపై సీబీఐ విచారణకు ఆదేశించాలని ఆయన కోర్టును కోరారు.

**ఎన్నికల సంఘం మీద దుమారం**

బీజేపీ కోసం కేంద్ర ఎన్నికల సంఘం భారీగా ఓట్లు చోరీకి పాల్పడుతోందని రాహుల్ గాంధీ అదే పనిగా ఆరోపిస్తున్నారు. అది రుజువు చేసేందుకు అణుబాంబు లాంటి ఆధారాలున్నాయని అన్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ–ఎస్ఐఆర్ చేపట్టింది. అనంతరం ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేసింది. ఈ ప్రక్రియను ముందు నుంచీ వ్యతిరేకిస్తోన్న రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'రాష్ట్ర స్థాయి నుంచి ఓట్ల చౌర్యం జరుగుతోందని మేం ఎప్పటినుంచో అనుమానిస్తున్నాం. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలతో పాటు లోక్‌సభ ఎన్నికల్లోనూ అక్రమాలు జరిగాయి. ఆరునెలలు మేం సొంతంగా దర్యాప్తు జరిపి ఆటంబాంబు లాంటి ఆధారాలను గుర్తించాం. ఆ బాంబు పేలిన రోజు ఎన్నికల సంఘం దాక్కోవడానికి అవకాశమే ఉండదు' అన్నారు. వాస్తవానికి కేంద్ర ఎన్నికల సంఘ దేశ వ్యాప్తంగా ఓటర్ల జాబితాల ప్రక్షాళన ప్రారంభిస్తున్నామని ప్రకటించింది. ఈ పనిని త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బిహార్ నుంచి ప్రారంభించింది. అక్కడ ప్రత్యేక సమగ్ర సవరణ–ఎస్ఐఆర్ పూర్తి చేసి, 65 లక్షల బోగస్ ఓట్లను గుర్తించి తొలగించారు. 22.34 లక్షల మంది ఓటర్లు చనిపోయారని, 36.28లక్షల మంది ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లడం లేదా ఆయా చిరునామాలో వాళ్లు ఇప్పుడు లేరని గుర్తించినట్లు ఎన్నికల సంఘం చెప్పింది. అయితే ఇదంతా బీజేపీకి అనుకూలంగా జరిగిందని ఆర్జేడీ, రాహుల్ ఆరోపించారు. బిహార్‌లో ఓటమిని ముందే ఊహించి రాహుల్ ఈ ఆరోపణలు చేస్తున్నారా? ఏ రాష్ట్రంలో అయినా ఓటర్ల జాబితాలో చేర్పులు, తొలగింపులు సహజం. అభ్యంతరాలు ఉంటే ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటుంది. కానీ అభ్యంతరాలు, ఫిర్యాదులు ఇవ్వకుండా అక్రమ ఓట్లు అంటూ ఆరోపణలు చేయడం, నిరూపించలేకపోవడం కాంగ్రెస్, ఇతర విపక్షాలకు తంతుగా మారింది.



**క్రాంతిదేవ్ మిత్ర**
సీనియర్ జర్నలిస్ట్



దెబ్బతిన్న నాగార్జున సాగర్ స్పిల్ వే

# నీటివనరుల నిర్వ

**వ్యవసాయానికి నీటి పారుదల సదుపాయాలే ప్రాణం. తాగునీటికైనా, సాగునీటికైనా బహుళార్థ సాధక ప్రాజెక్టులతో పాటు.. నీటి పారుదల ప్రాజెక్టులే అధికంమొత్తంలో ఆధారంగా ఉన్నాయి. కానీ, అలాంటి ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వం శీతకన్ను ప్రదర్శిస్తోంది. రాష్ట్రంలోని నీటి పారుదల ప్రాజెక్టులను గాలికి వదిలేసిందన్నవాదనలూ వినిపిస్తున్నాయి. వివిధ డ్యామ్‌ల నిర్వహణలో సర్కారు అలసత్వం కొట్టొచ్చినట్టు కనిపిస్తోందని, వాటి పర్యవేక్షణ, నిర్వహణ లోపభూయిష్ఠంగా మారిందని వ్యవసాయ వేత్తలు, నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కీలకమైన జూరాల, నాగార్జునసాగర్, శ్రీశైలం వంటి ప్రధాన ప్రాజెక్టులకు కూడా సకాలంలో అవసరమైన మరమ్మతులు పూర్తి చేయడం లేదని అంటున్నారు.**

రాష్ట్రంలోని పలు జలాశయాల నిర్వహణను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవడం లేదని, అరకొర పనులతో సరిపెట్టేస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. చిన్న నీటి పారుదల ప్రాజెక్టులను పక్కనబెట్టినా.. కనీసం కీలక ప్రాజెక్టుల నిర్వహణ విషయంలోనూ నిర్లక్ష్యం కనిపిస్తోందంటున్నారు. నాగార్జున సాగర్ స్పిల్‌వేకు ఈ ఏడాది మరమ్మతులు చేయలేదు. జూరాల ప్రాజెక్టులో గేట్ల రోప్‌లు తెగిపోయాయి. శ్రీశైలం గేట్లను ఐదేళ్లలో మార్చాల్సిందేనని నిపుణులు సూచనలు, సలహాలు ఇస్తున్నప్పటికీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వ్యక్తమవు తున్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టులకు కొన్నిసార్లు రూ.కోట్ల ఖర్చుతో మరమ్మతులు చేసినా. అవి అరకొరగా ఉండడంతో ఉపయోగం లేకుండా పోతోందని నీటిపారుదల రంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు 66 క్రస్టు గేట్లకు మరమ్మతుల కోసం 2022లో టెండర్లు పిలిచి మరుసటి సంవత్సరానికి కొంతమేర పనులు చేశారు. రూ. 11 కోట్లతో చేపట్టిన ఈ పనులు నిర్ణీత సమయంలో పూర్తి కాకపోవడంతో 8 గేట్లకు సంబంధించిన రోప్‌లు తెగిపో యాయి. మరోవైపు.. శ్రీశైలం ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను కూడా మార్చాల్సిందేనని సాగునీటి రంగ నిపుణులు స్పష్టం చేశారు. లేదంటే ఆ ప్రాజెక్టుకు తుంగభద్ర ప్రాజెక్టు పరిస్థితే ఎదురయ్యే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. గత ఏడాది తుంగభద్ర డ్యామ్ గేటు వరద నీటిలో కొట్టుకుపోవడం ఇంకా మర్చిపోలేదు. నిర్ణీత గడువులో శ్రీశైలం ప్రాజెక్టు గేట్లను మార్చకపోతే తుంగభద్ర డ్యామ్ అనుభవం పునరావృతం కావచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మరో ప్రధాన ప్రాజెక్టు నాగార్జున సాగర్ స్పిల్‌వేకు కూడా పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయడం లేదంటున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో 22 లక్షల ఎకరాలకు సాగునీరు, వేలాది గ్రామాలకు తాగునీరు అందిస్తున్న నాగార్జునసాగర్ ప్రాజెక్టు స్పిల్‌వే మరమ్మతులు ఈ ఏడాది చేయించలేదన్న చర్చ నడుస్తోంది. 1967లో నిర్మాణం పూర్తయిన ఈ ప్రాజెక్టు స్పిల్‌వేకు ఇప్పటి వరకు నాలుగుసార్లు మరమ్మతులు చేశారు. చివరిసారిగా 2023లో రూ.20కోట్లతో బాగు చేయించారు. అయితే, ఈ స్పిల్‌వేపై మళ్లీ భారీ గుంతలు ఏర్పడడంతో ఆధునిక పరిజ్ఞానంతో శాశ్వత ప్రాతిపదికపై మరమ్మతులు చేపట్టాలని నిపుణులు సిఫారసు చేశారు. స్పిల్‌వే వద్ద కదిలే క్రేన్‌ను ఏర్పాటు చేస్తే మరమ్మతులు సులభమవుతాయని, ఆ దిశగా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో ప్రకటించింది. కానీ, ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. ఢిల్లీకి చెందిన నీటి పారుదల రంగ నిపుణుల బృందం ఓ ప్రైవేట్ కంపెనీ ప్రతినిధులతో గత జూన్‌లో సాగర్ స్పిల్‌వేను పరిశీలించింది. నిధులు కేటాయించగానే తొలుత ఒక గేటు స్పిల్‌వేకు మరమ్మతులు చేసి, ఈ ఏడాది వరదల్ని తట్టుకుంటే మిగిలిన అన్ని స్పిల్‌వేలకూ మరమ్మతులు చేపడతామని ఆ బృందం ప్రభుత్వానికి వెల్లడించింది. అయితే, ఆ దిశగా ఇంకా ఎలాంటి అడుగులూ పడలేదంటున్నారు. ఇక, రాష్ట్రంలోనూ, ఎగువనా విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో సాగర్‌కు వరద కొనసాగుతోంది. అంటే.. ఇక, ఈ ఏడాదికి సాగర్ స్పిల్‌వే మరమ్మతులు ప్రారంభించే అవకాశం లేదు. అయితే, క్రస్ట్ గేట్లకు మాత్రం సర్వీసింగ్ పూర్తి చేశారు. ఏటా జూన్‌లో క్రస్ట్ గేట్ల రబ్బరు సీళ్లను సరిచేయడం, గేట్లను ఎత్తడానికి ఉపయోగించే రోప్‌లకు గ్రీజింగ్ చేయడం, మోటార్ల సర్వీసింగ్ వంటి పనులు చేపడతారు. ఈ పనులు మాత్రం పూర్తి చేసినట్లు ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు.

శాలి గౌరారం ప్రాజెక్టు చూస్తే.. ప్రభుత్వం ఆ ప్రాజెక్టు నిర్వహణను గాలికి వదిలేసిందన్న విమర్శలు





# హణలో నిర్లక్ష్య ధోరణి

వస్తున్నాయి. నల్లగొండ జిల్లాలో 6 వేల ఎకరాలకు సాగునీరు, 50 గ్రామాల్లో భూగర్భజలాల పెంపునకు శాలిగౌరారం ప్రాజెక్టు దోహదపడుతోంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన షట్టర్లు శిథిలమై పదేళ్లు గడిచినా వాటిని మార్చే ప్రతిపాదనలకు మోక్షం కలగడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గానీ అటువైపుగా దృష్టి సారించక పోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ ప్రాజెక్టుకు చెందిన కుడికాల్వ తూముకు గల నాలుగు షట్టర్లకు గాను ప్రస్తుతం ఒకటి, ఎడమకాల్వ తూముకు గల రెండు షట్టర్లలో ఒకటి మాత్రమే పనిచేయడంతో డ్యామ్‌లోని నీరు వృథాగా పోతోంది.

నల్లగొండ జిల్లాలోనే పురాతనమైనదిగా పేరుపొందిన డిండి ప్రాజెక్టు నిర్వహణ విషయంలోనూ అధికారులు శీతకన్ను ప్రదర్శిస్తున్నారు. 2.4 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టు హెడ్ రెగ్యులేటర్‌కు మూడు షట్టర్లలో, మధ్య షట్టర్ నుంచి నిరంతరాయంగా నీరు బయటకు వెళ్లిపోతోంది. అంతేకాదు.. స్పిల్‌వే ముందు భాగంలో కంప చెట్లను కూడా తొలగించడం లేదు. ఈ ప్రాజెక్టు కనీస నిర్వహణపైనా దృష్టి పెట్టకపోవడంతో నీటి లీకేజీలు ఎక్కువగా ఉంటున్నాయి.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జూరాల, కోయిల్ సాగర్, రామన్‌పాడు, సరళా సాగర్ జలాశయాల పరిస్థితి కూడా ఇంచుమించు ఇలాగే ఉంది. జూరాల ప్రాజెక్టుకు 66 క్రస్టు గేట్లకు గాను, 8 గేట్ల రోప్స్ తెగిపోయాయి. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ రచ్చకు దారితీయడంతో ప్రభుత్వం స్పందించి మరమ్మతులు చేపట్టింది. కోయిల్‌సాగర్ రిజర్వాయర్ గేట్లకు రబ్బర్ సీళ్లు సరిగా లేవని, గ్రీజింగ్ కూడా సరిగా చేయడం లేదని అంటున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన మొత్తం 13 గేట్లలో రెండు సరిగా పనిచేయడం లేదట. ప్రాజెక్టు నిండి గేట్లు ఎత్తిన సమయంలో తప్ప మిగతా సమయాల్లో పర్యవేక్షణ ఉండడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్టు నిర్వహణకు ఏటా రూ. 3 లక్షలు మాత్రమే కేటాయిస్తున్నారు.

రామన్‌పాడు ప్రాజెక్టు గేట్ల రబ్బర్ సీల్స్ కూడా సరి చేయడంలేదు. రోపులకు గ్రీజింగ్ చేయడం లేదు. రెండు వైపులా ఉండే స్లూయిజ్ గేట్లకు సర్వీసింగ్ లోపంతో లీకేజీలు అవుతున్నాయి. మరమ్మతులకు రూ. 4 కోట్లు అవసరమని అధికారులు పంపిన ప్రతిపాదనలు ప్రభుత్వం దగ్గర అలాగే ఉన్నాయి. కరీంనగర్‌లోని దిగువ మానేరు డ్యామ్‌కు (ఎల్ఎండీ) 20 గేట్లకు గాను, 2022లో 10 గేట్లకు వైర్ రోప్‌లు కొత్తవి వేశారు. మిగిలిన వాటికి రోప్‌లు మార్చేందుకు రూ. 4 కోట్లు అవసరమని అధికారులు అంచనాలు పంపించారు. ఎల్ఎండీకి రివర్స్ స్లూయిజ్ గేటు కుడివైపు మాత్రమే ఉంది. డ్యాం డెడ్ స్టోరేజీకి చేరుకుంటే కానీ.. వాటిని సర్వీసింగ్ చేసేందుకు వీలుండదు. మిడ్‌మానేరు ప్రాజెక్టు నాణ్యత, నిర్వహణ విషయంలో పెద్దగా ఫిర్యాదులేమీ లేవు. ఇల్లంతకుంట మండలం అనంతగిరి సమీపంలో 3.5 టీఎంసీల సామర్థ్యంతో అన్నపూర్ణ రిజర్వాయర్ ఉంది. 15 సంవత్సరాల పాటు ఈ ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతలను మేఘా కంపెనీకి అప్పగించారు.

రామగుండం, మంచిర్యాల మధ్యన నిర్మించిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలు. ఎల్లంపల్లి బ్యారేజీకి 62 రేడియల్ గేట్లను అమర్చారు. వీటికి మరమ్మతులు జరుగుతున్నాయని చెబుతున్నారు. అయితే, మధ్య మధ్యలో వచ్చే వరదల కారణంగా మరమ్మతులకు అంతరాయం కలుగుతోంది. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరులో 50 టీఎంసీల నీటి సామర్థ్యం గల డ్యాం ఎడవ కాలువ యూటీ (132 కి.మీ. వద్ద) గత సంవత్సరం వరదలకు కూలింది. ప్రస్తుతం మరమ్మతులు జరుగుతున్నాయి. లైనింగ్ పనులు ప్రారంభం కాలేదు. ఎడమ కాలువకు నాయకన్‌గూడెం దగ్గర అవుట్ ఫాల్ గేటు ఒకటి మాత్రమే పనిచేస్తోంది. మరో గేటు పనిచేయడం లేదు. పాలేరు వద్ద ఇన్‌ఫాల్ గేటు రబ్బర్లు అరిగి నీరు వృథాగా పోతోంది. మినీ హైడల్ ప్రాజెక్టుకు మరమ్మతులు జరుగుతున్నాయి. కాలువపై పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు పెరిగిపోయాయి. నేపథ్యంలో అక్కడి 15 మంది సిబ్బందిగా ఏడాదిగా కూర్చోపెట్టి జీతాలు ఇస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు నీటి సామర్థ్యం 0.75 టీఎంసీలు. కుడి, ఎడమ కాలువల ద్వారా 24 వేల ఎకరాలకు సాగునీరు సరఫరా అవుతోంది. ప్రాజెక్టుకు 25 గేట్లు ఉండగా రెండేళ్ల క్రితం వాటికి సీళ్లు వేశారు. మొత్తం ప్రాజెక్టు సెన్సార్లతో పనిచేస్తోంది. ప్రాజెక్టు నిర్మాణంలో వినియోగించిన ఇనుము తుప్పు పడుతోంది. 1976లో నిర్మితమైన ఈ ప్రాజెక్టుకు ఇప్పటి దాకా కనీసం రంగులు కూడా వేయలేదు. ప్రాజెక్టు సబ్‌స్టేషన్ నుంచి ఉన్న విద్యుత్తు స్తంభాలు పడిపోవడంతో సరఫరాను నిలిపేశారు. సత్యనారాయణపురం సబ్‌స్టేషన్ నుంచి తాత్కాలికంగా విద్యుత్తు సరఫరా చేస్తున్నారు. మొత్తం 12 మంది సిబ్బంది అవసరం కాగా, ఆరుగురు మాత్రమే ఉన్నారు. వరదలు వచ్చినప్పుడు మాత్రమే అధికారులు, సిబ్బంది ఉంటున్నారని చెబుతున్నారు.

భద్రాద్రి జిల్లా పాల్వంచలోని కిన్నెరసాని ప్రాజెక్టుకు 13 గేట్లున్నాయి. 7, 8, 9, 10 గేట్లలో రబ్బర్ సీళ్లు అరిగి పోవడంతో స్వల్పంగా నీరు లీక్ అవుతోంది. వరదలు వచ్చిన సమయంలో నీటి లీకేజీ ఎక్కువగా ఉంటోంది. గేట్లు ఎత్తిన సందర్భాల్లో సిల్ప్‌వేపై గుంతలు పడుతుండగా ఏడాదికోసారి మరమ్మతులు చేస్తున్నారు. ప్రాజెక్టు రెండువైపులా ఉండే స్లూయిజ్ గేట్లకు సర్వీసింగ్ చేయడం లేదు. ప్రాజెక్టుకు కొత్త సెన్సార్లు అమర్చడం లేదు. పెనుబల్లి మండలంలోని లంకసాగర్ డ్యామ్‌కు ఇరువైపులా లీకులు కనిపిస్తున్నాయి. జలాశయం ఆనకట్ట బలహీనంగా మారింది. ఈ ప్రాజెక్టు ఆధునికీకరణకు రూ.24.45 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. కానీ, నిధులు మాత్రం కేటాయించలేదని చెబుతున్నారు.

**సుజాత గోపగోని**
సీనియర్ జర్నలిస్ట్, 6302164068

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నేతృత్వంలో పార్టీ సారథ్య కార్యక్రమం తొలి, రెండవ విడతలు విజయవంతంగా ముగిసి, మూడవ విడత ప్రారంభమైంది. ఆయన ఈ పర్యటనల ద్వారా పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేస్తూ, నాయకులకు స్పష్టమైన దిశానిర్దేశం చేస్తున్నారు. కార్యకర్తలను మరింత శక్తిమంతంగా తీర్చిదిద్దుతూ, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుంటున్నారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలను వివరిస్తున్నారు. 'కష్టపడి పనిచేస్తే పదవులు స్వయంగా వస్తాయి' అంటూ, అందుకు తననే ఉదహరిస్తూ, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపుతున్నారు. తనపై నమ్మకంతో పార్టీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీలను స్వయంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసి, రాష్ట్ర రాజకీయాల్లో గట్టి పునాదులు వేసేలా కృషి చేస్తానని స్పష్టం చేశారు.



ప్రధాని మోదీతో మాధవ్...

# 'కమల'

మాధవ్ పర్యటనలు కార్యకర్తల్లో కొత్త ఉత్తేజాన్ని నింపడమే కాకుండా, స్థానిక స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా సాగుతున్నాయి. ఆయన పిలుపుతో కార్యకర్తలు ఇప్పటికే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలతో సంబంధాలు బలోపేతం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈ కృషి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి కొత్త విజయాలను అందించగలదని పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతమే తమ లక్ష్యమని, తమ పర్యటనలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని స్పష్టం చేశారు. ఆగస్టు 30న స్ఫూర్తి పేరుతో సంచార జాతుల సదస్సు నిర్వహించబోతున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 36 సంచార జాతులకు డీఎస్టీ సర్టిఫికెట్లు, స్థిర నివాసం, విద్య, సంక్షేమ కార్యక్రమాలు అందించేందుకు ప్రయత్నిస్తామన్నారు. వైసీపీ అరాచకాల బాధితులను కలుస్తామని చెప్పారు



ప్రధాని మోదీకి జ్ఞాపికను అందిస్తున్న మాధవ్

మాధవ్ ఆగస్టు 8న ప్రధాని నరేంద్రమోదీ కలిసి పార్టీ రాష్ట్ర సారథ్య బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలియచేశారు. రాష్ట్రంలో రైతులు, ఇతర వర్గాల సమస్యలను, ట్రంప్ విధిస్తున్న టారిఫ్ వల్ల రాష్ట్రంలో ఆక్వా రైతులు పడే ఇబ్బందులను ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతం ప్రణాళిక. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన రోడ్ మ్యాపును వివరించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామంలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రధాని సూచించారు. పార్టీ అభివృద్ధికి కొన్ని సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రతి కార్యకర్తను కలవాలని ప్రధాని సూచించారు.

ఆంధ్రప్రదేశ్ ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి ప్రధాని అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా తెలుగును ప్రోత్సహించాలంటూ, మాతృభాషలో చదువుల వల్ల శాస్త్రీయ జిజ్ఞాస పెరగడంతో పాటు, జ్ఞాపకశక్తి మెరుగు పడుతుందన్న విషయాన్ని అందరికీ అర్థమయ్యేలా ప్రచారం చేయాలని సూచించారు. ఆక్వా రైతులు ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నట్లు ప్రధాని తెలిపారు.

వైసీపీపై వచ్చిన అవినీతి ఆరోపణలకు వ్యతిరేకంగా పార్టీ రాజీలేని పోరాటం చేస్తోందని మాధవ్ చెప్పార9. 'అమరావతి భూ కేటాయింపుల్లో ఎటువంటి పక్షపాతం లేదు. ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేటు సంస్థలకు భూ కేటాయింపుల్లో ఎటువంటి వివక్షతకు తావు లేదు. నిబంధనలు ఎక్కడా అతిక్రమించలేదు. ఈ కేటాయింపులపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది' అని మాధవ్ వెల్లడించారు.

'సారథ్యం' పేరుతో నిర్వహిస్తున్న పర్యటనలు మూడో విడతకు చేరుకున్నాయి. తొలివిడతగా జూలై 27న దేవుని కడప నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం 28న నంద్యాల, 29న కర్నూలు, 30న అనంతపురం, 31న శ్రీసత్యసాయి జిల్లాల్లో సాగింది. రెండో విడత పర్యటన ఆగస్టు 4న పల్నాడు, 5న గుంటూరు, 6న బాపట్ల, 7న ప్రకాశం జిల్లాల్లో నిర్వహించారు. మూడో విడతలో ఆగస్టు 10న అన్నమయ్య, 11న చిత్తూరు, 12న తిరుపతి, 13న పొట్టి శ్రీరాములు నెల్లూరు తదితర జిల్లాల్లో సాగింది. జిల్లాల్లో పార్టీ పటిష్టతకు అనుసరించాల్సిన వ్యూహాలపై ఆయా జిల్లా నేతలతో సమావేశమై చర్చించారు. జిల్లాల్లోని పరిస్థితులకు అనుగుణంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేస్తూనే..పార్టీ కూటమి ప్రభుత్వంలో భాగస్వామి అనే విషయం మరిచి పోవద్దంటూ నేతలకు స్పష్టం చేశారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఆయా వర్గాలకు వివరిస్తూనే వారి నుంచి సూచనలు, సలహాలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా 'ఛాయ్ పే' చర్చా కార్యక్రమాల ద్వారా వాకర్స్, సీనియర్ సిటిజన్స్, మేధావులు, విద్యావంతులు, న్యాయమూర్తులు.. తదితర వర్గాలతో సమావేశమవుతూ పార్టీని ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లేందుకు మార్గం సుగమం చేశారు. మరోవైపు ఆయా జిల్లాల్లో సంఘ స్వయంసేవకులతో సమావేశమై పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. కార్యకర్తల సమావేశాలతో పాటు నేరుగా ప్రజలు, వివిధ వర్గాలను కలవడం ద్వారా పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం వచ్చిందనే అభిప్రాయాలను పార్టీ నేతలు వ్యక్తం చేస్తున్నారు.





పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం



గుంటూరు జిల్లా పర్యటన...

# వికాసానికి సారథ్య పర్యటనలు

**ప్రజా సమస్యల వేదికగా**

పార్టీ జిల్లా కార్యాలయాలు ప్రజాసమస్యల పరిష్కార వేదికగా మారాలని మాధవ్ పేర్కొన్నారు. ప్రతి సోమవారం అన్ని జిల్లాల్లో అధికారులు నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ప్రజల సమస్యలు తీసుకెళ్లడం ద్వారా వారికి చేరువ కాగలమని అన్నారు.

శ్రీభాగ్ ఒప్పందం మేరకు రాయలసీమలో హైకోర్టు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కర్నూలు పర్యటనలో భాగంగా ఆ జిల్లా న్యాయ వాదులు మాధవ్‌ను కోరారు. రాయలసీమవాసులు ఎప్పటి నుంచో దీనిని కోరుతున్నారని, వారికి కోరిక న్యాయమైనదని, అన్ని ప్రాంతాల అభివృద్ధి బీజేపీ విధానమని తెలిపారు. ప్రాంతాల అసమానతలు తొలగిపోవాలంటే అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. కర్నూలులో హైకోర్టు ఏర్పాటుకు అనుకూలంగా తమ పార్టీ గతంలో రాయలసీమ డిక్లరేషన్‌లో స్పష్టం చేసిందని తెలియజేశారు. ఈ ప్రాంతంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

అనంతపురం జిల్లాను హార్టికల్చర్ క్లస్టర్‌గా ఏర్పాటుచేసి పండ్లతోటల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నామన్నారు. సత్యసాయి జిల్లాను కూడా కలుపుకొని, ఉద్యాన సాగును విస్తృత స్థాయిలో అభివృద్ధిపరిచి, ఈ జిల్లాలో పండుతున్న పలు పండ్లను దృష్టిలో పెట్టుకొని, కోల్డ్ స్టోరేజీలు, ప్రాసెసింగ్ యూనిట్లు వంటివి ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు.

వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేయడంతోపాటు నిర్వాసితులకు నష్టపరిహారం అందిస్తామని ప్రకాశం జిల్లా పర్యటన సందర్భంగా చెప్పారు. కొత్తపట్నం వద్ద ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.400 కోట్లు కేటాయించిందని తెలిపారు. ఒంగోలు జాతి పశువుల రక్షణకు చర్యలు చేపడుతున్నామని, ఒంగోలు గిత్తల ప్రాధాన్యం దృష్ట్యా దేశమంతటా గిత్తల బ్రీడింగ్ కేంద్రం తీసుకొస్తామన్నారు. రైతుల పొగాకును అవసరానికి మించి సాగుచేస్తూ ఇబ్బందులు పడుతున్నారని, వారి వద్ద గల పొగాకు దిగుబడులను అపరాధ రుసుం లేకుండా కొనుగోలు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు.

**తెలుగును ప్రోత్సహించాలంటూ, మాతృభాషలో చదువుల వల్ల శాస్త్రీయ జిజ్ఞాస పెరగడంతో పాటు, జ్ఞాపకశక్తి మెరుగు పడుతుందన్న విషయాన్ని అందరికీ అర్థమయ్యేలా ప్రచారం చేయాలని సూచించారు. ఆక్వా రైతులు ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నట్లు ప్రధాని తెలిపారు.**

బాపట్ల జిల్లాలో పర్యటనలో ప్రజలు మాధవ్‌ను కలసి స్థానిక సమస్యలు వివరించారు. రథం బజారులోని శ్రీమాకర్లవారి రామానుజకూటమును గత ప్రభుత్వ హయాంలో అక్రమంగా తొలగించారని, దాతల వంశీయులను సంప్రదించకుండా,పురావస్తు శాఖ వారి అనుమతులు కూడా లేకుండా దాతల ఆశయాలకు విరుద్ధంగా ఆ ప్రదేశంలో లాడ్జి నిర్మించారని విన్నవించారు. అంతే కాకుండా సదరు రామాను కూటమును ఏకపక్షంగా దేవదాయశాఖలో విలీనం చేశారని, అది గతంలో వచ్చిన కోర్టు తీర్పునకు విరుద్ధమని, ఈ విషయమై జిల్లా దేవదాయ శాఖాధికారులను సమాచారహక్కుచట్టం కింద వివరణ అడిగినా కాలయాపన చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. 2021-22లో శ్రీభావన్నారాయణ స్వామి దేవాలయం జీర్ణోద్ధరణ పేరుతో జీర్ణోద్ధరణ కమిటి భక్తుల నుంచి విరాళాలుగా ఇబ్బడిముబ్బడిగా డబ్బు, బంగారం, వెండి వసూలు చేసి, ఇప్పటికీ లెక్కలు చెప్పడంలేదని తెలిపారు.

**కార్యకర్తల్లో ఉత్సాహం**

మాధవ్ చేపట్టిన జిల్లాల పర్యటన కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఆయన “ప్రతి ఇంటిపై బీజేపీ జెండా” అనే నినాదాన్ని బలంగా ప్రచారం చేస్తూ, ప్రతి స్థాయి కార్యకర్తలో పోరాట స్ఫూర్తిని కలిగించారు. వచ్చే ఏడాది జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధమవ్వాలని మాధవ్ పిలుపునిచ్చారు. ఆయా జిల్లాల్లోని రాజకీయ, సామాజిక పరిస్థితులను కార్యకర్తలతో మాట్లాడి తెలుసుకున్నారు. పార్టీ బలోపేతం కోసం, స్థానిక సమస్యల పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ప్రధానిగా నరేంద్ర మోదీ చేపట్టిన అభివృది, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరాన్ని ఉద్బోధించారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత, మోదీ హయాంలోనే అనేక సమస్యలకు పరిష్కారం లభించిందని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలదేనని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఏపీకి అందిస్తున్న నిధులను, రాష్ట్ర అభివృద్ధిపై చూపుతున్న ప్రత్యేక శ్రద్ధను ప్రజలకు తెలియజేయాలని సూచించారు.



**తురగా నాగభూషణం**
సీనియర్ జర్నలిస్ట్



# సుంకాల స్వదేశీ దె

**భారత్ ప్రయోజనాల పరిరక్షణ కోసం వాణిజ్యం, పెట్టుబడులు, కరెన్సీలు, భౌగోళిక-రాజకీయ కూటములు కట్టడంపై ఒక దీర్ఘకాలికమైన విధానపరమైన చట్రానికి ప్రాధాన్యతను ఇవ్వాలి.**

అమెరికా అధ్యక్షుడు భారత్ పట్ల అనుసరిస్తున్న ప్రతికూలమైన సుంకాల విధానం డోలాయమానంలో కొట్టుమిట్టాడుతోంది. అది కార్యాచరణలో నిలకడలేని తత్వాన్ని, క్రూరత్వాన్ని సూచిస్తోంది.

ఏప్రిల్, 2025లో 10 శాతం కనీసం సుంకాల ప్రతిపాదనతో అత్యంత అనుకూలమైన వాణిజ్య మిత్రదేశంగా పరిగణనలో ఉన్న భారతదేశం అనతికాలంలోనే 50 శాతం అత్యధిక సుంకాన్ని ఆకర్షించే శత్రుదేశాల జాబితాలోకి చేరిపోయింది. గణంకాలు, డేటాను కాసేపు పక్కన పెడితే.. భారత్ లో కొద్ది రోజులుగా సాయంత్రం నాలుగు గంటలు అవుతుందంటే చాలు గడబిడ, గందరగోళం, ఆందోళన, ఆదుర్దా చోటు చేసుకుంటున్నాయి. ట్రంప్ మొదటిసారిగా సరిగ్గా అదే సమయానికి 25 శాతం సుంకాన్ని ప్రకటించారు. అనంతరం అదే సమయానికి ఉద్రిక్తతలకు ఊతమిస్తున్నట్టుగా 50 శాతం సుంకాన్ని ప్రకటించారు. ట్రంప్ వైఖరికి అలవాటుపడినవారు ఈ నాటకీయ పరిణామాన్ని పరిగణనలోకి తీసుకున్నారు. ఎందుకంటే ట్రంప్ ఇటీవలి కాలంలో ఎవరో ఒక వాణిజ్య భాగస్వామ్యాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారు కాబట్టి. గత కొద్ది రోజులుగా అది భారత్ వంతుగా మారింది. ట్రంప్ సుంకాల అమలుకు 21 రోజుల గడువును విధించడం ద్వారా ఏదైనా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకునే ముందు మంతనాలకు తాను సిద్ధం అనే సంకేతాలను ఇచ్చారు. ఆ విధంగా భారత్ తరఫున సంప్రదింపులు జరుపుతున్నవారితో మనకు ప్రతికూలమైన వాణిజ్య ఒప్పందంపై సంతకం పెట్టేలా ఒత్తిడి తేవడానికి ఇదొక మార్గంగా ట్రంప్ భావించారు. అలాంటి ఒత్తిడికి తలొగ్గి వారే కనుక సంతకం పెట్టిన పక్షంలో భారత్‌లో వ్యవసాయం, మత్స్యరంగం, పాడి పరిశ్రమలో అమెరికా చొరబడటానికి దారి ఇచ్చినట్టే. భారత్‌తో ఏదోలా సంతకం పెట్టించడంలో ట్రంప్ ఆశావాదం అవధులు దాటింది. అది ఆయన చేసిన ప్రకటనల్లో ప్రస్ఫుటంగా కనిపించింది. వాటిలో ఒక బెదిరింపు ధోరణి కూడా దాగి ఉంది. అమెరికా అధ్యక్షుడు సమయం మించిపోతున్నది అన్నట్టుగా మాట్లాడుతూ "ఇక ఎనిమిది గంటలు మాత్రమే మిగిలి ఉంది.. ఏం జరుగుతుందో చూద్దాం.. మున్ముందు చాలా జరుగుతాయి. వాటిని మీరు ప్రత్యక్షంగా చూస్తారు. మరికొన్ని ఆంక్షలు (భారత్‌పైన) ఉంటాయి" అని అన్నారు.

ట్రంప్ సూచించిన ఎనిమిది గంటల గడువు తీవ్రంగా మంతనాలు జరుగుతున్న వేళ 'వేచి చూడు, అదను చూసి దాడి చేయి' అనే ఆయన వైఖరిని వెల్లడిస్తోంది.

ట్రంప్ ఎన్ని నాటకాలాడుతున్నప్పటికీ భారత్ ఆచితూచి స్పందించింది. స్పందించడంలో ఎంతో పరిణతిని ప్రదర్శించింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరుగుతున్న తరుణంలో పార్లమెంట్ లోపలా బయటా ఎంతో హుందాతనాన్ని ప్రదర్శించింది. 50 శాతం సుంకాలతో ట్రంప్ జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వు హేతుబద్ధంగా లేదని, అవాంఛనీయమైనదని, అకారణమైందని భారత్ పేర్కొంది.

ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి అన్నట్టుగా సుంకాలతో ట్రంప్ సాగిస్తున్న తంత్రాలు, వాటి తదనంతర పరిణామాలపై స్పందించారు. ట్రంప్ విధించిన సుంకాలు కార్మికులతో ముడిపడిన రంగం, గ్రామీణ రంగంపై పెద్ద ఎత్తున దుష్ప్రభావం చూపుతాయి. కనుక ఆ ప్రభావం లేకుండా చూడటానికి తాను వ్యక్తిగతంగా ఎంతటి భారీ మూల్యం చెల్లించుకోవడానికి సుముఖంగా ఉన్నట్టు మోదీ స్పష్టం చేశారు.

ప్రధాని మోదీ మొదటగా 140 కోట్ల మందికి పైగా భారతీయులపై వాణిజ్య ఒప్పందం, సుంకాల రూపేణా పడే భారాన్ని తన వ్యక్తిగత బాధ్యతగా స్వీకరించారు. ప్రధాని ఇటీవల జరిగిన ఎం.ఎస్. స్వామినాథన్ అంతర్జాతీయ శతాబ్ది సదస్సులో చేసిన ప్రకటన అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. రైతులను కాపాడుకోవడంలోనూ, గ్రామీణ ప్రజల ప్రయోజనాలను పరిరక్షించుకోవడంలోనూ, కార్మికులకు జీవనోపాధి కల్పిస్తున్న పారిశ్రామిక రంగాలకు కాపుకాయడంలోనూ రాజీపడటానికి ఆయన ఏ మాత్రం సుముఖంగా లేరు.

అంతేకాకుండా మోదీ అమెరికా విషయంలో రాజీకి అంగీకరించని విపక్షాల వైఖరిని దృష్టిలో ఉంచుకొని రాజకీయ విమర్శను సైతం ఎదుర్కోవడానికి సుముఖంగా ఉన్నారు. తదనంతర పరిణామాలకు వ్యక్తిగతంగా భారీ మూల్యాన్ని చెల్లించడానికి కూడా ఆయన సిద్ధంగా ఉన్నారు. ప్రధాన మంత్రికి ఓ విషయం పట్ల స్పష్టమైన అవగాహన ఉంది. అదేమిటంటే అమెరికాకు భారత వ్యవసాయ రంగాన్ని అప్పగించిన పక్షంలో అది ఆర్థికంగా ఏ మాత్రం ప్రయోజనం చేకూర్చదు అంతేకాకుండా కీలకమైన హిందూ ఓటు బ్యాంకుకు, సంఘపరివార్‌కు, సంబంధిత వ్యవస్థకు రాజకీయంగా ఏ మాత్రం గిట్టుబాటుకాదు.

వాస్తవిక అధ్యయనం ప్రకారం ఈ ఆర్థిక





# కాటుకు బ్బలు!

సంవత్సరానికి సుంకాలు 25శాతం వద్ద స్థిరపడిన పక్షంలో 0.2శాతం నుంచి 0.4శాతం మేర స్థూల దేశీయోత్పత్తి–జీడీపీ వృద్ధిపై పడే దుష్ప్రభావంతో మోదీ సర్కారు వ్యవహరించాల్సి ఉంటుంది.

అగ్రస్థాయి అధ్యయనకారుల అంచనా ప్రకారం భారత్ నుంచి అమెరికాకు 86.5 బిలియన్ డాలర్ల విలువైన వార్షిక సరకు ఎగుమతులు పోటీపడలేనివిగా లేకుంటే లాభాపేక్షకు నోచుకోనివిగా మిగిలిపోతాయి.

భారత్‌కు అతి పెద్ద మార్కెట్‌గా అమెరికా ఉంది. భారత్ అంతర్జాతీయంగా చేసే సరకుల ఎగుమతుల్లో దాదాపు 18 శాతం అమెరికాకు చెందినవి. అది జీడీపీలో 2.2 శాతంగా ఉంది. ఆ కారణంతో సమీప భవిష్యత్తులో ఇరు దేశాల మధ్య సంబంధాల్లో పీలికలు కనిపించడం మొదలు కావొచ్చు.

ప్రధాని నరేంద్రమోదీ భారత్ జాతీయ ప్రయోజ నాల పరిరక్షణకు అచంచలమైన నిబద్ధతను చూప డంతో అమెరికాతో భారత్ తరఫున సంప్రదింపులు జరుపుతున్న వారు తేలికగా ఊపిరి పీల్చుకున్నారు.

ప్రతిపాదిత 50 శాతం సుంకాలు ఎట్టకేలకు అమల్లోకి వచ్చినపక్షంలో అది అప్రకటితమైన వాణిజ్య ఆంక్షలుగా రూపాంతరం చెందవచ్చు. లేకుంటే భారత్‌కు వ్యాపారానికి సంబంధించిన ఒక నిషేధాజ్ఞగా పరిణమించవచ్చు. ఫలితంగా ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బ తినవచ్చు.

**సుంకాలకు దీటుగా 10 మార్గాంతరాలు**

భారత్, అమెరికా విధించిన సుంకాలకు దీటుగా 10 విషయాలను అమల్లోకి పెట్టవచ్చు

- అమెరికా నుంచి ఎఫ్–35 స్టెల్త్ ఫైటర్ జెట్ విమానాలను భారత్ కొనుగోలు చేయకపోవచ్చు ననే ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఇప్పటి వరకు ఉన్న పరిస్థితిని బట్టి చూస్తే.. ఈ జెట్ విమానాలను విక్రయించడానికి అమెరికా తహ తహలాడిపోతోంది. కానీ దీనికి సంబంధించిన లాంఛనపూర్వకమైన మంతనాలు ఇప్పటివరకు మొదలు కాలేదు. ఎప్పుడు మొదలవుతాయనే దానిపై ఎలాంటి స్పష్టత లేదు.
- భారత్ అమెరికా నుంచి దిగుమతి అయ్యే 28 ఉత్పత్తులపై ప్రతీకార సుంకాల విధింపును పరిగణనలోకి తీసుకోవచ్చు. ఆ ఉత్పత్తుల్లో ఆపిల్స్, వాల్‌నట్స్ ఉన్నాయి. దీనికి 2019లో భారతీయ ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై అమెరికా విధించిన సుంకాలకు ప్రతిగా భారత్ సుంకాలు విధించిన వైనాన్ని ఒక నిదర్శనంగా తీసుకోవచ్చు.
- అమెరికా కనుక భారత్ పట్ల తన వాణిజ్య, సుంకాల విధానాలను తిరగరాయని పక్షంలో అది ఇరుదేశాల మధ్య తెగదెంపులకు దారి తీయవచ్చు.
- పాలక పక్షం స్వదేశీ అంశంపై విస్తృతమైన ప్రచారానికి నాంది పలకవచ్చు. ప్రభుత్వం స్థానికతకు పెద్ద పీట వేయవచ్చు. మేడిన్ ఇండియా ఉత్పత్తులు, సేవల వైపు మొగ్గు చూపవచ్చు.
- ప్రధాని నరేంద్ర మోదీ స్వదేశీ ఉద్యమాన్ని చేపట్టడానికి సామాజిక, ఆర్థిక రంగాలకు చెందిన ప్రజలను సమీకరించవచ్చు.
- భారత్ వాణిజ్యం, పెట్టుబడులు, ఆర్థికం, భౌగోళిక–వ్యూహాత్మక సంబంధాలను పునర్ వ్యవస్థీకరించుకునే అవకాశం ఉంది. రష్యా, చైనా, తదితర దేశాలతో సంబంధాలను మరింత వృద్ధి చేసుకోవడం ద్వారా అమెరికాకు దీటుగా సమతూకం చేసుకోవచ్చు. అమెరికా బ్రెజిల్ లాంటి దేశాలకు కూడా భారీగా సుంకాలను వడ్డించింది. కనుక భారత్ బ్రెజిల్ లాంటి దేశాలతో జట్టు కట్టడాన్ని ఒక ప్రత్యామ్నయంగా భావించవచ్చు.
- ప్రస్తుతం చోటు చేసుకుంటున్న పరిణామాలు కాలపరీక్షకు తట్టుకునే విదేశాంగ విధానాన్ని విస్తరించుకోవడానికి దారి తీయవచ్చు. అది వ్యూహాత్మక స్వయంప్రతిపత్తితో కూడుకున్నది. భారత్ ప్రతీకార, ఆత్మరక్షణ ప్రయోజనాలను కాపాడుతుంది. దక్షిణ–దక్షిణ వాణిజ్య ఒడంబడికను ప్రోత్సహించడానికి ఇదే సరైన సమయం అవుతుంది.
- భారత్ అంతర్జాతీయ ఒడంబడిక కోసమని తన విధానపరమైన చట్రాన్ని మరింత పదునుపెట్టు కోవడానికి రానున్న షాంఘై సహకార సంస్థ – ఎస్‌సీవో, క్వాడ్, బ్రిక్స్ సదస్సులు ఉపకరిస్తాయి.
- ఒక స్వతంత్రమైన ఆర్థిక నిర్మాణానికి రూపకల్పన, చెల్లింపుల్లో వైవిధ్యం కోసమని అమెరికా డాలర్‌తో తెగదెంపులు లేదా త్వరితగతిన బ్రిక్స్ కరెన్సీని రంగంలోకి దించడాన్ని పరిగణనలోకి తీసుకోవచ్చు.
- కరెన్సీ, చమురుపై ఒక మధ్యకాలిక, దీర్ఘకాలిక విధానాన్ని తీసుకొని రావచ్చు.



**కె.ఎ.బదరీనాథ్**

**డైరెక్టర్ & చీఫ్ ఎగ్జిక్యూటివ్,**

**సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ అండ్**

**హోలిస్టిక్ స్టడీస్, న్యూఢిల్లీ.**





**ప్రపంచ ఆర్థిక వ్యవస్థ చరిత్ర గతి మారుతోంది. పాశ్చాత్య దేశాల ఆధిపత్యం, డాలర్ ఆధిపత్యం ఇంకానా అంటున్నాయి పేద దేశాలు. కొత్త చరిత్ర నిర్మాణానికి పరిస్థితులను వేగవంతం చేస్తున్నవారు సాక్షాత్తు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కావడమే నేటి వైచిత్రి. రోగి చస్తే చచ్చాడు కానీ ఆపరేషన్ సక్సెస్ అయిందన్నట్టుంది ట్రంప్ టారిఫ్‌ల విధింపు వ్యవహారం. అమెరికా అధ్యక్షుడి ఆర్థిక విధానమో, విదేశాంగ విధానమో దానికి ఏ పేరు పెట్టినా ఒక ప్రహసనంగా కనిపిస్తున్నది. డాలర్ మరణం ఆసన్నమయిందని అమెరికా బ్రాండ్ ప్రముఖుడు ఒకరు హెచ్చరించడం ఆ ప్రహసనానికి విషాదకరమైన మలుపు. రష్యా నుంచి భారత్ చమురు దిగుమతి చేసుకోవడం**

# డాలర్ 'చావు' కొచ్చిన

తన టారిఫ్‌ల వాదనను పదే పదే సమర్థించుకోవడం విచిత్రం. ఇప్పటికే ఈ టారిఫ్‌లకు వ్యతిరేకంగా దాఖలైన కేసుపై యు.ఎస్. ఫెడరల్ సర్క్యూట్ అప్పీల్స్ కోర్టు త్వరలోనే తీర్పు వెల్లడించనుంది. చైనా, కెనడా, మెక్సికో తదితర దేశాలు అమెరికా విధించిన సుంకాలపై కోర్టును ఆశ్రయించాయి. ఈ సుంకాల విధింపులో అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అవసరాల చట్టం (ఐఈఈపీఏ)ను ఉపయోగించడంపై ఈ కేసు దృష్టి సారించనుంది. ఒకవేళ కోర్టు తీర్పు ట్రంప్‌కు వ్యతిరేకంగా వస్తే టారిఫ్‌ల విధింపు మరికొంతకాలం ఆలస్యమవుతుంది. ఎందుకంటే ఓడిపోయిన పార్టీ సుప్రీం కోర్టులో అప్పీలు దాఖలు చేయవచ్చు. ఒకవేళ తీర్పు వ్యతిరేకంగా వస్తే 1929 నాటి మాంద్యాన్ని ఎదుర్కోక తప్పదని ట్రంప్ హెచ్చరిస్తున్నారు. నిజమేమంటే 1929లో అమెరికా టారిఫ్ చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. ఇందుకు ప్రతిగా ఇతర దేశాలు కూడా వాణిజ్య ఆంక్షలు విధిస్తూ రావడంతో, పెను సంక్షోభం ఏర్పడింది. ఫలితంగా ప్రపంచ దేశాల జీడీపీ పడిపోయి, చివరకు హిట్లర్ ఈ సంక్షోభాన్ని తనకు అనుకూలంగా మలచుకోవడానికి దారితీసింది. అసలు విషయాన్ని తెలుసుకోకుండా సుంకాలు విధిస్తామంటూ హెచ్చరిస్తున్న ట్రంప్ వీటి పర్యవసానంతో సంభవించే ప్రతికూల

పెంచిన టారిఫ్‌ల పుణ్యమాని అమెరికా ప్రభుత్వానికి ఆదాయం గణనీయంగా పెరిగినమాట వాస్తవం. కానీ ఈ ఆదాయం ఎక్కడి నుంచి వస్తోంది? దేశీయ పరిశ్రమలు, వినియోగదార్లు చెల్లించే అధిక పన్నుల కారణంగా!! అంటే తన దేశ పౌరుల నుంచే ముక్కుపిండి వసూలు చేసే పన్ను వల్ల ఖొక్కసం నిండుతున్నా, యు.ఎస్.లో నివసించే విదేశీయులు ఈ భారాన్ని మోయాల్సిందేనంటూ ట్రంప్ వినిపిస్తున్న వితండవాదం అర్థం కావడంలేదు! సుంకాలు పెంచడంతో ధరలు విపరీతంగా పెరిగి అమెరికన్ ప్రజలు లబోదిబో మంటున్నా ట్రంప్‌కు పట్టడంలేదు! తనకు నోబెల్ బహుమతి రావాలన్న కోర్కె ఇటు దేశ ప్రజలను, ప్రపంచ దేశాలను ఇబ్బంది పెడుతోంది. ఇవేవీ పట్టని ట్రంప్ రోజుకో ప్రకటన చేస్తూ తుగ్లక్ పాలనను తలపిస్తున్నారనడంలో ఎంత మాత్రం సందేహం లేదు.

భారత్‌పై 50శాతం సుంకాలు విధించిన తర్వాత ట్రంప్ తాజాగా ఒక ప్రకటన చేస్తూ, ఈ టారిఫ్‌ల అంశం తేలేవరకు భారత్‌తో వాణిజ్య చర్చలు జరిపేదే లేదని తెగేసి చెప్పారు. ట్రంప్ భారత్‌పై రెండో విడత పెంచిన టారిఫ్‌లు ఆగస్ట్ 27నుంచి అమల్లోకి రానున్నాయి. ట్రంప్ పకటన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో టెలిఫోన్‌లో ద్వైపాక్షిక చర్చలు జరపడం ద్వారా, బెదిరింపులకు లొంగే ప్రసక్తేలేదని యు.ఎస్.కు తేల్చిచెప్పినట్లయింది. బ్రెజిల్ అధ్యక్షుడితో కూడా మోదీ ఫోన్‌లో చర్చలు జరిపి ఈ అంశం చర్చించారు. అంతేకాదు ఈ ఏడాది జరిగే 23వ భారత్–రష్యా వార్షిక సదస్సులో పుతిన్‌కు ఆతిథ్యం ఇవ్వడానికి ఎదురు చూస్తున్నానని ట్వీట్ చేయడం ట్రంప్‌కు హెచ్చరిక వంటిదే. పలు దేశాలనుంచి మరోవైపు స్వదేశంలో వ్యతిరేకత వస్తున్నా ట్రంప్



ట్రంప్‌కు ఇష్టం లేదు. అందుకే సుంకాల మీద సుంకాల పెంచాడు. ఆ సుంకాలను భారత్ ఖాతరు చేయవలసిన అవసరం లేదని ఆ దేశ కాంగ్రెస్ సభ్యులు, మాజీ భద్రతా సలహాదారులు చెబుతున్నారు. బ్రిక్స్ పటిష్టమవుతున్న నేపథ్యంలో, దానికి భారత్, చైనా వెన్నుదన్నుగా ఉందన్న విషయం ట్రంప్ విస్మరించడమే ఈ రగడకు అసలు కారణం. మీ సుంకాల వడ్డింపుతో భారత్ లొంగడం మాట అటుంచి, రష్యా వైపు మరింత మొగ్గే అవకాశం ఉందని అమెరికా నిపుణులు ట్రంప్‌ను హెచ్చరించారు కూడా. కొన్ని దశాబ్దాలుగా అమెరికా- భారత్‌ల నడుమ నిర్మించుకుంటూ వచ్చిన సంబంధాలు ఒక్కసారిగా కుప్పకూలిపోయే పరిస్థితి దాపురించిందని కూడా వారు వెల్లడించారు.

# ట్రంప్ సుంకాల పెంపు

ఫలితాలను గుర్తించకపోవడం మూర్ఖత్వమే అనుకోవాలి.

**స్నేహం చెడటానికి కారణం**

ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి కావాలన్న కాంక్ష తలకెక్కింది. ఇందుకు అర్హుడిగా తనను తాను చెప్పుకోవడానికి భారత్–పాకిస్తాన్‌ల మధ్య జరిగిన సంఘర్షణ జూన్ 17న తాను ఫోన్‌లో చెప్పడం వల్లనే ఆగిపోయిందని ప్రచారం చేసుకోవడం మొదలు పెట్టారు. అయితే దీన్ని నరేంద్రమోదీ తిరస్కరించడమే కాదు, కేవలం పాకిస్తాన్ కోరడం వల్ల మాత్రమే ఆపరేషన్ సిందూర్‌ను ఆపేశామని స్పష్టం చేయడం డోనాల్డ్ ట్రంప్‌కు ఎక్కడలేని కోపం తెప్పించిందని బ్లూమ్‌బర్గ్ పేర్కొంది. అక్కడి నుంచే ఇరుదేశాల సంబంధాలు క్షీణించడం మొదలు పెట్టాయని కూడా వివరించింది. జీ7 సమావేశాల్లో పాల్గొన్న తర్వాత నరేంద్రమోదీ నేరుగా క్రొయేషియాకు వెళ్లిపోయారు. అసీమ్ మునీర్‌తో తనకు సమావేశాన్ని ట్రంప్ ఏర్పాటు చేస్తారన్న అనుమానంతో మోదీ అమెరికాలో దిగకుండా, నేరుగా క్రొయేషియాకు వెళ్లినట్టుకూడా తన కథనంలో పేర్కొంది. ఇది మాత్రమే కాదు, చైనాతో ట్రంప్ ఒక వాణిజ్య ఒప్పందం కుదుర్చు కోవడం కూడా భారత్ తన వైఖరిని మరింత కఠినం చేయడానికి మరోకారణంగా బ్లూమ్‌బర్గ్ పేర్కొంది.

ఈ ఒప్పందం వల్ల చైనాకు టారిఫ్‌లో కొంత వెసులుబాటు దక్కడం, అమెరికాలో మరిన్ని మార్కెట్ల లోకి దానికి అవకాశం లభించడంతో, తన వాణిజ్య అవకాశాలు కుంచించుకుపోయే పరిస్థితి నెలకొనడం భారత్ ఆగ్రహానికి కారణమని వివరించింది.

**ఒప్పందాలు రద్దు కాలేదు**

ట్రంప్ 50శాతం టారిఫ్‌లు విధించిన నేపథ్యంలో భారత్ ఆ దేశంతో కుదుర్చుకున్న రక్షణ ఒప్పందాలను కొన్నింటిని తాత్కాలికంగా నిలిపే సిందన్న వార్తలు వచ్చాయి. ముఖ్యంగా యు.ఎస్. తయారీ స్ట్రైకర్ ఆర్మ్‌డ్ ఫైటింగ్ వెహికిల్స్ (ఏఎఫ్‌ఎస్) ను ఉమ్మడిగా ఉత్పత్తి చేసేందుకు ఉద్దేశించిన చర్చలను భారత్ నిలిపేసిందన్నది వాటి సారాంశం. అమెరికా ఆయుధాలు, యుద్ధ విమానాల కొనుగోలును భారత్ రద్దు చేసిందని రాయిటర్స్ పేర్కొంది. అంతేకాదు రాబోయే కొద్దివారాల్లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆయుధ కొనుగోళ్లపై చర్చించేందుకు యు.ఎస్. వెళ్లాల్సిన పర్యటన కూడా రద్దయినట్టు వార్తలు వచ్చాయి. భారత్ తీసుకున్న నిర్ణయాల వల్ల జనరల్ డైనమిక్స్ తయారీ స్ట్రైకర్ వాహనాలు, ట్యాంకు విధ్వంసక జావ్‌లిన్ క్షిపణులు, బోయింగ్ పి81 నిఘా విమానం కొనుగోలు ప్రస్తుతం తాత్కాలికంగా నిలిచిపోయాయి. పి81 విమానం కొనుగోలు ఒప్పందం విలువ 45000 మిలియన్ డాలర్లు! ఎఫ్–35 యుద్ధ విమానాల కొనుగోలును నిలిపేస్తు న్నట్టు అంతకు ముందే భారత్ స్పష్టం చేసింది. ఈ నిర్ణయాలకు సంబంధించి లిఖిత పూర్వక ఆదేశాలు ఇప్పటికీ జారీ చేయకపోవడంతో, వీటి పునరుద్ధరణ అవకాశాలు ఇంకా ఉన్నాయని కూడా వార్తా కథనాలు పేర్కొన్నాయి. అయితే ఈ వార్తలను మన విదేశాంగ శాఖ కొట్టిపారేయడం గమనార్హం. రక్షణ ఒప్పందాల రద్దుపై ఇప్పటివరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేసింది. రక్షణ సామగ్రి కొనుగోళ్లు యథా తథంగా కొనసాగుతాయని పేర్కొంది. మొత్తంమీద చెప్పాలంటే అమెరికా ఆయువుపట్టుగా భావించే వాణిజ్యంపైనే దెబ్బకొట్టే చర్యల ద్వారా తనతో పెట్టు కుంటే ఎట్లావుంటుందో ట్రంప్‌కు రుచి చూపిస్తోంది.

**పన్నుల భారంతో అమెరికన్ల విలవిల**

ఒకటి వాస్తవం. అమెరికాది వినియోగ ఆర్థిక వ్యవస్థ అయినందున దిగుమతులు ఎలాగూ తప్పవు! అటువంటప్పుడు ఎంత మొత్తంలో సుంకాలు విధించినా అమెరికా కంపెనీలు దిగుమతులు చేసుకోకుండా ఉండలేవు. మరి ఈ అధిక టారిఫ్‌లు చెల్లించేది ఈ కంపెనీలే! ఈ మొత్తం ప్రభుత్వ ఖజానాకే వెళుతుంది. ఈ కంపెనీలు ఇవే వస్తువులను రిటైల్ అమ్మకాలు జరిపినప్పుడు ఈ టారిఫ్‌ల భారమంతా మళ్లీ వినియోగదారుల నెత్తినే రుద్దుతాయి. అంటే ఈ సుంకాల వల్ల ధరలు పెరిగి, ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. ఇక్కడ ఏం జరుగుతుందంటే టారిఫ్‌లు పెంచడం వల్ల విదేశాలు, చివరిగా దేశీయ వినియోగ దారులు నష్టపోతారు. ప్రస్తుతం అమెరికాలో జరుగుతున్నదిదే. దిగుమతి సుంకాలు పెంచడం వల్ల అమెరికా ప్రభుత్వానికి ఆదాయం బాగా పెరుగు తుందని అక్కడి తయారీ రంగానికి ప్రోత్సాహం లభిం చడంతో పాటు, ఇన్నేళ్లుగా అమెరికాకు ప్రతికూలంగా కొనసాగుతున్న అనుచిత వాణిజ్య విధానాలను గాట్లో పెట్టవచ్చనేది ట్రంప్ వాదన. నిజం చెప్పాలంటే ట్రంప్ విధానాల వల్ల అమెరికా ప్రభుత్వ ఆదాయం బాగా పెరిగిన మాట నిజం. ఉదాహరణకు ఒక్క జూలై మాసంలోనే 152 బిలియన్ డాలర్ల మేర సుంకాల ద్వారా ఆదాయం లభించింది. మరి ఈ టారిఫ్‌ను చెల్లిస్తున్నదెవరు? అమెరికాలోని స్థానిక కంపెనీలు! ఇంతగా పెంచిన టారిఫ్‌లను ఇంకెంతో కాలం భరించడం సాధ్యం కాదని అవి మొత్తుకుంటు న్నాయి. పెంచిన టారిఫ్‌ల కారణంగా యు.ఎస్.లో ద్రవ్యోల్బణం పెరుగుతోంది. గత జూన్ నెలలో వస్త్రాలు, గృహ వినియోగ వస్తువుల ధరలు బాగా




## డాలర్

**నా**న్నృషిః కురుతే కార్టూన్ అంటే ఇదే... మూడు పేజీలు కూడా వ్యక్తం చేయలేని నిగూఢ భావాన్ని మూడు కాలాల కార్టూన్ అలవోకగా ఆవిష్కరిస్తుందని ఒక మహనీయుడు అన్నారు. అలాగే మరొక మహనీయుడు కూడా నాన్నృషిః కురుతే కార్టూన్ అన్నాడు. కావ్యం అన్న చోట కార్టూన్ అని మార్చారంతే. సుంకాల ట్రంప్ గోల నేపథ్యంలో హఠాత్తుగా బయటకు వచ్చిపడి, ప్రపంచాన్ని హల్‌చల్ చేస్తున్న 1925 నాటి ఒక కార్టూన్‌ను చూసినా ఇదే అనిపిస్తుంది. ఆ కార్టూనిస్టు ఊహ సరిగ్గా వందేళ్లకు నిజమయ్యే దశలోనే ఉందని వీక్షకులు స్పష్టంగా

పెరిగాయి. ఆర్థికవ్యవస్థలో వృద్ధి నమోదైనా అది ఆరోగ్యకరమైన రీతిలో లేదు. శ్రామిక మార్కెట్ తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నది. బొలీవియా, ఈక్వెడార్, ఐస్‌ల్యాండ్, నైజీరియా వంటి దేశాల దిగుమతులపై 15% టారిఫ్ విధిస్తుండగా, తైవాన్ వంటి దేశాలపై 20% టారిఫ్ అమలవుతోంది. టారిఫ్‌లు పెంచిన మేర అమెరికన్ పౌరులు అధికంగా చెల్లించాల్సి వస్తోంది. అయితే తన విధానాలే యు.ఎస్.ను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని నిపుణులు చెబుతున్న మాటలను ట్రంప్ ఖాతరు చేయడంలేదు. ఈ టారిఫ్‌ల వల్ల కష్టనష్టాలను విదేశీయులు మాత్రమే భరించాల్సి ఉంటుందని ట్రంప్ గతంలో ఒకసారి అన్నారు. ట్రంప్ చెబుతున్న మాటలకు, దేశంలో వాస్తవ పరిస్థితులకు పొంతన లేదు. టారిఫ్‌ల వల్ల ప్రభుత్వ ఆదాయం పెరుగుతున్నప్పటికీ, వీటిని చెల్లించేది సాధారణ అమెరికన్ పౌరులు. పెంచిన టారిఫ్‌ల నేపథ్యంలో సగటు అమెరికన్ 18% వరకు అదనంగా పన్ను చెల్లించాల్సి వస్తోంది. ఒక సర్వే ప్రకారం సగటున ఒక అమెరికన్ కుటుంబం వార్షికంగా 2400 డాలర్ల వరకు ఈ టారిఫ్‌ల వల్ల నష్టపోతుందని అంచనా. ప్రభుత్వ ఆదాయం పెరుగుతున్నా, సగటు అమెరికన్ పౌరులు పెనుభారాన్ని మోయాల్సి వస్తోంది. ట్రంప్ విధానం "రోగి చచ్చినా ఆపరేషన్ సక్సెసయింది" అని డాక్టర్లు సంతోషపడిన చందంగా తయారైంది. కాగా టారిఫ్‌ల వల్ల పెరిగే ధరల కారణంగా ఆర్థిక వ్యవస్థ స్తంభించిపోవడం ఖాయమని కొందరు ఆర్థిక విశ్లేషకులు మరోవైపు హెచ్చరిస్తున్నారు!

### సహనం కోల్పోయిన భారత్

ఇప్పటివరకు టారిఫ్‌ల విషయంలో ఆచితూచి వ్యవహరించిన భారత్ స్థిరత్వంలేని ట్రంప్ వైఖరిని బేఖాతరు చేస్తూ ముందుకెళ్లాలనే నిర్ణయించింది. భయపడుతూ కూర్చుంటే రోజుకో సమస్యను సృష్టించి ఇబ్బంది పెడతాడని ఒక నిర్ణయానికి వచ్చి రష్యాతో వాణిజ్య ఒప్పందానికి ఓకే చెప్పేసింది. ఎంత టారిఫ్ అయినా భరిస్తాం గాని, రష్యాతో వాణిజ్య ఒప్పందం విషయంలో రాజీపడే ప్రసక్తేలేదని తెగేసి చెప్పింది. ప్రయోజనం లేని మిత్రత్వం అవసరంలేదని తన చర్యల ద్వారా యు.ఎస్.కు అర్థమయ్యేలా చేసింది. దీంతోపాటు ఈనెల 31, వచ్చేనెల 1వ తేదీన చైనాలో జరిగే షాంఘై సహకార సంస్థ (ఎస్సీఓ) సదస్సులో పాల్గొనేందుకు మోదీ పర్యటన ఖరారైంది. ఆ విధంగా ఇప్పటివరకు దీనిపై కొనసాగిన ఉత్కంఠకు తెరపడింది. భారత్– చైనాలను ఒక్కటి చేసేందుకు రష్యా తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఇప్పటివరకు ఈ ప్రయత్నాలు విజయవంతం కాలేదు. కానీ ట్రంప్ అతిక్లిష్టమైన ఈ సమస్యను తన తలతిక్క నిర్ణయాలతో పరిష్కరించారు. 2019 తర్వాత మొదటిసారి నరేంద్రమోదీ చైనాలోకి అడుగుపెట్టడానికి, ట్రంప్ టారిఫ్‌ల రూపంలో సహాయం చేసినట్లయింది. ఎస్సీవో సభ్యదేశాలతో పాటు మరో 20 దేశాలు ఈ సదస్సులో పాల్గొననున్నాయి. యుద్ధాలను ఆపడం మాట అట్లావుంచి శత్రువులుగా మెలిగే దేశాలను సన్నిహితం చేస్తున్నందుకు ట్రంప్‌కు నిజంగా నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాల్సిందే.

### రంగంలోకి ఇజ్రాయెల్ ప్రధాని

భారత్–అమెరికాల మధ్య మిత్రత్వం దెబ్బతిన్నదన్న వార్తల నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజామిన్ నేతన్యాహు రంగంలోకి దిగడమే కాకుండా, త్వరలో మనదేశంలో పర్యటించబోతున్నట్టు వార్తలు వస్తున్నాయి. డోనాల్డ్ ట్రంప్‌కు, నేతన్యాహు అత్యంత సన్నిహితుడు. ఇజ్రాయెల్ ప్రధాని, మన ప్రధాని నరేంద్ర మోదీకి ఎటువంటి సలహా ఇవ్వబోతున్నారన్న సంగతి పక్కన పెడితే ఆయన ట్రంప్ తరపున రాయబారం నెరపడానికే వస్తున్నారన్న వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. అందితే జుట్టు అందకుంటే కాళ్లు అనేది ట్రంప్ వైఖరి అన్న సంగతి అందరికీ తెలిసిందే. ముఖ్యంగా చైనాతో ఎట్లా ఉన్నా, ట్రంప్ వైఖరితో భారత్‌తో సంబంధాలు దెబ్బతినడం యు.ఎస్.కు చెందిన నిపుణులు, మేధావులు, అత్యధిక శాతం మంది ప్రజలకు ఎంతమాత్రం ఇష్టంలేదు. బలమైన భారత్‌తో సంబంధాలు దెబ్బతినడం యు.ఎస్.కు శ్రేయస్కరం కాదని ఇప్పటికే నిక్కీహేలీ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఏదో విధంగా టారిఫ్‌ల విషయంలో భారత్‌ను ఒప్పించేందుకే ఈ రాయబారమని మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.

### తొలి టర్మ్ సుంకాల ప్రభావం లేదు

ట్రంప్ మొదటి టర్మ్‌లో ఇతర దేశాల దిగుమతులపై విధించిన టారిఫ్‌ల వల్ల, దేశంలో ఉద్యోగావకాశాలు తగ్గడం లేదా పెరగడం జరగలేదని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, యూనివర్సిటీ ఆఫ్ జ్యూరిచ్, ప్రపంచ బ్యాంకుకు చెందిన ఆర్థికవేత్తలు జరిపిన అధ్యయనంలో స్పష్టమైంది. 2018లో ఉక్కు దిగుమతులపై ట్రంప్ సుంకాలు విధించినప్పుడు, అక్కడి ఉక్కు పరిశ్రమలపై దీని ప్రభావం పడలేదు. కానీ ఇందుకు ప్రతిగా చైనా, ఇతరదేశాలు యు.ఎస్. ఉత్పత్తులపై టారిఫ్‌లు పెంచిన ప్రభావం ఉద్యోగ రంగంలో ప్రతికూల ప్రభావాలను చూపింది. కార్ల తయారీలో కెనడా, మెక్సికో, యు.ఎస్.ల మధ్య సంక్లిష్టమైన సరఫరా శృంఖలాలున్నాయి. ఫలితంగా వీటిపై టారిఫ్ విధింపుతో ఈ మూడు దేశాలు నష్టపోతున్నాయి! ఎందుకంటే టారిఫ్‌ల వల్ల పెరిగిన కార్ల ధరల భారం అమెరికన్ వినియోగదారులకే బదిలీ అయింది. ఈ విధంగా వాణిజ్యయుద్ధంలో భాగంగా విధించే అధిక టారిఫ్‌లు, అమెరికాలో ద్రవ్యోల్బణం పెరగడానికే దోహదం చేస్తాయన్నది నిష్ఠుర సత్యం. వరుసగా కొనసాగుతున్న లోటు, సంస్థాగత స్వేచ్ఛ తగ్గిపోతున్న తరుణంలో యు.ఎస్. ట్రెజరీలో అపరిమితంగా డిపాజిట్లు చేస్తున్న ఇతర దేశాలు వెనకాముందూ ఆలోచించే పరిస్థితి ఏర్పడింది. ఉదాహరణకు 2022లో విదేశాల్లోని రష్యా ఆస్తులను, నిధులను స్తంభింపజేసిన తర్వాత ప్రపంచ దేశాల ఆలోచనా సరళిలో మార్పు వచ్చింది.

# భవిష్యత్తును వందేళ్ల క్రితమే చెప్పిన కార్టూన్

నమ్ముతున్నారు. ఆర్.ఎల్. నారాయణన్ అనే లింక్డిన్ యూజర్ దీనిని బయటపెట్టి సంచలనం సృష్టించారు. అమెరికా, ఇంగ్లండ్, ఫ్రాన్స్ వంటి దేశాల పాశ్యాత్య సామ్రాజ్యవాదం చతికిల పడి, చైనా, భారత్, ఆఫ్రికాల ప్రాభవం పెరుగుతుందని ఆ కార్టూన్ ఆనాడు చెప్పింది. ఇప్పుడు ఈ మూడు దేశాలు సభ్యులుగా ఉన్న బ్రిక్స్ డాలర్ ఆధిపత్యానికి మంగళం పాడే క్రమంలో ఉన్నాయి. ఇంతకీ ఈ కార్టూన్ లేదా రాజకీయ వ్యంగ్య చిత్రం గీసిన వారు అమెరికా దేశీయుడే. పేరు బాబ్ మైనర్.

ఈ కార్టూన్‌ను మళ్లీ ఇన్నేళ్లకు పాఠకులకు దృష్టికి తెచ్చినది షికాగో నుంచి వెలువడిన 'డెయిలీ వర్కర్' వార్తాపత్రిక. 2024లోనే ఈ కార్టూన్‌ను పునర్ముద్రించారు. ఆ సందర్భంగా ఆ పత్రిక చేసిన వ్యాఖ్య: 'దాదాపు వందేళ్ల క్రితమే ప్రముఖ అమెరికా కార్టూనిస్టు బాబ్ మైనర్ (ప్రపంచ) భవిష్యత్తు ఇలా ఉండబోతున్నదని గ్రహించాడు. పాశ్చాత్య దేశాలు ప్రపంచాన్ని శాసిస్తున్నాయంటే అందుకు కారణం– ధనం, తుపాకులు. కానీ చైనా, భారత్, ఆఫ్రికాలకు ధనం లేదు, తుపాకులూ లేవు. కానీ మానవ సంపత్తి విశేషంగా ఆ దేశాలకు ఉంది. ఏదో ఒకరోజున (ప్రపంచ) ఆధిపత్య సమతౌల్యం మారిపోతుంది. మైనర్ ఈ కార్టూన్‌ను 1925లో రచించారు. 99 ఏళ్ల తరువాత ఇవాళ్టి ప్రపంచ ప్రజానీకం మేల్కొంటూ, ఏదో మార్పు అయితే వచ్చిందన్న వాస్తవాన్ని గ్రహిస్తున్నారు.' సరిగ్గా ట్రంప్ తన సుంకాల వడ్డనతో ప్రపంచాన్ని కంగారు పెట్టాలని చూసి, తన గోతిని తానే తవ్వుకుంటున్నాడన్న భావన ప్రపంచమంతా నెలకొన్న తరుణంలో ఈ కార్టూన్ జనం ముందుకు వచ్చింది. దీనితో మరింత ఆసక్తి, ఆకర్షణ దీని పట్ల ఏర్పడినాయి. పైగా రష్యాతో చమురు దిగుమతి చేసుకుంటున్నందుకు భారత్‌పై ట్రంప్ కక్ష కట్టడంతో ఈ కార్టూన్ భారతీయులను ఇంకాస్త ఎక్కువగా ఆకర్షిస్తున్నది. ఈ కార్టూన్ శతాబ్ది వేళకే బ్రిక్స్ పటిష్టం కావడం, భిన్న ధ్రువ ప్రపంచం నిర్మాణం కావడం చూస్తున్నాం అని ఈ కార్టూన్‌ను మళ్లీ వెలుగులోకి తెచ్చిన నారాయణన్ వ్యాఖ్యానించారు. అంతేకాదు, ఇలాంటి అనర్థమైన యుద్ధాలకు సంబంధించి, బుద్ధితక్కువ వ్యూహాలకు సంబంధించి మన ఆర్య చాణక్యుడు చెప్పిన ఒక అంశాన్ని కూడా జాతికి గుర్తు చేశారాయన. 'నీవు ఒక యుద్ధం ఆరంభించే ముందు, దానితో వచ్చే విజయం మూల్యమెంతో అంచనా వేయి. అలాగే శత్రువు పగకు మూల్యం ఎంతో కూడా అంచనా వేయి' అన్నాడు ది గ్రేట్ చాణక్య. దీనికి కొనసాగింపుగా నారాయణన్ తన వ్యాఖ్య కూడా చేర్చారు. 'పురోభివృద్ధిలో ఉన్న ఒక వ్యవస్థ మీద ఆచితూచి చూడకుండా ఎత్తు వేస్తే ఆ రోజుకు విజయం కనిపించవచ్చు. కానీ ఒక శతాబ్దాన్ని కోల్పోతారు' అన్నారాయన. దీనికి విశేషంగా లైక్‌లు వచ్చి పడుతున్నాయట.

– జాగృతి డెస్క్

---

ఆర్బీఐతో సహా వివిధ దేశాల సెంట్రల్ బ్యాంకులు ఇప్పుడు డాలర్ మారకం కంటే, బంగారాన్ని కొనుగోలు చేయడమే శ్రేయస్కరమన్న నిర్ణయానికి వచ్చాయి. ఇప్పుడు ట్రంప్ దేశీయంగా పన్నుల్లో కోత, విదేశీ దిగుమతులపై టారిఫ్ పెంపు అమలు చేస్తున్న నేపథ్యంలో దేశంలో ద్రవ్యోల్బణం పెరగవచ్చునని ఆర్థిక నిపుణులు వేసిన అంచనాలు నిజమయ్యాయి.

**దిగుమతులపైనే ఆధారం**

నిజం చెప్పాలంటే రెండో ప్రపంచ యుద్ధం తర్వాత యు.ఎస్ ఆర్థిక వ్యవస్థ దిగుమతులపైనే ఎక్కువగా ఆధారపడుతూ వచ్చింది. దేశీయంగా పూర్తిస్థాయి ఉద్యోగాల కల్పన ద్వారా తగినంత మేర ఉత్పత్తులు లేకపోవడంతో దిగుమతులపై ఆధారపడక తప్పని పరిస్థితి! ముఖ్యంగా అమెరికా ఆర్థికవ్యవస్థలో ఉత్పత్తి కంటే వినియోగమే అధికం! ఇదే అధిక దిగుమతులకు, వాణిజ్య లోటుకు ప్రధాన కారణం. అంతేకాదు అమెరికాలో శ్రామిక ఖర్చులు అధికం. ఇంత పెద్దమొత్తంలో ఖర్చు చేస్తూ ఉత్పత్తి చేసేకంటే చౌకగా లభించే దిగుమతులే ఉత్తమం! ఇది ఆ దేశ ఆర్థికవ్యవస్థ నిర్మాణం తీరు! యు.ఎస్.తో పోల్చినప్పుడు శ్రామిక, ఉత్పత్తి, ముడిసరుకుల లభ్యత తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉన్న దేశాలు చాలా తక్కువ ధరలకే అమెరికాకు తమ ఉత్పత్తులను ఎగుమతి చేయగలుగుతున్నాయి. అధిక దిగుమతుల కారణంగా తమ దేశ తయారీరంగంలో ఉద్యోగావకాశాలు పడిపోతున్నాయని ట్రంప్ చేస్తున్న వాదనలో అర్థం లేదు. అంతేకాదు, ఈ సుంకాల పెంపునకు ఈ ఉద్యోగాలు కోల్పోవడానికి సంబంధమేలేదు. అందువల్ల టారిఫ్‌ల విధింపు అక్కడి ఉద్యోగ, ఉపాధి సమస్యను పరిష్కరించదు. ఇక్కడ మరో విషయం కూడా గుర్తుంచుకోవాలి. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత యు.ఎస్.డాలర్ ప్రపంచ రిజర్వ్ కరెన్సీగా రూపొందింది. ఫలితంగా దేశీయంగా దిగుమతి వస్తువుల వినియోగం బాగా పెరగడానికి ఇది దోహదం చేసింది. ఈ సానుకూలత ప్రపంచంలోని మరే ఇతర దేశానికి లేదు. అటువంటప్పుడు వాణిజ్య లోటును ప్రధాన సమస్యగా చూపడం ట్రంప్ ప్రభుత్వానికి ఎంతమాత్రం తగదు. ఎందుకంటే యు.ఎస్.కు డాలర్ వల్ల కలుగుతున్న అపరిమితమైన ప్రయోజనం నేపథ్యంలో, ఇతర దేశాలు ఈ అంశాన్ని ప్రశ్నించే హక్కును కలిగివుంటాయి.

**భారత్–చైనాలపై ఆగ్రహం**

వర్ధమాన దేశాల ముసుగులో భారత్, చైనాలు వాణిజ్య ప్రయోజనాలు పొందుతున్నాయని మొదటి నుంచీ ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేస్తూనే ఉన్నారు. తర్వాతి కాలంలో దక్షిణాఫ్రికా, ఇండొనేషియాలను కూడా ఈ జాబితాలో చేర్చారు. గతంలో తాను అధ్యక్షుడిగా ఉన్నప్పుడు అమెరికా ఉత్పత్తి చేస్తున్న ఖరీదైన హార్లీ డేవిడ్‌సన్ ద్విచక్రవాహనాలపై సుంకాలను తగ్గించాలని మనదేశంపై ట్రంప్ ఒత్తిడి తెచ్చారు. చివరకు మనదేశం సుంకాలు తగ్గిస్తే, ఇది చాలదంటూ పేచీకి దిగారు. అంతేకాదు మన ఉక్కుపై 25%, అల్యూమినియం ఉత్పత్తులపై 10% అదనపు టారిఫ్ విధించడం ద్వారా ప్రతీకార వైఖరిని చూపారు. మన దేశం కూడా అమెరికా నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై సుంకాలు పెంచింది. తర్వాత జీఎస్పీ నిబంధనలు భారత్‌కు వర్తింపజేయొద్దని ఏకంగా ప్రపంచ వాణిజ్య సంస్థలకు ట్రంప్ లేఖ రాశారు. ఇక బ్రిక్స్ దేశాలు డాలర్ రహిత వాణిజ్యం వైపు మొగ్గు చూపితే వందశాతం టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించారు. బ్రిక్స్‌లో మనదేశం కీలక భాగస్వామి. ఏదోవిధంగా మన దేశాన్ని రష్యా, చైనాల నుంచి దూరం చేయాలన్నది ట్రంప్ ఉద్దేశం. కానీ ఈ ప్రయత్నాల్లో ఆయన ఎప్పటికప్పుడు విఫలమవుతూ వస్తున్నారన్నది వర్తమాన పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. మొత్తం మీద చెప్పాలంటే టారిఫ్‌లపై ట్రంప్ తీసుకునే నిర్ణయాలు, చివరకు అమెరికన్ ప్రజలకే భారంగా మారమవుతాయి తప్ప, మరో ప్రయోజనం కనిపించడంలేదు. ఈ దిశగా ఆయన ఎందుకు ఆలోచించడం లేదన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న!

**మనదేశం నుంచి యు.ఎస్.కు ఎగుమతులు**

మన దేశంనుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే వస్తువుల్లో ముత్యాలు, రంగురాళ్లు, ఔషధాలు, ఆహార ఉత్పత్తులు ప్రధానంగా ఉండగా, మన దే శానికి దిగుమతి అయ్యేవాటిల్లో విద్యుత్–మెషినరీ పరికరాలు, అణు రియాక్టర్లు–యంత్రాలు, ఖనిజ ఇంధనాలు–చమురు, లెన్స్‌లు, మైక్రోస్కోప్‌లు, వైద్య పరికరాలు ఉన్నాయి. మన దేశం నుంచి విదేశాలకు చేసే మొత్తం ఎగుమతుల్లో అమెరికా వాటా 17.7%. ఇక మనదేశం విదేశాలనుంచి చేసుకునే దిగుమతుల్లో



# 'డాలర్‌కు అంతిమ ఘడియలు సమీపించాయి!'

అమెరికా డాలర్ ఆధిపత్యం పతనం కావడం మొదలయిందని ఆ దేశ ట్రెండ్ ఫోర్‌కాస్టర్ గెరాల్డ్ సెలెంటి హెచ్చరించాడు. భారత్, చైనా దేశాల గణనీయమైన ఆర్థిక స్వయం సమృద్ధి, ఈ రెండు దేశాలు 'బ్రిక్స్'కు మద్దతుగా నిలవడం ఇందుకు కారణంగా గెరాల్డ్ చూపుతున్నాడు. బ్రిక్స్ దేశాలు కూటమి (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణ ఆఫ్రికా) అమెరికా విదేశాంగ విధానానికి వ్యతిరేకంగా ఉండడం కూడా డాలర్ పతనానికి మార్గం వేస్తున్నాయని ఆయన చెబుతున్నారు. ఈ పరిణామం గురించి ఆయన చాలా కీలక వ్యాఖ్యలు చేశారు.

సుంకాల పేరుతో అమెరికా నిరోధించాలని చూసినప్పటికి రష్యా నుంచే చమురు కొనుగోలు చేయాలని భారత్ నిర్ణయం తీసుకోవడం గురించి ఒక చర్చలో ప్రస్తావనకు వచ్చినప్పుడే గెరాల్డ్ ఈ విషయం చెప్పాడు. క్యూబన్-అమెరికన్ పత్రికా రచయిత రిక్ సాంచెజ్ గెరాల్డ్ వద్ద ఈ అంశం ప్రస్తావించినప్పుడు డాలర్ ఆధిపత్య తిరోగమనం మొదలయిందని ఆయన వ్యాఖ్యానించడం విశేషమే. అమెరికా ఆంక్షలతో ఏమీ కాదని, అమెరికాతో భారత్ చేస్తున్న వాణిజ్యం మొత్తం వారి జీడీపీలో రెండు శాతం మాత్రమేనని విశ్లేషించారు. ఆ దేశాల వారు మరింత స్వయం సమృద్ధిని, స్వయం సమృద్ధిలో నిలకడను సాధిస్తున్నారని చెప్పారు. వారి ఉత్పత్తులు వారే చేసుకుని, వారే కొనుగోలు చేస్తున్నారు, అక్కడి ప్రజలు వాటిని కొనుగోలు చేస్తున్నారు. అది అమెరికాకు ఏం ప్రయోజనం కాగలదని ఆయన ప్రశ్నించారు. ప్రపంచ ఆర్థిక శక్తి మీద అమెరికా పట్టు కోల్పోతున్నదని అన్నారు. ఆర్థిక శక్తిగా ప్రస్తుతం చైనా ప్రపంచాన్ని నడిపిస్తున్నదని, ఈవీలను ఒకదాని తరువాత ఒకటి పరిశీలిస్తే ఇది తెలుస్తుందని, వారు పూర్తి స్వయంసమృద్ధి సాధించే దిశలోనే ఉన్నారని గెరాల్డ్ అన్నారు. తమ దేశంలో భారత్ దిగుమతుల మీద 50 సుంకాలు ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, బ్రెజిల్‌ను కూడా వదిలిపెట్టలేదు. దీనితో బ్రిక్స్ కూటమికీ, అమెరికాకూ నడుమ ఘర్షణ వాతావరణం మరింత తీవ్రమైంది.

విదేశాల వ్యవహారాలలో, అవి తీసుకునే నిర్ణయాలలో అమెరికా జోక్యం గురించి ప్రశ్నించినప్పుడు గెరాల్డ్ అసహనం వ్యక్తం చేశారు. తన సరిహద్దులకు ఆవల ఉన్న దేశాల ఆర్థిక వ్యవహారాలను శాసించే హక్కు అమెరికాకు లేదని ఆయన కరాకండీగా చెప్పారు. అమెరికన్‌గా నా పని నేను చేసుకోవాలి, రష్యా-భారత్ ఏదో చేస్తే అది నాకెందుకు అన్నారాయన. బ్రిక్స్ కూటమి మీద అమెరికా కాలు దువ్వుతున్నది. అంటే ప్రపంచ జనాభాలో 40 శాతం ప్రజానీకానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కూటమితో ఘర్షణకు దిగుతున్నది. ఇప్పుడు అమెరికా ఆర్థిక విధానాలను ఆ కూటమి దేశాల ప్రజలంతా ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్నారు. అమెరికా తన ఆధిపత్యాన్ని చూపగలిగినంత కాలం చూపింది. నిజానికి ఆ ధోరణితో ప్రపంచం విసిగిపోయింది. మనం భారత్, చైనాలను చూస్తున్నాం. ఒక్కొక్క దేశంలో 140 కోట్ల మంది ఉన్నారు. 34.7 కోట్లు ఉన్న అమెరికా జనాభా ఏం చేయగలదు అని కూడా గెరాల్డ్ ప్రశ్నించారు. పెరిగిన ఆర్థిక వత్తిడుల నేపథ్యంలోనే ఇటీవల బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డజిల్వా మన ప్రధాని మోదీతో ఫోన్‌లో చర్చించారు. పెరిగిన అమెరికా సుంకాల ప్రభావం ఆర్థిక వ్యవస్థ లను ఏ విధంగా ప్రభావితం చేయగల దన్న అంశమే వారి మధ్య చర్చకువచ్చింది. అమెరికా లేదా ప్రపంచం నుంచి వస్తున్న ఆర్థిక ఒత్తిడులతో నిమిత్తం లేకుండా ఇరు దేశాలమధ్య వాణిజ్య సహకారం పెంచుకోవాలని నిర్ణయానికి వచ్చారు. తాను 2026లో భారత్‌లో పర్యటిస్తానని బ్రెజిల్ అధ్యక్షుడు చెప్పారు కూడా.

డాలర్ భవిష్యత్తు అంధకారంలో పడిందని గెరాల్డ్ అంచనా వేస్తున్నారు. ఈ పతనం డాలర్ మరణానికి దారి తీస్తుందని కూడా హెచ్చరించారు. ఇప్పుడు అమెరికా ఆర్థిక వ్యవస్థలో జరుగుతున్నదంతా తిరోగమనమే. అందుకే డాలర్ అంతిమ క్షణాలు మొదలయ్యాయి అని ఆయన ప్రకటించాడు. అమెరికా ఆర్థిక విధానాలు బ్రిక్స్ విస్తృత అజెండా మీద ప్రభావం చూపుతాయి. బ్రిక్స్ కూటమి కూడా వాణిజ్యంలో డాలర్ స్థానాన్ని తగ్గించే పనిలోనే ఉంది. ప్రత్యామ్నాయ ఆర్థిక వ్యవస్థల నిర్మాణం కోసం జరుపుతున్న కృషిలో ఇదొక భాగం. ఆ క్రమంలోనే పాశ్చాత్య దేశాల కనుసన్నలలో పనిచేసే ప్రపంచ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థలపై ఆధార పడడాన్ని తగ్గించుకోవాన్నది కూడా బ్రిక్స్ ఆశయం.

– జాగృతి డెస్క్

యు.ఎస్. నుంచి దిగుమతి చేసుకునేవి 2.7% మాత్రమే. ట్రంప్ మొదటిసారి అమెరికా అధ్యక్షుడయ్యాక భారత్‌నుంచి 761మిలియన్ డాలర్ల స్టీల్, 382 మిలియన్ డాలర్ల అల్యూమినియం దిగుమతులపై వరుసగా 25%, 10% చొప్పున సుంకాలు విధించారు. దీనికి ప్రతిగా భారత్ 28 అమెరికా ఉత్పత్తులపై దిగుమతి సుంకాలు విధించింది. నిజానికి 2018లో అమెరికా ఉత్పత్తులపై భారత్ విధించే సగటు సుంకాల విలువ 11.59 శాతం కాగా అమెరికా మన ఉత్పత్తులపై విధించిన సుంకాలు 2.72శాతం. ఇది 2022 నాటికి సగటున 15.3, 3.83శాతంగా ఉన్నాయి.

**మనతో వాణిజ్యలోటు తక్కువే**

విచిత్రమేమంటే ట్రంప్ ఇన్నివిధాలుగా వాదిస్తున్నప్పటికీ 2024 ఆర్థిక సంవత్సరంలో చైనా(295.4 బిలియన్ డాలర్లు), మెక్సికో (171.8 బిలియన్ డాలర్లు), జపాన్(68.5 బిలియన్ డాలర్లు), కెనడా(63.3 బిలియన్ డాలర్లు) దేశాలతో జరిపిన వాణిజ్యంలో పెద్ద ఎత్తున వాణిజ్యలోటు నమోదైంది. మరి ఇదే ఏడాది భారత్‌తో వాణిజ్య లోటు 45.7 బిలియన్ డాలర్లు మాత్రమే. పై దేశాలతో పోలిస్తే మనదేశ వాణిజ్యలోటు చాలా తక్కువ. అమెరికా వాణిజ్య ప్రతినిధి వెబ్‌సైట్‌లో ఇచ్చిన సమాచారం ప్రకారం 2024లో భారత్-అమెరికాల మధ్య జరిగిన మొత్తం వాణిజ్యం 129.2 బిలియన్ డాలర్లు. ఇందులో భారత్‌కు యు.ఎస్. ఎగుమతుల విలువ 41.8 బిలియన్ డాలర్లు. ఇదే సమయంలో భారత్ నుంచి దిగుమతి చేసుకున్న వాటి విలువ 87.4 బిలియన్ డాలర్లు. ఫిబ్రవరి 13న ప్రధాని నరేంద్ర మోదీ అమెరికాలో పర్యటించినపుడు "పారదర్శకత, జాతీయ భద్రత, ఉద్యోగాల కల్పన" అనే అంశాల ప్రాతిపదికన ద్వైపాక్షిక వాణిజ్యం కొనసాగించాలన్న అంగీకారానికి వచ్చారు. అంతేకాదు 2030 నాటికి ఇరుదేశాల మధ్య వాణిజ్యం 500 బిలియన్ డాలర్లకు పెంచాలని ఇరుదేశాధినేతలు నిర్దేశించారు. కానీ ట్రంప్ నోబెల్ శాంతి బహుమతి కోర్కె ఇరుదేశాల సంబంధాలను దెబ్బతీయడమే కాదు, తాను కూర్చున్న కొమ్మను నరుకుతున్న చందంగా తయారైందనడంలో ఎంతమాత్రం సందేహం లేదు.



జమలాపురపు విఠల్‌రావు
సీనియర్ జర్నలిస్ట్


INTO YOUR LIFE
SURYA
INTO YOUR LIFE, WE BRING LIGHT, WARMTH, & STRENGTH.
INTO YOUR LIFE, WE BRING SURYA ROSHNI.
Surya Roshni is the trusted companion bringing light, warmth, and care to every moment.
From purity in every sip to safe spaces, we bring innovation and reliability into your life.
Let's brighten up your world together!
Consumer Lighting | Steel & PVC Pipes | Fans | Appliances | Professional Lighting
I am SURYA | 50 YEARS OF TRUST | DURABLE PRODUCTS | ASSURED QUALITY
SURYA ROSHNI LIMITED | www.surya.co.in | surya surya_roshni surya.roshni surya-roshni
Email: info@surya.in Tel.: +91-11-47108000

స్వరాజ్యం తర్వాత ఆయన మద్రాస్ ప్రాంతంలోను, ఆంధ్రప్రాంతంలోను అత్యున్నత పదవులను అందుకున్నారు. మన ఎన్నికలలోని గెలుపోటములను, ఆశాభంగాలను, శైశవదశలో ఉన్న భారత ప్రజాస్వామ్య సమస్యలను ఆయన చవిచూచారు.

ఆయన ఆగష్టు 23, 1872న జన్మించారు. నలభై సంవత్సరాలు ఆంధ్ర రాజకీయ రంగంలో మహానాయకుడుగా రాణించి, మే 20, 1957న చనిపోయారు. నేటికి ఆంధ్రప్రజల హృదయాలలో, స్మృతిలో ఆంధ్ర కేసరిగా జీవించి ఉన్నారు.

**రాజమండ్రి పురపాలక సంఘు అధ్యక్షులుగా అధికారానుభవం**

1901లో రాజమండ్రి పురపాలక సంఘు అధ్యక్షులుగా ఎన్నికై, ప్రకాశం ప్రజల నుండి ఉద్భవించే అధికారాన్ని చవి చూచారు. ఆనాడే ఆయన బ్రిటిషు అధికారులతో తలపడి, వారిని అదుపు చేయడం నేర్చుకున్నారు. ఆయన ఇంగ్లండు వెళ్లి, న్యాయశాస్త్రం చదివారు. మద్రాసు హైకోర్టులో న్యాయవాదిగా చేరారు. న్యాయ వాదులలో అగ్రశ్రేణిని అందుకున్నారు. న్యాయ మూర్తులకు, ప్రభుత్వానికి సింహస్వప్నం అయినారు. ఇట్టి న్యాయవాద వృత్తిని వదులుకొని, రాజకీయాలలో ప్రవేశించాలని ఆయన నిశ్చయించారు.

ఆంధ్రలోని ఆయన సహచర బృందం కూడా దేశభక్తి, ప్రజాసేవానుభవం కలిగినట్టిది. దేశభక్త కొండ వెంకటప్పయ్య, దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు, డాక్టర్ పట్టాభి సీతారామయ్య, బులుసు సాంబమూర్తి, డాక్టర్ సుబ్రహ్మణ్యం, జి. సీతారామ శాస్త్రి, జోగయ్య, దుగ్గిరాల గోపాలకృష్ణయ్యలు వారిలో కొందరు.

బహుభాషా ప్రాంతం మద్రాసులోని గాంధేయ వాదులలో ప్రకాశంగారికి శ్రీనివాస అయ్యంగార్‌తో గాఢమైత్రి ఏర్పడింది. ఆయన అడ్వకేట్ జనరల్ పదవికి రాజీనామా ఇచ్చి సహాయ నిరాకరణో ద్యమంలో చేరారు. అయితే రాజాజీతో మాత్రం ఆయనకు అట్టి గాఢమైత్రి ఏర్పడలేదు. తర్వాతి కాలంలో ఇది ఉభయుల సంబంధాలలో క్లిష్టస్థితులకు దారితీసింది. 30 ఏండ్ల గాంధేయ శకంలో ఉభయుల ధోరణులకు అవకాశాలకు అంతరాన్ని సృష్టించింది.

**స్వరాజ్య పత్రిక కోసం లక్షల ధనం సేకరణ**

ఆంధ్రపత్రికను ప్రారంభించడంలో నాగేశ్వరరావు గారి దూరదృష్టిని ప్రకాశం గుర్తించారు. గాంధేయ ఉద్యమంలోను, స్వరాజ్య సమరంలో ఆంధ్ర ప్రజల పాత్రను ప్రచారం చేయడానికై 'స్వరాజ్య' అనే ఆంగ్ల దినపత్రికను ప్రారంభించ నిశ్చయించారు. అయితే ఆయనకు నాగేశ్వరరావుగారికున్న వ్యాపార లక్షణం లేదు. వ్యాపారానుభవం గడించిన నాగేశ్వరరావు గారికి దాని నిర్వహణను అప్పగించడానికి కూడా ఆయన ఇష్టపడలేదు. 'స్వరాజ్యం'ం పై వచ్చే నష్టాన్ని భర్తీ చేయడానికై ఆయన కూనూరులోను, మద్రాసులోను ఇతర స్థలాలలోను తన భవంతులను, భూములను, ఇతర ఆస్తులను అమ్మివేయవలసి వచ్చింది. బ్రిటిషు సామ్రాజ్యవాదాన్ని పదునుగా, నిర్భయంగా, జాగరూకంగా, నిర్దాక్షిణ్యంగా విమర్శించే ఆ పత్రిక అంతులేని దాహాన్ని తీర్చడానికి ఆయన ఆంధ్రలోను, భారతదేశంలోను, ప్రపంచంలోను లక్షలకొలది ధనం విరాళాలుగా సేకరించారు.

జి.వి.కృపానిధి, పున్నారావు, రామారావు, ఖాసాసుబ్బారావులవంటి దేశభక్తి పూరితులైన రచయితలు స్వరాజ్య పత్రికలో పనిచేసి స్వరాజ్య సమరంపై చెరుగని ముద్రవేశారు. తర్వాతి కాలంలో వారు పాత్రికేయరంగంలో ప్రముఖులుగా రూపొందారు.

**కేంద్ర శాసనసభకు ప్రకాశం ఎన్నిక**

ప్రకాశంగారికి మోతీలాల్ నెహ్రూ, సి.ఆర్.దాస్‌ల రాజకీయాల పట్ల ఎక్కువ ఆసక్తి, సాన్నిహిత్యం ఏర్పడ్డాయి. 'కౌన్సిల్ బహిష్కరణ'ను నిలిపివేసి, శాసనసభా రంగంలో కూడా బ్రిటిష్‌వారితో పోరాడాలనే వారి నిర్ణయం ఆయనకు నచ్చింది.

ఆయన స్వరాజ్య పార్టీలో చేరారు. కేంద్ర శాసన సభకు, ఎన్నికై మోతీలాల్ నెహ్రూ మదన్‌మోహన మాలవ్య ప్రభృతుల సాహసకృషికి దోహదం చేశారు. ఆయన ప్రగతిశీలత, స్వతంత్ర ప్రవృత్తి జిన్నా అభిమానాన్ని చూరగొన్నాయి. కనుక శాసనసభ కార్యకలాపాలలో అనేక కీలక సందర్భాలలో సమైక్య కృషికి, సమైక్యంగా ఓటువేయడానికి జిన్నా సమర్థనను పొందడంలో మోతీలాల్ నెహ్రూకు ఆయన చక్కని ఆసరా అయ్యారు.

జవాహర్‌లాల్ కళాకళలు, మధ్య మధ్య బహిష్కరణలకు పిలుపులు ఆయనకు నచ్చేవి కావు. కనుక 1929-30లో వైస్‌రాయ్ ఇర్విన్‌తో సంప్రదింపులు విఫలం కావడంతో కాంగ్రెసు శాసన సభ నుండి ఉపసంహరించ డానికి నిర్ణయించినప్పుడు ఆయన శాసనసభా రంగాన్ని వదలడానికి అంగీకరించలేదు.

ఆయన అందరితోపాటు రాజీనామా చేశారు. కాని తిరిగి ఎన్నికై బ్రిటిషు పాలకులతో పోరాటం సాగించారు. బడ్జెట్ చర్చలో గాంధీగారి ఉప్పు సత్యాగ్రహంపై ఆయన గంటసేపు మహోద్రేకంగా చేసిన ప్రసంగం శాసనసభా చరిత్రలో అవిస్మరణీయమైనది.

**ఉప్పు సత్యాగ్రహంలో నాయకత్వం, జైలుశిక్ష**

సత్యాగ్రహ సమరంలో అగ్రేసరుడుగా నిలవాలని నిర్ణయించుకొని ఆయన శాసనసభకు రాజీనామా ఇచ్చారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని, జైలుకు వెళ్లి, జైలులో తోటి దేశభక్తుల సాహచర్యంలో ప్రశాంతిని, సంతృప్తిని పొందారు.

సైమన్ కమిషన్ మద్రాసు వచ్చినప్పుడు



దేశభక్తిలోను, ప్రజాసేవలోను లజపత్‌రాయ్, మోతీలాల్ నెహ్రూ, సి.ఆర్.దాస్, దేశపాండే, సర్దార్ పటేల్, శ్రీనివాస అయ్యంగార్‌ల కోవకు చెందినవారు ప్రకాశం. నేడు జీవించి ఉన్నవారిలో రాజాజీతో పోల్చదగినవారు. ధైర్యంలో ఆయనను స్వామి శ్రద్ధానందతోను, లజపత్‌రాయ్‌తోను పోల్చవచ్చు. జాతీయోద్యమానికి తన సర్వస్వాన్ని ఒడ్డడంలో సి.ఆర్.దాస్‌తో పోల్చవచ్చు.

# ధీరోదాత్తుడగ

అద్భుతమైన సాహసాన్ని ప్రదర్శించి, ఆయన సామాన్య ప్రజలందరి, కాంగ్రెసువాదులందరి గౌరవాన్ని చూరగొన్నారు. ఇది ఆయనకు కార్యరంగంలో స్వేచ్ఛనిచ్చింది.

**ప్రకాశం సింహగర్జన**

ఆ సంఘటన నాకు బాగా గుర్తుంది. ఆ రోజు సాయంత్రం మద్రాస్ బీచ్‌లో లక్షలాదిగా సమావేశమైన ప్రజానీకాన్ని ప్రభుత్వపు ఆశ్విక దళాలవారు చెదరగొడుతున్నారు. వేదికపైనున్న ప్రకాశంగారు "దౌర్జన్యాలను ఆపండి" అంటూ సింహగర్జన చేశారు. పోలీసులు వేదికను సమీపించి ప్రకాశంగారిపై తుపాకులు గురిపెట్టారు. ప్రకాశంగారు ఆ తుపాకులకు తన ఛాతీని ఎదురొడ్డి 'మీకు రక్తదాహం ఉంటే నన్ను కాల్చి చంపండి కాని, ప్రజలను మాత్రం హింసించండి' అని సవాల్ చేశారు. ఆ బ్రిటిషు ఆఫీసరు ప్రకాశంగారి సాహసానికి, సింహగర్జనకూ దిగ్భ్రాంతి చెంది, తన పోలీసు బలగాన్ని ఉపసంహరించుకున్నాడు.

**జమీందారీల రద్దుకు ప్రకాశంగారి నివేదిక**

1931లోను, 1941-42లోను ప్రకాశంగారితోను, రాజాజీతోను జైలు జీవితం గడిపే భాగ్యం నాకు కలిగింది. ఆ రెండు సూదంటురాళ్ల చుట్టూ రాజకీయ ఖైదీలమంతా చేరేవాళ్లం. సామ్రాజ్యవాదులను వెళ్లగొట్టడానికై కార్యరంగంలో అవిక్రపరాక్రమాన్ని ప్రదర్శించే దేశభక్తులకు



# నాయకుడు

ప్రకాశంగారు కేంద్రమయ్యారు.

1937–39లో కాంగ్రెసు రాజకీయాలలో మంత్రివర్గాలలో చేరాలనే వాదం బలంగా ఉండేది. "ప్రో ఛేంజర్"ల నాయకుడు సి.ఆర్.దాసును ఓడించిన "నో ఛేంజర్" నాయకుడు రాజాజీ 1936–37 నాటికి "ప్రోఛేంజర్"గా మారి మద్రాసు ముఖ్యమంత్రి పదవిని స్వీకరించాడు. శాసనసభా పక్షంలో అధిక సంఖ్యాక బలాన్ని పొందజాలక పోయిన "ప్రోఛేంజర్" ప్రకాశం క్రమశిక్షణ పాటించి రెవెన్యూ మంత్రిగా ఆ మంత్రివర్గంలో రెండవ స్థానాన్ని స్వీకరించారు. జమీందారీల రద్దుకు సుదీర్ఘం, ఏకగ్రీవమునయిన నివేదిక తయారుచేశారు. రాజాజీ ప్రకాశం నివేదికను ఆమోదించారు.

1946లో మద్రాసు కాంగ్రెసుపార్టీ మరోసారి నాయకుణ్ణి ఎన్నుకోవలసి వచ్చింది. కాని ప్రకాశంగారు నాయకుడు కావడం గాంధీజీకి అంత ఇష్టం లేదు. ప్రకాశంగారు నాయకత్వానికి అభ్యర్థిగా నిలబడకూడదని ఆయన కబురు పంపాడు. ప్రకాశంగారు దాన్ని లెక్కచేయలేదు. నాయకత్వానికి పోటీచేసి, నెగ్గి, ముఖ్యమంత్రి అయ్యారు.

గాంధీజీ సలహాను కాదని తనను నిస్సంకోచంగా సమర్థించిన వారినే మంత్రులుగా నియమించే పొరపాటు చేశారు ప్రకాశంగారు. ఆంధ్ర కాంగ్రెసు అధ్యక్షుడుగా, అసంతృప్తివర్గం వారిని కూడా మంత్రివర్గంలోకి తీసుకోమని నేను సలహా ఇచ్చాను. కాని ఆయన తన పట్ల వారి అవిశ్వాసాన్ని క్షమించలేదు. ఇది మంత్రివర్గం పతనానికి దారితీసింది.

**హరిజనోద్ధరణకు కోటిరూపాయల పథకం**

ముఖ్యమంత్రిగా ప్రకాశంగారు ఇతర ప్రాంతాలకు దారిచూపిన ఎన్నో చర్యలు తీసుకున్నారు. గ్రామాభివృద్ధి పథకాలకు ఏడాదికి ఒక కోటి రూపాయలు హరిజనోద్ధరణకు మరో కోటి రూపాయలు. ఖాదీ అభివృద్ధికి మరో కోటి రూపాయలు మంజూరు చేశారు. రైతులకు తన పంట అమ్మకాలపై ప్రత్యేక బోనసు ఇవ్వడం ద్వారా కొనుగోలయ్యే మిగులు పంటను అత్యధికం చేయడానికి ప్రోత్సహించారు. రైస్ మిల్లర్లుచే రైతుల దోపిడీని నివారించడానికై ఉత్పత్తి దారుల కొనుగోలు దారుల సహకార సంఘాలు ప్రారంభ మయినాయి. ప్రజలను ఇబ్బంది పెట్టే కంట్రోళ్లకు, నిర్బంధ లెవీలకు ఒక నిర్మాణాత్మకమైన ప్రత్యామ్నాయాన్ని కనుగొనడానికి ఆయన ఆ సహకారసంఘాల ద్వారా యత్నించారు.

ఈ దశలో ఆయనపై విశ్వాస రాహిత్య తీర్మానం ప్రవేశపెట్టారు. ఆ తీర్మానానికి అనుకూలంగా ఓటు చేయవద్దని ఆంధ్ర కాంగ్రెసు అధ్యక్షుడుగా నేను శాసన సభ్యులను కోరాను. నేను సర్దార్ పటేల్‌కి, జవాహర్ లాల్‌జీకి నచ్చజెప్ప యత్నించాను. కాని ప్రయోజనం లేకపోయింది. అయినా కాంగ్రెస్ శాసనసభ్యులు ఆ తీర్మానానికి అనుకూలంగా ఓటువేశారు. అలా వారిని ప్రకాశంగారిని గద్దె దించడానికి అనుమతించి నట్టు, ప్రోత్సహించినట్టు అయింది.

**మంత్రుల అవినీతిపై ధ్వజమెత్తిన ప్రకాశం**

ముఖ్యమంత్రి పదవిని కోల్పోయిన ఏడాదిలోపల ప్రకాశంగారి వ్యక్తిత్వం ఉన్నత శిఖరాలను అందుకున్నది. ఆయన పలువురు మంత్రులపై అవినీతి, బంధుప్రీతి, బాధ్యతారాహిత్యములు ఆరోపణలతో ఒక ఛార్జిషీట్ తయారుచేసి, దానిపై బహిరంగ విచారణ జరగాలని కోరడం ద్వారా ఒక క్రొత్త రికార్డును స్థాపించారు. అట్టి విచారణ జరిపించమని ఆంధ్రప్రాంత కాంగ్రెసు సంఘం కాంగ్రెసు కేంద్ర కార్యవర్గాన్ని అభ్యర్థించింది. అట్టి విచారణవల్ల మంత్రుల స్థైర్యం సన్నగిల్లుతుందనీ, కాంగ్రెసు మంత్రివర్గాల పట్ల ప్రజల విశ్వాసం క్షీణిస్తుందనే మిథ్యావాదంతో జవాహర్లాల్‌జీ దాన్ని వ్యతిరేకించారు. ప్రకాశంగారు శాసనసభలో ప్రతిపక్షానికి మారి, విశ్వాస రాహిత్య తీర్మానాన్ని ప్రతిపాదించారు; తన ఆరోపణలకు సమర్థనగా గంటల తరబడి, రోజుల తరబడి ప్రసంగిం చారు. ఆయన ఆనాడు మాకు వారన్ హేస్టింగ్స్‌పై అభియోగం నడుపుతూన్న ఎడ్మండ్ బర్క్‌ను గుర్తుకు తెచ్చారు. మంత్రుల అవినీతిపై ధ్వజమెత్తిన మొదటి నాయకుడయ్యే ఘనత ప్రకాశంగారికి దక్కింది. స్వతంత్ర భారతం ఈ సేవకై ప్రకాశంగారికి ఎంతో రుణపడి ఉంది.

జవహర్లాల్‌జీ, రాజెన్‌బాబు, సర్దార్‌పటేల్, మౌలానా ఆజాద్, రాజాజీలు ప్రకాశంగారిపై క్రమశిక్షణ చర్య తీసుకొనదలచారు. కాని ప్రకాశంగారి రుజువర్తన నుండి, నైతిక ఔన్నత్యం నుండి స్ఫూర్తి పొందిన నేను దానిని వ్యతిరేకించాను. రాజాజీ నా వైఖరిని అభినందించారు.

**ఆంధ్రప్రాంతానికి మొదటి ముఖ్యమంత్రి**

ఆంధ్ర ప్రాంతం ఏర్పడినప్పుడు శాసనసభలో కమ్యూనిస్టులు పెద్ద పార్టీగా ఉన్నారు. తమ పార్టీ అధికారంలోకి రావడమెలా అని జవాహర్‌లాల్ ఆలోచనలో పడ్డారు. ప్రజాపార్టీ నాయకులు ప్రకాశం గారిని మంత్రివర్గం ఏర్పరచడానికి ఆహ్వానిస్తే, ఆ మిశ్రమ మంత్రివర్గంలో చేరమని మా కిసాన్‌పార్టీకి సలహా ఇస్తానని నేను జవాహర్‌లాల్‌కి సూచించాను. జవహర్‌లాల్‌జీ స్వభావానికి విరుద్ధమైన సూచన అది. అయినా ఆయన దానిని స్వీకరించి ప్రకాశంగారు ముఖ్యమంత్రి కావడానికి అంగీకరించారు.

1955లో కమ్యూనిష్టు సవాల్‌ను ఎదుర్కొని సమైక్య కాంగ్రెసును– జవాహరాల్‌ల్‌జీ కాంగ్రెసు మాత్రమే కాదు, గెలిపించడానికి 80 ఏండ్లకు పైబడిన వయస్సు ఉన్నా ప్రకాశంగారు మాతో కలిశారు. మరి రెండేండ్ల తర్వాత ఆంధ్రప్రదేశ్ అవతరణను కూడా ప్రకాశంగారు దర్శించారు.

**ఉదారతకు మారు పేరు**

ప్రకాశంగారు వ్యక్తిగత జీవితంలోను, రాజకీయ రంగంలోను అతి ఉదారతను చూపేవారు. స్వరాజ్య పత్రిక అవసరాలకోసం నిధులు సేకరిస్తూనే మరో ప్రక్క కష్టాలలో ఉన్న ఎందరో కాంగ్రెసు వాదులకు ఆర్థిక సహాయం అందజేసేవారు. ఆయన స్నేహితులకు ప్రాణమిచ్చేవారు. చిరునవ్వుతో సహచరుల కృషిని అభినందించేవారు.

ఆయన పైకి గంభీరంగా, పట్టుదల కల వ్యక్తిగా కనబడేవారు. కాని ప్రజల బాధలను చూచినప్పుడు ఆయన హృదయం వెన్నవలె కరిగి పోయేది; ఆయన కన్నీరు కార్చేవారు. ఆయన తన ఉపన్యాసాలతో ప్రజలలో భావోద్రేకాన్ని కలిగించేవారు. వానిలో పదాడంబరంకాని, ఉపమా నాలుగాని, అలంకారాలు కాని ఉండేవి కావు. అయితే ఆయన ఆచితూచి వాడే మాటలలోని పదును, తీక్షణత, శ్రోతలను కదిలించివేసేవి.

భరతమాతను శ్రద్ధాభక్తులతో అర్చించిన ఈ ఉదాత్త చరితుని వీరగాథలను, మన విజయాలను, మహత్తర సందేశాలను దేశమంతా స్మరిస్తోంది; ఆయనకు, వినమ్రంగా శ్రద్ధాంజలి ఘటిస్తోంది.

– ఎన్.జి.రంగా

**'జాగృతి' 21.8.1972**

# కీలక

'గోమతి'ని చూశారా? 'వారధి'ని గమనించారా?

'హరివిల్లు' మీ ఇంట్లో ఉందా? 'భావబంధం' తెలుసా మీకు?

'ధర్మం నిలిచింది' గుర్తుందా? 'మనస్వి' గుర్తొస్తోందా?

'నైజగుణం' నచ్చిందా? 'తీరని కోరిక' అర్థమైందా మీ అందరికీ?

'విలువలు'ను మరోసారి చూడాలనుందా? 'వారసత్వం' బాగుంటుంది కదూ? ఇవన్నీ పుస్తకాల పేర్లు. కొన్ని కథలు, ఇంకొన్ని నవలలు.

వీటిని రాసిన విశాలాక్షిది స్వతంత్ర భావతరంగం.

ఈమె పుట్టిందీ మన స్వాతంత్ర్య దినోత్సవానే!

మరో నాలుగేళ్లకు (2029) ఆగస్టు 15న ఈ రచయిత్రికి శతజయంతి ఉత్సవ వసంతం. విజయనగరాన పుట్టిన ఆమె అమెరికా, ఇంగ్లండ్ సహా ఎన్నో విదేశాల్లో పర్యటించి వనితావాణిని వినిపించారు. నవలను అనేక భారతీయ భాషల్లోకి అనువదింపచేసుకున్న అక్షర తపస్విని ద్వివేదుల విశాలాక్షి!

ఎన్నెన్నో రాసిన ఈ సాహితీవేత్త తన పుస్తకాల హక్కులన్నింటినీ ఒక గ్రంథాలయానికి రాసి ఇచ్చేశారు. అది విశాఖ ద్వారకానగర్‌లోని పబ్లిక్ లైబ్రరీ. తదుపరి తరంమీద ఎంత ప్రభావం చూపారంటే– పరిశోధన గ్రంథాలనేకం ఆంధ్ర విశ్వకళాపరిషత్తు యువత నుంచి వెలువడ్డాయి. తిరుపతి శ్రీ వేంకటేశ్వరా విశ్వవిద్యాలయ పరిశోధకుల గ్రంథాలు ఆ జాబితాకు జతచేరాయి.

ఢిల్లీ తెలుగు అకాడమీవారి సారస్వత పురస్కారం ద్వివేదులవారికే! అవార్డుల పరంపర ఆమె సొంతం.

తొలి నవల 'వైకుంఠపాళి' అలనాడు ఒక ప్రసిద్ధ పత్రిక పెట్టిన పోటీలో ప్రథమ బహుమతి అందుకుంది.

స్వర్ణ కంకణం స్వీకరించిన ప్రతిభామూర్తి.

ఇంకా విశేషాంశం ఏమిటంటే... ఆమె తన నవలల్ని తనే నాటకాలుగా రూపొందించడం, అవి ఆకాశవాణిలో ప్రసారం కావడం. శేష జీవితం విశాఖలో గడిపారు. తన నివాసం పేరు 'సాగరిక'. సముద్రంలో అపార సంపద ఉన్నట్లే... ఈమె రచనల్లోనూ భావనారాశి. వందలాది పుస్తకాల సమీక్షకురాలు, 'సుమన' అంటే ఆమె!

గవరయ్యకి చర్మం ఎంత దళసరో – నాలుక అంత పలచన. డబ్బు ఇచ్చేటప్పుడు అది తేనె ఒకలబోస్తుంది. తిరిగి పుచ్చుకునేటప్పుడు విషం చిందిస్తుంది. – ఇలా ఉంటుంది ద్వివేదుల రచనల్లో పాత్ర చిత్రణ.

ఆ భగవంతుడు ఆమెకు కీడులో మేలు చేశాడు. తనకు మతి స్థిమితం లేకపోబట్టే, తన భర్త జీవించే ఉంటాడన్న ఆశ ఉండబట్టే, అలా ఉంది శశి. లేదంటే, ఏనాడో ఈ లోకాన్ని విడిచేది. అంతులేని నిరీక్షణ ఆమెది. లేశమాత్రమైనా విచారం లేకుండా ఉంటోందంటే జీవితాన్ని ఇలా గడిపేస్తోందంటే, ఎంత శోకాతీతం! లోకాతీతం! ఈ మాట ఆమె ముఖంలో కనిపించింది అంతటి భర్త ప్రేమ! – ఇదీ విశాలాక్షి 'స్వభావ పరిపోషణ'.

అందని మేఘాలు, అందిన మేఘాలు. రెండు రచనలూ ఆమెవే! తర్వాత వాటిని క్రోడీకరించి 'అందని'ని స్థిరీకరించారు. 'ఆకాశంలో మబ్బులు పలచనై దూదిపింజల్లా దూరం దూరంగా పరుగులు పెడుతున్నాయి. మానవ జీవితంలో ఆ మేఘాల్లాగే కన్పించి, ఊరించి, తొలగిపోయే అవకాశాలు అనంతం. వాటినన్నిటినీ ఉపయోగించుకోగలం అనుకోవటం అవివేకాన్ని మాత్రమే సూచిస్తుంది – ఇదంతా రచయిత్రి వర్ణనాసక్తి.

'అడుగున పడిన పునాది రాళ్లు' అని మరో రచన. 'విరిసీ విరియని గులాబి మొగ్గలా ముద్దుగా బొద్దుగా ఉన్న ఆ పిల్లాడిని చూస్తే, దగ్గరికి పిలిచి మాట్లాడాలని మనసైంది. 'రెండు అడుగులువేసి మెల్లగా నవ్వుతూ, 'దగ్గరికి రా' అన్నట్లు చేతులు ఊపాడు. ఆ పిల్లడు కిలకిల నవ్వుకుంటూ, తన రెండు చేతులతో ముఖం కప్పుకొని ఊరి వైపు పరుగుతీశాడు'. ఇది మొత్తం గోపన్న తాత కథానుభవం. దీన్ని రాయడంలో ఎంతో సున్నితత్వం కనబరిచారు విశాలాక్షి. తాత కడుతున్న బ్రిడ్జి, రోజు రోజుకూ పెరుగుతుంటే, చిట్టి మనసు సంతోషంతో ఉరకలేసింది. ఆ తాత లేకపోతే, ఇంకెవరూ ఆ పని చేయలేరని పిల్లవాడి నమ్మకం... అంటూ ఆకట్టుకుంటారామె.

ఇతివృత్తాన్ని ఎంచుకోవటంలో ఆమెకు ఆమే సాటి. రచనను తనదైన రీతిన మొదలుపెట్టి, ఆసక్తిగా కొనసాగించి, అనూహ్యతీరున ముగించడంలోనూ సిద్ధహస్తురాలు. కథనానికి సంబంధించి నూతన ప్రయోగాలు చేయడంలో కూడా ఎప్పుడూ ముందే ఉండేవారు.

కథ / నవల వస్తువును స్వీకరించడం, ఆవిష్కరించడంలో సైతం విభిన్న పంథా అనుసరించేవారు. సందేశం ఇస్తున్నట్లో, ఉపదేశిస్తున్నట్లో ఉండవు ఆమె రాతలు. కళ్లముందు ఉన్నవాటిని ఉన్నది ఉన్నట్లు చూపుతున్నట్లుఉండేవి.

నిశిత పరిశీలన, సూటి వ్యక్తీకరణ విశాలాక్షి ప్రధాన లక్షణాలు. సూక్ష్మ దృష్టి కనిపిస్తుందేది. విశ్లేషణ ప్రస్ఫుటమవుతూ ఉండేది. అందుకే ఆమె ఏం రాసినా, చదువరుల సమాదరణ.

'అక్క' అనే పెద్ద కథను ఎలా ఆరంభించారో చూడండి. 'ఎంతో అందంగా ఉండేది అక్క! అప్పుడే రేకులు విచ్చుకుంటున్న పువ్వులా, ఎండా వానల కలయికతో ఆకాశాన విరిసిన హరివిల్లులా, కడలి తరగల మీద వెల్లివిరిసిన వెన్నెల కాంతిలా, గులాబీ రేకుల్ని పాల మీగడతో కలిపి మర్దించి... పురిషెడు బంగారు నీటితో పదును చేసి ఆ



# భూమిక



ముద్దతో రూపుదిద్దిన బొమ్మలా!'

'అమ్మ' అనేది మరోకథ. **'ఇది నీ అమ్మ స్వార్థం అను, నలుగురు బిడ్డల భవిష్యత్తు కోసం ఒక కన్నబిడ్డ బతుకును ఎందుకూ కొరగాకుండా కాలరాచిన త్యాగం అను, ఏమన్నా సరే... నా గురించి నువ్వు ఎలా అనుకున్నా సరే... నాకు మీరంతా ఒకటే తల్లీ! మిమ్మల్ని పెంచి పెద్ద చేసేందుకే నా ఈ పోరాటం! ఆనాడు మీ నాన్నతో పోరాడాను. ఈనాడు మీతో...'** అంటూ సాగిపోతుంది సంభాషణ అంతా. ఎంత సహజత్వమో చూశారా!

కవితలు రాయడంలో ఎంత శబ్దసంపన్నమో, వ్యాసాలుగా విశదీకరించడంలోనూ అంత నిపుణత! రేడియో నాటికల తయారీలో సైతం విలక్షణత ప్రతిఫలించేది మొదటి నుంచీ. ఇంతటి బహుముఖ ప్రజ్ఞ కనబరిచినందుకే ప్రశంసలెన్నింటినో పొందారు ఆమె.

వారధి నవల గురించి ఎంతైనా చెప్పాల్సి ఉంటుంది. తెలుగు నవలా యుగంలో అదొక మెరుపు. గ్రామీణ వాతావరణ దృశ్యీకరణ ఒక ఉదాహరణ. 'దుఃఖాన్ని దిగమింగి, లాల్చీ కొసతో కళ్లు తుడుచుకుని, పొలాలవైపు చూశాడు రాజు. సెనగ చేను– పచ్చని తివాచీలాగా చుట్టూ పరచుకొని ఉంది. ఆ చేలకు వెనకగా – కొత్తగా వేసిన అంటు మామిడి తోట. లేత మామిడి మొక్కల తలల మీదుగా ఎండలో తళతళ మెరుస్తున్నాయి వంతెన స్తంభాలు.'




ఆ నవల అంతా రెండు కుటుంబాల కథ. వైవిధ్యానికి, విశిష్టతకు పెద్దపీట. రచన చేసినంత కాలమూ తనకు ఎదురైన అనుభవాలన్నింటినీ ద్వివేదుల విశాలాక్షి విపులీకరిస్తూ వచ్చారు. వాటిని చదువుతుంటే, మన మనసంతా అనిర్వచనీయత చోటు చేసుకుంటుంది.

గ్రహణం విడిచింది; ఎక్కవలసిన రైలు, జారుడు మెట్లు, కలకానిది వంటి నవలలు / నవలికల గురించీ ఎంత చెప్పుకొన్నా తరగదు! కొవ్వొత్తి, పరిహారం నవలలు విమర్శకుల ప్రశంసలకు పాత్రమయ్యాయి. ఎందరో మెచ్చుకున్నారు.

'ధర్మం నిలిచింది' కథలోని సంభాషణలు, అభివర్ణనలు, వ్యక్తీకరణలు చర్చనీయాంశాలుగా మారాయి ఆ రోజుల్లోనే! చర్చ అంటే ఆ రచనా చాతురిని గురించిన చర్చ. ప్రత్యేక సమావేశాలు నిర్వహించీ మరీ సమీక్షలు జరిపిన నిదర్శనా లున్నాయి. భాషను, యాసను ఎందరెందరో విడమరచి ప్రస్తావించారు ఆనాడు.

**'ఏదో, ఓటి సెయ్యండి బాబూ! ఎక్కడో ఒకాడ ఆ కుర్రదాన్ని బతకనీండి!'** – ఆత్రంగా అందరినీ బతిమాలుకుంది అసిరి. ఆ తర్వాత పెద్దల అనుజ్ఞ అందుకుని, అసిరి ముందుకు అడుగేసింది. ఆమె చేతిలోని పసిడి అతిదీనంగా చూస్తోంది. అమ్మను కోల్పోయిన చిన్నది. నాన్నెవరో ఎరుగని కుర్రది. అసిరి చేతిలో!

**రెప్పపడని ఆ కళ్లు విచ్చుకునే ఉన్నాయి. ధర్మనిర్ణేతల్ని తరిచి తరిచి ప్రశ్నిస్తున్నాయి. 'చెట్టుల్లారా, పుట్టల్లారా! చుట్టూ ఉన్న పెద్దల్లారా! మీలో ఎవరైనా చెప్పగలరా.... నా జనన, మరణ రహస్యాన్ని' అన్నట్లుంది.**

ఉదాహరిస్తే ఇటువంటివి మరెన్నో. ఆ అన్నీ విశాలాక్షి నిష్పాక్షికతను వెల్లడించేవే! ప్రవీణతను చాటి చెప్పేవే!

1960లలో అందునా ప్రారంభదశలో ఆమె రచించిన అనేకం పాఠకుల చేతుల్లోకి అలవోకగా ఒదిగాయి. ప్రధానంగా మహిళాచదువరుల ఆదరణను మరింతగా సంపాదించాయి. మధ్య తరగతివారి మనోమందిరాల్ని అలంకరించాయి.

ఒకటా రెండా... పదుల సంఖ్యలో పురస్కారాలు ఆమెను వరించి వచ్చాయి. విశ్వవిద్యాలయంవారు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తూ **'మీ రచనలు సాటి స్త్రీలను చేయిపట్టి ముందుకు తీసుకెళ్లాయి'** అని అభినందించారు. నిజమే. అక్షర సత్యం అది.

లలిత, జానకి, భారతి, గోమతి, శారద, మాధవి, ఇంకా ఎన్నెన్నో పాత్రలు సృష్టి చేశారు విశాలాక్షి. వాటితో ఇప్పటికీ పాఠక హృదయాల్లో తన స్థానాన్ని పదిలపరచుకున్నారు.

అంతరంగానికి అద్దం పట్టడం చేశారు కాబట్టే, ఇవాళ్టికీ ప్రాతః స్మరణీయురాలిగా నిలిచే ఉన్నారు ఆ మేటి రచయిత్రి / కవయిత్రి. ఘనత ఎంత అనేది కథల / నవలల నాయికల పాత్రలే మనందరికీ వివరిస్తాయి. ఆమె రచనా నాయిక!




**జంధ్యాల శరత్‌బాబు**
సీనియర్ జర్నలిస్ట్




# బ్రహ్మశ్రీ దండిభట్ల విశ్వనాథ జర్మనీలో ఎందుకుంది?

**'విశ్వోద్భవ శాస్త్రం' ను పరిష్కరించేవారు, విశ్లేషించేవారూ కావాలి. దానిలో ఎన్నో రహస్యాలు దాగి ఉన్నాయి. ఈ అన్వేషణ ఎవరిది? జర్మన్ నియంత అడాల్ఫ్ హిట్లర్ ఆదేశాలతో శక్తిమంతమైన ఆయుధాల అన్వేషణను ఆరంభించిన శాస్త్రవేత్తలది. ఆ సందర్భంలో వారికి దండిభట్ల విశ్వనాథ శాస్త్రి అనే గొప్ప సంస్కృత వ్యాకరణ పండితుడి గురించి తెలిసింది. ఆయన మాత్రమే ఆ శాస్త్రాన్ని సమర్ధవంతంగా పరిష్కరించగలడని వారికి సమాచారం అందింది. ఆయన రాజమహేంద్రవరం (అప్పటి మద్రాసు రాష్ట్రం)లో ఉన్నాడని తెలిసింది. దీని నేపథ్యం గొప్ప ఆసక్తికరమైనది.**

అథర్వణ వేదంలో ఒక అంశం ధనుర్వేదం. ఖగోళ ఆయుధాల జ్ఞానం (అస్త్రాలు) ఉపయోగం కూడా అందులో ప్రస్తావనకు వస్తుందని చెబుతారు. వసిష్ఠుడు ఈ శాస్త్రాన్ని వివరించాడు. దానిలో ఒక శక్తిమంతమైన ఆయుధం "పాశుపత అస్త్రం". అర్జునుడు తపస్సు ద్వారా శివుని వద్ద నుండి పాశుపతాన్ని పొందాడని చెబుతుంది మహాభారతం. పురాణాల ప్రకారం కూడా ఈ అస్త్రాన్ని మానవులకు వ్యతిరేకంగా ఉపయోగించడం నిషేధం. దీనిని ఒక్కసారి మాత్రం జయద్రదునిపై యుద్ధంలో ప్రయోగించారు.



శత్రువులకు మనోవ్యాకులాన్ని కలిగించి, భయభ్రాంతులను చేయడానికి అథర్వవేదం 8వ కాండలో, నాలుగవ అనువాకంలో గల సేనాకర్మ సూక్తం ఉపదేశిస్తున్నది. శత్రువునుద్దేశించి ఈ మంత్రాన్ని పఠిస్తూ రావి సమిధలతో హోమం చేస్తే శత్రువులు భయంతో విభ్రాంతులై నశిస్తారని అది చెబుతుంది. మంత్రం మూలం, అనువాదం చూడండి.

**మంత్రం**

***పూతిరజ్జు రువధ్మానీ పూతిం సేనాం***
***కృణోత్వమూమ్***
***ధూమ మగ్నిం పరాదృశ్యా మిత్రా***
***హృత్స్వా దధతాం భయమ్. (8:8:2)***

**అనువాదం**

ఖిలమైపోయిన దుర్గంధ పూరిత రజ్జువు ఈ సేనను దుర్గంధ కూపంగా చేయుగాక.

ఈ మంత్రాల ప్రయోగం కొన్ని నియమ నిబంధనలు ఉన్నవారే చేయగలరని ప్రతీతి. అవన్నీ అతీంద్రియ ఆయుధాలు. వాటికి సంబంధించి నిర్దిష్ట దేవతలున్నారు. ముఖ్యమైన వాటిలో బ్రహ్మాస్త్రం, నారాయణాస్త్రం, ఆగ్నేయాస్త్రం, నాగాస్త్రం, వరుణాస్త్రం అన్నిటికన్నా శక్తిమంతమైనది పాశుపతాస్త్రం.

వీటిలో బ్రహ్మాస్త్రంను అణుబాంబుతో పోల్చారు. నారాయణాస్త్రం, విస్తృత విధ్వంసం సృష్టించగల క్షిపణుల దాడిని విడుదల చేయగలదు. ఆగ్నేయాస్త్రం, అగ్నితో ముడిపడి ఉంది, వారుణాస్త్రం నీటితో ముడిపడి ఉంది. బ్రహ్మశీర్షాస్త్రం – బ్రహ్మాస్త్రం కన్నా ఎన్నోరెట్లు శక్తిమంతమైంది. ఇవి ఉదాహరణకు కొన్ని మాత్రమే ఎన్నో అస్త్రాల గురించి తెలియాల్సి ఉంది. మనకు తెలియనదల్లా లేదనే తత్వంతో కాకుండా, హిందువులో, సంస్కృతమో వెల్లడించినదల్లా అభూత కల్పనే అయి ఉంటుందన్న దృక్పథంతో కాకుండా జ్ఞానతృష్ణతో ఇలాంటి అధ్యయనం చేయాలి. మన పురాణాలు ప్రస్తావించిన కొన్ని అంశాల పట్ల ప్రపంచంలో చాలామంది శాస్త్రవేత్తలు ఆసక్తి చూపారు. రుజువుల కోసం అన్వేషించినవారూ ఉన్నారు. 1933లో జేమ్స్ హిల్టన్ 'లాస్ట్ హొరైజన్' అనే పుస్తకంలో "శంభల నగరం" గురించి ప్రస్తావించాడు. కల్కి పుట్టబోయే నగరం ఇదేనని నమ్ముతున్నారు. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో తీవ్ర వివాదం రేపిన శంభల లేదా సంభాల్ ఇదే. బౌద్ధంలోని కాలచక్ర సిద్ధాంతం ప్రకారం శంభల లేదా సంభాల్ టిబెట్టులో ఉంది. అది మానవులకు అంతుచిక్కని ప్రదేశంలో హిమాలయాల్లో ఉంది. ఈ శంభల గురించి కూడా అనేక కథనాలు వినికిడిలో ఉన్నాయి.

అలెగ్జాండర్ డేవిడ్ నీల్ అనే శాస్త్రవేత్త టిబెట్‌లో చాలా సంవత్సరాలు శంభల అన్వేషణలోనే ఉన్నాడు. నీల్ ఏమంటాడు? అఫ్ఘానిస్తాన్‌కు ఉత్తరంగా ఓ నగరం ఉంది అది ప్రపంచంలోని నగరాలన్నిటికి తల్లి వంటిది. అది ముస్లిమ్ దండయాత్రల కారణంగా పతనమైపోయింది. ప్రస్తుతం అఫ్ఘాన్ జానపద కథల్లో మాత్రమే మిగిలి ఉందని వాపోయాడు.

ఎడ్విన్ బెర్న్‌బామ్ అనే మరొక అన్వేషకుని లెక్క ప్రకారం శంభల నగరం ఉనికి వాస్తవం. కాని అక్కడికి చేరే మార్గాలేవీ అంతు చిక్కటం లేదు. అది ఈ భౌతిక ప్రపంచానికి దూరంగా, మానవ మృగాలకు సుదూరంగా ఉంది.

బౌద్ధ లామాలు ఏమంటున్నారంటే ఈ మానవ మృగాలు స్వార్థంతో, కుటిలత్వంతో, అసూయా ద్వేషాలతో ఒకరినొకరు చంపుకుంటారు. ప్రపంచం చాలావరకు నాశనమైపోతుంది. అప్పటికి శంభలను 32వ రాజు 'రుద్ర చక్రిన్' పరిపాలిస్తూ ఉంటాడు. అతడు మిగిలిన వారితో యుద్ధం చేసి గెలుస్తాడు. ఆ తరువాత శంభల రాజ్యం 'అగర్త' అనే పేరుతో కొత్త దేశంగా ప్రారంభమవుతుంది. ఫ్రెంచ్ రచయిత జోసెఫ్ అలెగ్జాండ్రా సెయింట్ యు.వి.స్. (1842–1910) తన గ్రంథాలలో శంభలలో ఏర్పడే ప్రభుత్వమే 'సినార్కీ' ప్రభుత్వం అని రాశాడు. ఆయన ప్రకారం ఈ సంఘటన సా॥శ॥ 3200లలో జరుగుతుంది.

ఇలాంటి అంశాల మీద విశేషమైన ఆసక్తి, గట్టి నమ్మకం ఉన్న దేశం జర్మనీ. నిజానికి మొదటి ప్రపంచ యుద్ధం సమయంలో జర్మనీ ప్రపంచంలోనే శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంలో అగ్రగణ్యంగా ఉన్న దేశం. అలాంటి దేశానికి పొరుగున ఉన్న ఆస్ట్రియాలో, ఒక జర్మన్ కుటుంబంలోనే ఏప్రిల్ 20, 1889లో

అడాల్ఫ్ హిట్లర్ జన్మించాడు. ఏప్రిల్ 30, 1945లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మధ్య కాలమంతా విశ్వం అతలాకుతలమైంది. 1933 నుండి జర్మన్ ఛాన్సలర్‌గా, 1934 నుండి మరణించే వరకు ఫ్యూరర్‌గా వ్యవహరించాడు. ఇతడి పార్టీ, నేషనల్ సోషలిస్ట్ జర్మన్ వర్కర్స్ పార్టీ (నాజీ పార్టీ). హిట్లర్ మొదటి ప్రపంచయుద్ధంలో జర్మన్ సైన్యంలో పని చేశాడు. ఆ యుద్ధంలో జర్మనీ ఓడిపోయి వెర్స యిల్స్‌లో శాంతి ఒప్పందం మీద సంతకాలు చేసింది. నవంబర్ 11,1918లో కాబట్టి వారిని 'నవంబర్ నేరగాళ్లు' అని పిలిచాడు హిట్లర్. వారినే 'జర్మనీ వెన్నుపోటుదారులు'గా ప్రకటించి 'వెన్నుపోటు' సిద్ధాంతాన్ని బలంగా ప్రచారం చేశాడు (వీరిలో ప్రధానంగా యూదులు, మార్క్సిస్టులు, పౌర నాయకులు ఉన్నారు). హిట్లర్ నరహంతకుడు. ఇతడి హింసా ప్రవృత్తికి ఒక్క యూదులే 60 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. మొదటి ప్రపంచ యుద్ధంలో తన దేశం ఓటమి అతడిని వేరే విధంగా ప్రతీకారానికి పురిగొల్పింది.

హిట్లర్ అధికారంలోకి వచ్చాక జర్మనీని శాస్త్ర, సాంకేతికంగా, పారిశ్రామికంగా ముందంజలో నిలపడానికి అనేక సంస్కరణలు ప్రారంభించాడు. రెండవ ప్రపంచ యుద్ధం ఇతడు తెచ్చాడనే అనాలి. ఆ యుద్ధానికి సన్నద్ధమవుతున్న తరుణంలోనే అతడు అనేక ఆలోచనలు చేశాడు. ప్రపంచం మొత్తం మీద గొప్ప ఆయుధాలు ఎక్కడ? అని ప్రశ్నించుకుంటే అతడికి తట్టింది భారత్ పేరే. శాస్త్రవిజ్ఞానం అభివృద్ధి కాక మునుపే అనేక అస్త్రాల పేర్లు అక్కడి పురాణా లలో కనిపిస్తాయి. కణాదుడు ప్రపంచమంతా కణమయమని అంత ప్రాచీన కాలంలోనే ప్రకటించిన కణాదుడు అక్కడి వాడే. శబ్దభేధి విద్య (శబ్దాన్ని బట్టి బాణాన్ని వదలడం), వివిధ అస్త్రాలు వాటిని మనం ఎందుకు ఉపయోగించుకో కూడదనే ఆలోచన వచ్చింది. అంటే కొత్త ప్రాణాంతక ఆయుధాల కోసం అన్వేషణ ప్రారంభమైంది. జర్మన్లు ఇప్పటికీ సంస్కృత భాషాధ్యయనంలో ఆసక్తి కలిగి ఉన్నారు. భారతీయ వేద సాహిత్యంలో ప్రాణాంతక ఆయుధాల రహస్యా లున్నాయని జర్మన్లు మొదటి నుంచి నమ్మారు. ఒకవైపు సంస్కృత భాషను తమ ప్రజలకు అర్థం అయ్యేటట్టు అనువాదం చేయిస్తున్నారు. మరోవైపు ఆ భాష చెప్పే సూత్రాలను సమగ్రంగా తెలుసుకోవడం కోసం భారతీయ భాషా శాస్త్రవేత్తల కోసం హిట్లర్‌ను సమర్థించిన శాస్త్రవేత్తలు అన్వేషణ ప్రారంభించాడు. అలాంటి సమయంలో వారికి తెలిసిన పేరే దండిభట్ల విశ్వనాథశాస్త్రి.

హిట్లర్ 20వ శతాబ్దపు చారిత్రక వ్యక్తులలో ఒకడు. అతడిని సమకాలీన ప్రపంచం ఎంత అసహ్యించుకున్నా అంతటి ఆకర్షణ కూడా ఉంది. మంచి వక్త. ప్రజలలో యూదు వ్యతిరేకతను రెచ్చగొట్టి జర్మన్‌లను ఆకట్టుకున్నాడు. పాసిస్ట్ ఇటలీ, సామ్రాజ్య వాద జపాన్ వంటి వారిని ఆకట్టుకుని జర్మనీలో నాజీ పాలన ప్రారంభించాడు. నిజానికి హిట్లర్ ప్రాచీన భారతదేశ అత్యంత ప్రముఖ చిహ్నం 'స్వస్తిక్' సొంతం చేసేసుకున్నాడు. ప్రాచీన భారత వాఙ్మయం వేదాలు, పురాణాలలోని ఆయుధాల తయారీ, వాడకం ఆయనకు నచ్చిన విషయాలు. జర్మన్‌లు 'స్వచ్ఛమైన ఆర్యజాతి' అని ప్రకటించాడు.

హిట్లర్‌కు కూడా పురాతన భారతీయ గ్రంథాలపై ఆసక్తి మెండు. వానిలో మానవజాతికి చెందిన అపార శక్తి, జ్ఞానం దాగి ఉన్నాయని నమ్మాడు. భారతీయ పండితులతో స్నేహం చేసి ఆ జ్ఞానాన్ని తన సొంత చేసుకోవాలనుకున్నాడు. ఆ సందర్భంలోనే దండిభట్ల విశ్వనాథశాస్త్రి గొప్పతనం తెలుసుకుని ఎలాగైనా ఆయనను కలవాలని తహతహలాడి తన గూఢచారులను భారత్‌కు పంపి, ఒప్పించి తీసుకు రమ్మని పురమాయించాడు. విశ్వనాథశాస్త్రి తర్క, వ్యాకరణ మీమాంసలను అభ్యసించి మొత్తం యజుర్వేదం కర్మకాండ, అధర్వణ వేద మంత్ర ప్రయోగ భాగ (అనువర్తన భాగం) మూలాలలో ప్రావీణ్యం సంపాదించాడు. 1938వ సంవత్సరంలో అధర్వణంలోని సంస్కృత శ్లోకాలను డీకోడ్ చేయడానికీ, యుద్ధ క్షిపణులు నిర్మించడానికి విశ్వనాథ శాస్త్రిని హిట్లర్ అనుకూల జర్మన్ శాస్త్రవేత్తలు ఆహ్వానించారు.

విశ్వనాథశాస్త్రి శిష్యులు వేంకటేశ్వర శాస్త్రి, పి.సీతారామాంజనేయులు ఈ వివరాలను అందించ గలిగారు. ఈ ఉదంతంలో ఆసక్తి కలిగించే మరొక అంశం ఉంది. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్న రోజుల్లో పశ్చిమ జర్మనీ రాయబారికి తమ కార్యాలయంలో వేలాడుతున్న ఒక భారతీయుని ఫోటో చూపించి ఇతని పేరు చెప్పమని అడిగారట. రాయబారి తనకు తెలియదని చెప్పినప్పుడు, వారు చెప్పారట ఆయన దండిభట్ల విశ్వనాథశాస్త్రి, ఆయన సహాయంలోనే జర్మనీలో క్షిపణులు తయారు చేశారని చెప్పారు. బ్రిటిష్ ఇండియాలో ఉన్న విశ్వనాథశాస్త్రి శత్రు కూటమి నాయక దేశం జర్మనీ ఎలా వెళ్లారు?

విశ్వనాథశాస్త్రి ఎప్పుడూ శాస్త్రీయ విషయాల గురించే ఆలోచించేవాడు. ప్రాపంచిక విషయాలను

## శాస్త్రి ఫొటో



### జర్మనీలో ప్రభుత్వ కార్యాలయంలో ఆంధ్రుని చిత్రపటం

శ్రీమతి ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా వున్న కాలంలో భారతదేశం నుండి పశ్చిమ జర్మనీకి ఒకరు రాయబారిగా వెళ్ళారు. అక్కడి అధికారులు ఈ రాయబారికి తమ కార్యాలయాలను చూపుతూ అచట గల ఒక భారతీయుని చిత్రపటం చూపి ఈయన ఎవరో మీకు తెలుసా? అని అడిగారు. తనకు తెలియదని భారత రాయబారి అన్నాడు. అపుడు జర్మన్ అధికారులే ఆ ఫోటోలోని వ్యక్తి పేరు చెప్పి అతనికి తమ దేశంలో అంతటి ప్రాముఖ్యం రావడానికి కారణం గూడా చెప్పారు. ఆ వ్యక్తి పేరు దండిభట్ల విశ్వనాథశాస్త్రి. రాజమండ్రి వాస్తవ్యులు. సంస్కృత మహాపండితులు. యజుర్వేదానికి కర్మకాండపరంగా, తాంత్రిక విద్యాపరంగా, ఆధ్యాత్మికంగా, వైజ్ఞానికంగా నాలుగు విధాలుగా అర్థం చెప్పగలిగిన మేధావి. 1938లో జర్మన్ గూఢచారులు ఇండియా వచ్చి ఆయనను జర్మనీకి గొనిపోయారు. వేద శాస్త్రములలో గల వైజ్ఞానిక విషయాలను వీరి నుండి జర్మన్ శాస్త్రవేత్తలు గ్రహించి యుద్ధకాలంలో ఆయుధ నిర్మాణానికి వాటిని వినియోగించుకున్నారు. వీరి ఎడల కృతజ్ఞతా సూచకంగా వీరి చిత్రపటాన్ని తమ విదేశాంగ శాఖ కార్యాలయంలో పెట్టుకున్నారు.

– శ్రీ జి.పుల్లారెడ్డిగారి అభినందన సంచిక 'మధుకోశం' నుండి

పట్టించుకునేవాడు కాదు. ఒకరోజు ఆయన విశాఖపట్నం సమీపంలోని కొత్తవలస గ్రామానికి వెళ్లవలసి వచ్చింది. అక్కడికి వెళుతూ ఉండగానే హిట్లర్ గూఢచారులు ఆయనను చుట్టుముట్టి, గట్టిగా బ్రతిమాలి ఒప్పించి అక్కడ నుండి విశాఖపట్టణానికి, ఆ తరువాత కలకత్తాకు తీసుకువచ్చి అక్కడ నుండి జర్మనీకి తీసుకుపోయారట. అలా ఆయన తన శాస్త్ర పాండిత్యాన్ని జర్మనీ వారితో పంచుకున్నాడు. ఆయన ఏకైక రచన "సిద్ధాంత కౌముది' వ్యాకరణ గ్రంథం, దీనిపై నాగేశభట్టు రాసిన చిన్న వ్యాఖ్యానం హైదరాబాద్ ఓరియంటల్ లైబ్రరీలో ఉంది. కానీ ఆయన తిరిగి మాతృభూమికి రాలేదు. చాలా సంవత్సరాలు విశ్వనాథశాస్త్రి భార్యకు జర్మన్ ప్రభుత్వం నుండి పారితోషికం వచ్చేది. కొన్నేళ్లకు రూ. 90 వంతున ఆవిడ బ్రతికి ఉన్నంత కాలం వచ్చింది.

జర్మన్‌లు ఇప్పటికి ఆయనను ఒక ప్రముఖ శాస్త్రవేత్తగా గౌరవిస్తున్నారు. నాజీలు తమ వి-8 రాకెట్, బజ్ బాంబాలు, పల్స్‌జెట్ ఇంజన్లు అభివృద్ధి చేశారని గమనించడం ఆసక్తికరంగా ఉంది. హిట్లర్, నాజీ సిబ్బంది పురాతన భారతదేశం, టిబెట్టుపై విశేషమైన ఆసక్తి కలిగి ఉన్నారు. 1930 నుండి ఈ రెండు ప్రదేశాలకు తమ శాస్త్రవేత్తలను యాత్రలకు పంపినట్లుగా తెలుస్తున్నది.

కొన్ని సంవత్సరాల క్రితం చైనీయులు టిబెట్టులోని లాసాలో కొన్ని సంస్కృత పత్రాలను కనుగొన్నారు. వాటిని అనువధించడానికి చండీఘడ్ విశ్వవిద్యాలయానికి పంపారు. ఈ పత్రాలలో ఇంటర్స్టెల్లార్ అంతరిక్ష నౌక నిర్మించడానికి కావలసిన సూచనలున్నాయి. అలాగే ప్రోఫెల్లర్ పద్ధతి 'గురుత్వాకర్షణ వ్యతిరేకత, 'లఘిమా' వ్యవస్థకు సమానమైన వ్యవస్థపై ఆధారపడి ఉందని శాస్త్రవేత్తలు చెప్పారు. ఇది మనిషి శరీర నిర్మాణంలో ఉన్న అహానికి సంబంధించి తెలియని శక్తి. అన్ని గురుత్వాకర్షణ ఆకర్షణలను ఎదుర్కోవడానికి తగినంత బలమైన అప కేంద్రశక్తి "అష్టసిద్దీస్ ప్రకారం ఈ "లఘిమా" ఒక వ్యక్తిని పైకి లేపడానికి వీలును కల్పిస్తుంది. (దీనిని హాలీవుడ్ చిత్రం యాంట్ మ్యాన్‌లో చూపించాడు). ఈ యంత్రాలను "అస్త్రాలని" పిలుస్తారు. పురాతన భారతీయులు గ్రహాంతర ప్రయాణం చేశారని తెలిపే పత్రాలు "రామాయణంలో సీతాన్వేషణ కోసం హనుమ సముద్రాన్ని దాటి లంకకు చేరుకోవడానికి ఉపయోగించాడు అనే రహస్యాన్ని కూడా వెల్లడిస్తాయని చెబుతుంది. ఈ విధంగా భారతీయ విజ్ఞాన భాండాగారంపై విదేశీయులకు గల శ్రద్ధ స్వదేశీయులకు లేకపోవడం దురదృష్టకరం.

**మూలం:**

**1.New Dawn Magazine : Mystery of Shambhala by Jason Jeffery**

**2. తెలుగు అధర్వణవేద సంహిత, విద్వాన్ విశ్వం- పేజీ-VI**

**3. మంత్ర పద పాఠ సంహితము**

**4. సత్యాగ్రహ ఇండియా ఆర్టికల్**



**డా. కాశింశెట్టి సత్యనారాయణ**

విశ్రాంత ఆచార్యుడు



# అదే గాంధీజీ

**1947-48 సంవత్సరాలలో గాంధీజీ చేసిన ఆమరణ నిరాహార దీక్షకు ప్రత్యేక స్థానం ఉంది. ఎందుకంటే అదే ఆయన ఆఖరి దీక్ష. జనవరి 18, 1948న ఆ దీక్ష ముగిసింది. ఆ నెల 30న ఆయనను నాథూరామ్ గాడ్సే కాల్చి చంపాడు. అహింసావాదంతో ఉద్యమాలు నిర్వహించిన గాంధీజీ నిరశన దీక్షను ఆయుధంగా ఉపయోగించుకున్నట్టు ఆయన జీవితం చూస్తే అర్థమవుతుంది. 1913 నుంచి 1948 మధ్య ఆయన చేసిన ముఖ్యమైన నిరాహార దీక్షలు 18 వరకు ఉన్నాయి. జనవరి 13, 1 948న ఆయన హిందూ-ముస్లిం ఘర్షణలను ఆపాలని కోరుతూ చివరిసారి నిరాహార దీక్ష చేశారు.**



ఆగస్ట్ 15, 1947- భారతదేశం నుంచి పాకిస్తాన్ విడిపోయింది. పాకిస్తాన్‌ను విభజించడమే కాదు, 565 స్వదేశీ సంస్థానాలు తమ ఇష్టం మేరకు ఇటు భారత్ లేదా అటు పాకిస్తాన్‌లో చేరవచ్చునని విభజన చట్టం అవకాశం కల్పించింది. ఇదే ఒక పెద్ద కుట్ర. పాకిస్తాన్ చీలిపోగా భారత్‌కు మిగిలిన భూభాగంలో 46 శాతం ఉన్న స్వదేశీ సంస్థానాలకు స్వేచ్ఛ కల్పించడమంటే కుట్ర కాక మరేమిటి? 1947 నాటి దేశ విభజన ప్రపంచ చరిత్రలోనే అతి పెద్ద విషాద ఘటన. అఖండ భారత్ కోసం స్వరాజ్య సమరం సాగింది. అంతేకాని, ఇప్పటి భూభాగం కోసం మాత్రమే కాదు. అందులో ఎన్ని ప్రాణాలు ఆహుతి అయ్యాయో అందరికీ తెలుసు. ఎన్ని జీవితాలు నాశనమైనాయో కూడా తెలుసు. సహాయ నిరాకరణోద్యమం, శాసనోల్లంఘన, క్విట్ ఇండియా అన్ని ఉద్యమాలలో ఎందరో రాలిపోయారు. ఇక తీవ్ర జాతీయ వాద ఉద్యమంలో ఎన్ని ప్రాణాలు పోయాయో తెలియదు. కానీ ఎర్రకోట మీద నుంచి ప్రథమ ప్రధాని చేసిన ప్రసంగంలో వీరికి నిజమైన నివాళి వినిపించలేదు. అయినా

# ఆఖరి నిరాహార దీక్ష

మనం ఆగస్ట్ 15వ తేదీని జరుపుకోవలసిందే. కానీ ఆ రోజు తలుచుకోవలసిన అంశాలలో సమరయోధుల త్యాగాలు, ఆత్మార్పణలే కాదు, పాకిస్తాన్‌కు భారతదేశం ఎంత చెల్లించిందో, అలాంటి పరిస్థితులు ఎందుకు వచ్చాయో కూడా గుర్తు చేసుకోవాలి.

భారత్–పాక్ విభజనే ఆదరాబాదరా జరిగింది. సెరిల్ రాడ్‌క్లిఫ్ అనే బ్రిటిష్ మేధావి, ఆయన ఏర్పరిచిన ఇతర సంఘాలు దేశ విభజన పని పూర్తి చేశాయి. రాడ్‌క్లిఫ్‌కు కాలంచెల్లిన భౌగోళిక పటాలు ఇచ్చారు. సరిహద్దులలోని ఒక ఇల్లు సగం పాక్‌లో, సగం భారత్‌లోకి వచ్చింది. అంత అధ్వానంగా విభజన పూర్తి చేశాడు. ఇది సరిహద్దు దగ్గర పూర్తి చేసిన కాకి లెక్క అంటే అతిశయోక్తి కాదు.



ఆ తరువాతి ఘట్టం–స్వతంత్ర భారతదేశ తొలి రోజులలో గాంధీజీ చేసిన నిరాహార దీక్ష. ఈ దీక్ష మీద రెండు వాదనలు ఉన్నాయి. వాస్తవానికి ఈ దీక్ష పాకిస్తాన్ పునర్ నిర్మాణం కోసం భారత్ ఇవ్వడానికి అంగీకరించిన రూ. 55 కోట్లు చెల్లించేటట్టు ఒత్తిడి చేయడానికి చేపట్టినది మాత్రమేనని కొందరు వాదిస్తారు. కానీ గాంధేయవాదులు దీనిని అంగీకరించరు. మత సామరస్యం కోసమే గాంధీజీ దీక్ష పూనారని వారి వాదన. ఆ ముందురోజు, అంటే జనవరి 12 సాయంత్రం ప్రార్థన సమయంలో కూడా గాంధీజీ పాకిస్తాన్‌కు ఇవ్వవలసిన డబ్బు గురించి ప్రస్తావించలేదట. కానీ కశ్మీర్ మీద దాడి నేపథ్యంలో స్వతంత్ర భారత ప్రభుత్వం పాకిస్తాన్‌కు ఇవ్వవలసిన కొంత సొమ్మును నిలిపివేసిన మాట నిజం. విభజన ఒప్పందం మేరకు పాకిస్తాన్‌కు ఇస్తామన్న ధనాన్ని భారత్ ఆపిన సంగతి సాక్షాత్తు లార్డ్ మౌంట్‌బాటన్ గాంధీజీకి తెలియచేశారు. భారత ప్రభుత్వ నిర్ణయం ఆయనకు నచ్చలేదు. ముందు అనుకున్న ఒడంబడిక మేరకు చెల్లింపులు జరగడం నైతిక బాధ్యత అని భావించారు. పాకిస్తాన్‌కు ఇస్తామని చెప్పిన రూ.55 కోట్లు చెల్లిస్తామని భారత ప్రభుత్వం ప్రకటించగానే జనవరి 13న ఆరంభించిన దీక్షను 18వ తేదీన విరమించారు. అన్ని నిరాహార దీక్షల మాదిరిగానే ఇది కూడా విజయవంతం అవుతుందని గాంధీజీ మొదటే నమ్మారు. దీక్షను ఆరంభించిన తరువాత మౌంట్‌బాటన్, ఎడ్వినా బాటన్ ఆయనను పరామర్శించడానికి వెళ్లారు. అప్పుడు గాంధీజీ అన్న మాట చాలా ప్రసిద్ధం. తాను దీక్షకు కూర్చుంటే కొండే మహమ్మద్ వద్దకు వస్తుందని వ్యాఖ్యానించారు. కొత్తగా ఏర్పడుతున్న దేశం కాబట్టి పునర్నిర్మాణానికి రూ. 55 కోట్లు భారత్ ఇవ్వాలని విభజన ఒడంబడికలో అంగీకరించిన మాట వాస్తవం. అది వివాదంలో పడడానికి అనేక కారణాలు ఉన్నాయి. ఇదొక్కటే ఎక్కువమందికి తెలిసినా దాయాది దేశాల మధ్య ఆస్తుల పంపకానికి సంబంధించిన ఇతర అంశాలు కూడా ఉన్నాయి. భారత్–పాక్‌లుగా విడిపోయినా రెండు దేశాలకు ఒకే కేంద్ర బ్యాంక్ (ఆర్‌బీఐ) సేవలు అందించేది. 1948 సెప్టెంబర్ వరకు పాకిస్తాన్ వ్యవహారాలు కూడా ఆర్‌బీఐ చూసింది. అయితే రూ 55 కోట్లు పాకిస్తాన్‌కు ఇచ్చే విషయంలో వివాదాలు వచ్చి ఆ ప్రభుత్వంతో ఆర్‌బీఐ సంబంధాలు చెడిపోయాయి. ఆ క్రమంలోనే రూ. 55 కోట్లు చెల్లింపు వ్యవహారం అత్యంత వివాదాస్పదంగా మారింది. విభజన జరిగిన నాటికి రిజర్వు బ్యాంకు నిధులు రూ 375 కోట్లు. చర్చల తరువాత ఆ రూ. 375 కోట్లలో రూ 75 కోట్లు పాకిస్తాన్ వాటాగా కేటాయించారు. ఆగస్ట్ 15, 1947న భారత్ నుంచి తొలిదఫాగా రూ 20 కోట్లు చెల్లించారు. అయితే రూ 55 కోట్లు వేరు. ఇవి పాకిస్తాన్ పునర్నిర్మాణం పేరుతో ఇవ్వడానికి అంగీకరించినది. కానీ తరువాత పరిణామాలు, అంటే కశ్మీర్‌పై దాడి నేపథ్యంలో, ఈ మొత్తం పాకిస్తాన్‌కు చెల్లించడానికి ఆఖరికి నెహ్రూ ఇతర కాంగ్రెస్ ప్రముఖులు కూడా వ్యతిరేకంగానే ఉన్నారు. పారిశ్రామికవేత్త ఘనశ్యామ్ బిర్లా కూడా (గాంధీజీ హత్య జరిగిన ఢిల్లీలోని బిర్లా భవన్ ఆయనదే), పాకిస్తాన్‌కు రూ 55 కోట్లు ఇస్తే అవి భారత్‌పై దాడికి అవసరమైన ఆయుధ సంపత్తికి వినియోగిస్తుందని చెప్పారని ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్ రచయితలు పేర్కొన్నారు.

కొన్ని ఆస్తుల పంపకం సజావుగానే జరిగింది. ఇంకొన్నింటి పంపకం, సిబ్బంది కేటాయింపు కూడా చిత్రంగానే జరిగింది. ఒక ఉదాహరణ: అప్పటిదాకా వైస్రాయ్ ఉపయోగించిన గుర్రపు బగ్గీ ఉంది. అది పాకిస్తాన్‌కు చెందాలా? భారత్‌కా? అన్న విషయం తేలడానికి బొమ్మ బొరుసు వేశారు. అదృష్టవశాత్తు భారత్ గెలిచింది. అంటే తనకు రావలసిన ఆస్తులలో చిల్లిగవ్వ కూడా వదలకూడదన్నదే పాకిస్తాన్ నిర్ణయంలా కనిపిస్తుంది. తరువాత అదే బగ్గీని స్వతంత్ర భారత రాష్ట్రపతి అధికార లాంఛనంగా కొద్దికాలం ఉపయోగించారు.

ఆస్తుల పంపకం కోసం విభజన సంఘం ఏర్పాటయింది. ఇందులో సర్దార్ వల్లభభాయి పటేల్, బాబూ రాజేంద్రప్రసాద్ భారత జాతీయ కాంగ్రెస్ తరఫున సభ్యులుగా నియమితులయ్యారు. ముస్లిం లీగ్ తరఫున లియాఖత్ అలీ ఖాన్, అబ్దుర్ రబ్ నిష్తార్ ప్రాతినిధ్యం వహించారు. తరువాత నిష్తార్ స్థానంలో మహమ్మద్ అలీ జిల్లా వచ్చారు. విభజన సంఘం, విభజన మండలిగా మారింది. ఈ మండలి ఆస్తుల పంపకం కోసం నిపుణుల సంఘాలను నియమించింది.

ఆస్తుల పంపకంలో 17.5 శాతం పాకిస్తాన్ కేటాయించారు. అప్పటికి భారత్ ఆస్తుల విలువ రూ. 4 బిలియన్‌లు. పాకిస్తాన్‌కు వెళ్లినది రూ. 75 కోట్లు. ఆ సంధికాలంలో పరిపాలనా సౌలభ్యం కోసం పాకిస్తాన్‌కు రూ. 20కోట్లను ఇంతలోనే కశ్మీర్ వివాదం రావడంతో భారత్ నిలిపివేసింది. 1947 అక్టోబర్ నుంచి పాకిస్తాన్ కశ్మీర్ మీదకు గిరిజనుల దాడి పేరుతో సైన్యాన్ని పంపడమే ఇందుకు కారణం. కశ్మీర్ సమస్య పరిష్కారం అయ్యే వరకు ఆ రూ. 75 కోట్లు చెల్లించడం జరగదని భారత్ ఆనాడే తేల్చి చెప్పింది. ఈ విషయం ప్రథమ హోంమంత్రి సర్దార్ పటేల్ స్వయంగా ప్రకటించారు. అందుకు పాకిస్తాన్ కూడా అప్పటికి ఏమీ గొడవ చేయకుండా అంగీకరించింది. కానీ రెండు మాసాలకే మాట మార్చి (డిసెంబర్ 22, 1947) కశ్మీర్ సమస్యకు, మొదట అనుకున్న చెల్లింపులకు ముడిపెట్టరాదని, రూ. 55 కోట్లు తక్షణమే చెల్లించాలని గగ్గోలు పెట్టింది. రూ. 55 కోట్లు చెల్లించడానికి భారత్ అంగీకరించడం లేదన్న విషయం గాంధీజీకి తెలిసింది. ఆయన ఆ సొమ్ము పాకిస్తాన్‌కు వెంటనే చెల్లించాలని నిరాహార దీక్షకు పూనుకున్నారని కొందరైనా గాఢంగా నమ్మడానికి వెనుక ఉన్న కారణం అదే. గాంధీజీ జోక్యంతో జనవరి 15, 1948న రూ 55 కోట్లు పాకిస్తాన్‌కు చెల్లించిం దన్న మాట కూడా చాలామంది నమ్ముతారు.

– జాగృతి డెస్క్

# ట్రంప్ సుంకాలను ఖాతరు చేయవద్దంటున్న అమెరికా ప్రముఖులు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎడా పెడా వడ్డిస్తున్న సుంకాలు చూస్తే ఆ దేశ ప్రజలకే రోత కలిగిస్తోంది. భారత్ మీద కక్ష కట్టినట్టు, దిగుమతుల మీద యాభయ్ శాతం వరకు సుంకాలు విధించడంతో వారికి మరీ చిర్రెత్తుతున్నది. 'నీ సుంకాల గోలతో భారత్‌తో సంబంధాలు దెబ్బతింటాయి, మనమే చిక్కుల్లో' పడతాం అని అక్కడి ప్రముఖులు హెచ్చరిస్తున్నారు. సాక్షాత్తు స్టేట్ ఉప కార్యదర్శి కర్ట్ కాంప్‌బెల్ తమ అధ్యక్షుడిని దీని గురించి గట్టిగానే హెచ్చరించాడు. 'భారతదేశమా! ఆ సుంకాలను వ్యతిరేకించు' అని కూడా పిలుపునిచ్చాడు. రష్యా నుంచి చమురును దిగుమతి చేసుకుంటున్నారన్న పేరుతో భారత్ దిగుమతులపై యాభయ్ శాతం సుంకాలు విధించడం వల్ల అమెరికాకు అతి ముఖ్యమైన భారత్‌తో సంబంధాలు చతికిలపడతాయని కాంప్‌బెల్ మొత్తుకుంటున్నాడు. కాంప్‌బెల్ ఏమన్నాడో చూడండి! '21వ శతాబ్దంలోనే అమెరికాకు అత్యంత ముఖ్య అంశం భారత్‌తో సంబంధాలు. ఇప్పుడు వాటికే ముప్పు వాటిల్లుతుంది' అని సీఎన్‌బీసీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నాడాయన. అసలు ట్రంప్ వైఖరి భారత్ ప్రధానిని ఇరకాటంలోకి నెడుతున్నదని కూడా అన్నారు. భారత ప్రధాని మోదీ ట్రంప్ ఎదుట మోకరిల్లవలసిన పనేమీ లేదని కూడా చెప్పేశారాయన. ట్రంప్‌కి కూడా ఒక హితోక్తి వినిపించారు. రష్యాతో మీ సంబంధాలను త్యాగం చేయాలని మీరు భారత్‌కు చెప్పదలిస్తే, సరిగ్గా అందుకు విరుద్ధంగా జరుగుతుందని గుర్తించాలని అన్నారు. కాంప్‌బెల్ కంటే ముందు అమెరికా కాంగ్రెస్ సభ్యుడు గ్రెగరీ మీక్స్ కూడా ఇంతకు మించిన తీవ్రతతో దేశాధ్యక్షుడిని హెచ్చరించాడు. ఇంతకాలం అమెరికా, భారత్‌ల మధ్య సంబంధాలు బలపడడానికి జరిగిన కృషి అంతా వ్యర్థమవుతుందని అన్నాడాయన. ఈ రెండు దేశాల మధ్య వ్యూహాత్మక, ఆర్థిక సంబంధాలే కాకుండా ప్రజల మధ్య కూడా మంచి బాంధవ్యం ఉందని మనం ఏ నిర్ణయం తీసుకున్నా, ఈ బంధాలను దృష్టిలో ఉంచుకుని చేయాలని, ప్రజాస్వామిక విలువలకు అనుగుణంగా ఉండాలని కాంగ్రెస్ సీనియర్ సభ్యుడు మీక్స్ ఎక్స్ వేదికగా హెచ్చరించాడు. సుంకాల వడ్డనలో ట్రంప్ ఉద్దేశం ఏమైనా, అవన్నీ ప్రతికూల ప్రభావాలను చూపుతాయని ఆ దేశ భద్రతా సలహాదారు జాన్ బోల్టన్ కూడా గట్టిగా అభిప్రాయపడుతున్నాడు. ఈ చర్య భారతదేశం రష్యా, చైనాలకు చేరువగా తీసుకుపోయేదేనని అన్నాడు. చిరకాలంగా నిర్మించుకుంటూ వచ్చిన రెండు దేశాల సంబంధాలు ప్రమాదంలో పడతాయని వ్యాఖ్యానించారు. భారత్ నుంచి అమెరికా చేరే ఉత్పత్తుల మీద ట్రంప్ రెండు దఫాలుగా (25 శాతం వంతున) 50 శాతం సుంకాలు విధించారు. రష్యా నుంచి చమురు కొనుగోలును కొనసాగిస్తున్నందుకు భారత్‌కు ఇది జరిమానా అని కూడా ట్రంప్ ఎలాంటి శషభిషలు లేకుండా చెప్పాడు.



# బ్రిటన్ విశ్వవిద్యాలయాలలో గూఢచారులుగా చైనా విద్యార్థులు

చదువు పేరుతో ఇంగ్లండ్ విశ్వవిద్యాలయాలలో చేరిన చైనా విద్యార్థులు గూఢచారులుగా వ్యవహరిస్తున్నారా? అవుననే చెబుతోంది బ్రెటీబార్ట్ లండన్ అనే చానల్. వారు చైనీస్ కమ్యూనిస్టు పార్టీ తాబేదారులుగా పని చేస్తున్నారట. ఈ మధ్య యూకే–చైనా ట్రాన్స్‌పరెన్సీ అనే సంస్థ ఒక అధ్యయనం నిర్వహించింది. ఆ నివేదికనే బ్రెటీబార్ట్ లండన్ వెల్లడించింది. విశ్వవిద్యాలయాలలో జరిగే చర్చల మీద, ప్రాంగణాలలో జరిగే ఇతర కార్యక్రమాల మీద, వారి సహాధ్యాయుల కదలికల మీద నిఘా నిర్వహించి, సమాచారం చేరవేయాలని కమ్యూనిస్టు పార్టీ నేతలు చైనా విద్యార్థుల మీద వత్తిడి తెస్తున్నారని అధ్యయనంలో వెల్లడించారు. నిజానికి ఇదంతా అక్కడ కమ్యూనిస్టు చైనా మీద వ్యతిరేక అభిప్రాయాలు రాకుండా జాగ్రత్త పడడానికేనట. హాంకాంగ్, టిబెట్, కొవిడ్ 19 విజృంభణలో జిన్‌పింగ్ పేరు వెల్లడి కావడం వంటివి చర్చలలోకి రాకుండా చూడడం కూడా విద్యార్థుల బాధ్యతగా చెబుతోంది చైనా కమ్యూనిస్టు పార్టీ. అంటే హక్కులు, వివక్ష, అణచివేత పేరుతో ఆ అంశాలను చర్చకు రాకుండా అడ్డుకుంటూ ఉండాలి. అక్కడి విశ్వవిద్యాలయాలలో ఉన్న చైనీస్ స్టూడెంట్స్ అండ్ స్కాలర్స్ అసోసియేషన్‌ల మీద యూకే–చైనా ట్రాన్స్‌పరెన్సీ ఒక కన్నేసి ఉంచింది. ఇవి చైనా కమ్యూనిస్టు పార్టీకి కొనసాగింపేనని ఒక అభిప్రాయం ఉంది. అసలు చైనా విద్యార్థులు ఎక్కడ ఉన్నా వారి మీద నిఘా సహజమని, చదువులు పూర్తి చేసి చైనా తిరిగి వెళ్లిన తరువాత వారిని తీవ్ర స్థాయిలో అధికారులు విచారిస్తారని ఆ దేశ విద్యార్థి ఒకరు యూకే –చైనా ట్రాన్స్‌పరెన్సీ సంస్థకు తెలియచేశాడు కూడా. కానీ ఇతడు పేరు వెల్లడించడానికి అంగీకరించలేదు. యూనివర్సిటీల విద్యార్థులు అక్కడి చైనా దౌత్య కార్యాలయాలతో నిరంతరం సంబంధాలు నెరపుతూనే ఉంటాని కూడా ఆ సంస్థ వెల్లడించింది. చైనా దౌత్యవేత్తలు, కమ్యూనిస్టు పార్టీ ప్రముఖులు కూడా బ్రిటన్‌లోని విద్యార్థులను కలుసుకుంటూనే ఉంటారని కూడా ఆ అధ్యయనం వెల్లడించింది. యూనివర్సిటీలలో చైనాకు సంబంధించిన ఎలాంటి విద్యా విషయక కార్యక్రమాన్ని అయినా దౌత్యవేత్తలు, కమ్యూనిస్టు నాయకులు ప్రభావితం చేస్తారని, చైనా ప్రత్యక్ష జోక్యంతో కొన్ని విశ్వవిద్యాలయాలలో చైనా అంశంతో సంబంధం ఉన్న పరిశోధన పథకాలను రద్దు చేయడం కూడా జరిగిందని యూకే–చైనా ట్రాన్స్‌పరెన్సీ వెల్లడించింది.

# పాఠ్యాంశాలుగా సైనిక ప్రముఖుల జీవితాలు



చరిత్ర పాఠ్య పుస్తకాలలో ఎన్‌సీఈఆర్‌టీ (నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రెయినింగ్) తీసుకువస్తున్న మార్పుల పరంపర కొనసాగుతూనే ఉంది. త్యాగం, సాహసం, కర్తవ్య నిర్వహణ విషయంలో ఎప్పటికీ మార్గదర్శకంగా ఉండే ముగ్గురు భారత సైనిక ప్రముఖుల జీవితాలను పాఠ్యాంశాలుగా చేర్చాలని ఈ సంవత్సరం ఆరంభంలో నిర్ణయించింది. ఆ ముగ్గురు– ఫీల్డ్ మార్షల్ శామ్ మానెక్షా, బ్రిగేడియర్ మహమ్మద్ ఉస్మాన్, మేజర్ సోమనాథ్ శర్మ. వారి జీవితాలను అధ్యయనం చేయించడం ద్వారా ధైర్య సాహసాలు, కర్తవ్య నిర్వహణ వంటి నైతిక విలువలు విద్యార్థులకు అందచేయాలన్న ఆశయంతో ఈ మార్పులు చేయాలని ఎన్‌సీఈఆర్‌టీ అనుకుంటున్నది. అలాగే ఆధునిక భారతదేశ సైనిక చరిత్ర గురించిన వాస్తవాలను తెలుసుకునే అవకాశం కూడా విద్యార్థులకు లభిస్తుంది. మానెక్షా, ఉస్మాన్ జీవితాలను గురించి ఎనిమిదో తరగతి (ఉర్దూ) విద్యార్థులకు బోధించనున్నారు. అలాగే ఎనిమిదో తరగతి ఇంగ్లిష్ పాఠ్య పుస్తకం ద్వారా సోమనాథ్ శర్మ జీవితాన్ని పరిచయం చేస్తారు. పాఠ్య పుస్తకాలలో ఈ అంశాల చేర్చడం రక్షణ మంత్రిత్వశాఖ, విద్యాశాఖ, ఎన్‌సీఈఆర్‌టీ ఉమ్మడి కృషితో జరుగుతున్నది. వీరి జీవితాలను బోధించడం ద్వారా విద్యార్థులలో దేశభక్తిని అలవరచడం కూడా సాధ్యమవుతుంది. ఈ విద్యా సంవత్సరం నుంచి ఆ ముగ్గురు స్ఫూర్తిదాయకమైన వ్యక్తుల గురించి విద్యార్థులకు బోధిస్తారని రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. స్వతంత్ర భారతదేశంలో తొలి ఫీల్డ్ మార్షల్ మానెక్షా. వ్యూహకర్తగా, నాయకునిగా ఆయన ప్రతిభ అసాధారణమైనది. దేశ రక్షణ కోసం నిరుపమాన త్యాగం చేసినవారు మహమ్మద్ ఉస్మాన్. ఆయనకు మహావీర్ చక్ర పురస్కారం కూడా దక్కింది. సోమనాథ్ శర్మ పరమవీర్ చక్ర పురస్కార గ్రహీత. ఆయన సాహసం భారతదేశానికి నిరంతరం స్ఫూర్తిని ఇస్తుంది.

# కాంగ్రెస్‌కి విడాకులు ఇచ్చేద్దాం: కేరళ సీపీఐ



కాంగ్రెస్‌తో ఇంకా కలసి నడవడానికి సీపీఐ కేరళ శాఖలో ఏకాభిప్రాయం లేదా? అసలు సీపీఎంతో కలసి ఉన్నాం సరే, ఆ కూటమిలో కమ్యూనిస్టు లక్షణాలు ఏమైనా మిగిలాయా అన్న ప్రశ్న కూడా కేరళ సీపీఐలో ఉందా? తమ పార్టీలో కులతత్వం ఉందని సీపీఐలో కొందరు గట్టిగా భావిస్తున్నారా? సీపీఎం నాయకత్వమంటే సీపీఐ నాయకత్వానికి భయమా? ఇటీవల జరిగిన తిరువనంతపురం జిల్లా సీపీఐ సమావేశంలో జరిగిన వాడీవేడీ చర్చలలో ఈ అంశాలే బహిర్గతమయ్యాయి. ఇక కాంగ్రెస్‌ను వదిలించుకుందాం అని కేరళ సీపీఐ లోనే ఒక వర్గం నాయకులు ఆ సమావేశంలో ప్రతిపాదించారు. భటిండా కాంగ్రెస్ నిర్ణయాన్ని పక్కన పెట్టి ఇక కాంగ్రెస్‌ను వీడి, సీపీఎంతో పొత్తు పెట్టుకుందామని వారు కోరారు. ఈ వర్గం నాయకుల కోరిక అలా ఉంటే, ఇంకొందరు మాత్రం అసలు కేరళలో వామపక్ష కూటమిలో కమ్యూనిస్టు విధానాలు ఏమంత సజావుగా ఉన్నాయి అని ప్రశ్నించారు. ఆ మంత్రివర్గంలో ఉన్న సీపీఐ సభ్యుడు జీఆర్ అనిల్ మీద కూడా విమర్శలు వెల్లువెత్తాయి. వామపక్ష కూటమి కమ్యూనిస్టు విధానాల ప్రకారం నడవడం లేదు కదా అన్నారు వీళ్లు. అధికారంలో లేనప్పుడు స్నేహం చేసి, అధికారం వచ్చాక సీపీఐని సీపీఎం విస్మరిస్తున్నదని కొందరు ఆవేదన వ్యక్తం చేశారు. కేరళ వామపక్ష కూటమి ప్రభుత్వంలో పౌర సరఫరాల మంత్రి అనిల్ 13 నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని కూడా ఈ సమావేశం దుయ్యబట్టింది. ప్రభుత్వం అధీనంలో ఉన్న హార్టీ క్రాప్ సంస్థ అమ్ముతున్న కూరగాయల ధరలు బహిరంగ విపణిలో ధరల కంటే ఎక్కువగా ఉండడం ఏమిటని కొందరు నిలదీశారు. కన్స్యూమర్ ఫెడ్ పేరుతో ఉన్న సంస్థకు ప్రభుత్వ నిధులు కేటాయిస్తున్నారని, పౌర సరఫరాల శాఖ మాత్రం సీపీఐకి ఇచ్చారని విమర్శించారు. ఇంతకీ కన్స్యూమర్ ఫెడ్ సంస్థ సీపీఎం మంత్రుల చేతులలో ఉంది. బహిరంగ విపణిలో తక్కువ ధరకు ఉన్నప్పటికీ కన్స్యూమర్ ఫెడ్ దగ్గర నుంచి కొనుగోలు చేయవలసిన అవసరం ఏమిటని కూడా కొందరు సీపీఐ నాయకులు నిగ్గదీశారు. నీలాంబర్ ఉప ఎన్నికలో ఓటమి నుంచి సీపీఎం పాఠాలు నేర్చుకోవాలని కూడా సీపీఐ సభ్యులు హితవు పలికారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి బినయ్ విశ్వంను కూడా చాలామంది సీపీఐ నేతలు దుమ్మెత్తి పోశారు. అసలు ఆయన ఏం మాట్లాడుతున్నాడో ఆయనకేనా అర్థమవుతున్నదా అని సందేహం వ్యక్తం చేశారు సభ్యులు. కిందిస్థాయి నాయకులు సీకే చంద్రప్పన్, వెలియం నుంచి ఆయన నేర్చుకుంటే మంచిదని బాహాటంగా విమర్శించారు. అసలు పార్టీలో కులతత్వం ఉందని కూడా కొందరు తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆఖరికి రాష్ట్ర కార్యనిర్వాహక మండలి సభ్యుడు కె. రాజన్‌ను కూడా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. సీపీఎం నాయకత్వాన్ని చూసి సీపీఐ నాయకత్వం భయపడిపోతోందంటూ గొప్ప గొప్ప దేవరహస్యాలను బయటపెట్టేశారు.

# ఓ పెళ్లి.. పాకిస్తానీల అసహనం



ఇస్లాం శాంతిని కోరుతుంది, అందరినీ సమంగా చూస్తుంది వంటి మాటలు మనం వింటూ ఉంటాం. అవి ఖురాన్‌కు మాత్రమే పరిమితమో, ఆచరణలో కూడా ఉంటాయో ప్రపంచానికంతటికీ తెలుసు. ఇప్పుడు పాకిస్తానీ గాయని ఐమా బేగ్ వివాహం ఆ దేశాన్ని పెద్ద ధర్మ సంకటంలోకి నెట్టేసినట్టే ఉంది. ఆమె తనకు నచ్చినవాడిని పెళ్లాడింది. అదే ఆ సంకటం. అబ్బే, ఆ వివాహం చట్ట విరుద్ధం అంటూ ఇప్పుడు అక్కడ గోల మొదలయింది. దీనితో పెళ్లయిందన్న ఆనందం కాస్తా ఆవిరైపోయింది. ఈమె జెయిన్ అహ్మద్ అనే దుస్తుల డిజైనర్, వ్యాపారిని పెళ్లి చేసుకుంది. ప్రపంచ ప్రఖ్యాత రస్తా సంస్థ ఇతడిదే. కానీ ఇతడు అహ్మదీ తెగకు చెందినవాడు. అహ్మదీలంటే పాకిస్తాన్‌లో ద్వితీయ శ్రేణి పౌరులకంటే దిగువన బతుకుతున్నవారు. ఇస్లాంలో వారికి చోటే లేదని ఎప్పుడో తేల్చేశారు. అహమ్మదీయ ఉద్యమం ప్రారంభించిన, 19వ శతాబ్దానికి చెందిన మీర్జా గులాం అహ్మద్ కుదురులోనివాడు ఈ అహ్మద్. ఆ పేరు వింటే పాకిస్తానీలు మరీ మండిపడతారు. అహ్మదీలు ముస్లింలు కారని 1974లోనే పాకిస్తాన్ రాజ్యాంగం ప్రకటించింది. అప్పటి నుంచి వీళ్ల మీద దాడులు సర్వ సాధారణమైనాయి. దారుణమైన వివక్ష ఉంది. ఆఖరికి వీరికి ఓటు హక్కు కూడా లేదు. వీళ్లనే ఖడానీ అంటూ అవమానకరమైన భాషలో పిలుస్తారు. ఖడానీతో జరిగిన ఈ పెళ్లికి చట్టబద్ధత లేదని మత పెద్దలు తేల్చేశారు. కానీ ఎంత మూఢత్వం రాజ్యమేలుతున్నా ఎక్కడో విజ్ఞత తళుక్కుమంటుంది. పెళ్లి వాళ్ల వ్యక్తిగతం, దీనిని రాజకీయం చేస్తారేమిటని కొందరు నెటిజన్లు నిలదీస్తున్నారు. ప్రపంచం మొత్తం మీద అహ్మదీ తెగ అత్యధికంగా నివాసం ఉండేది పాకిస్తాన్‌లోనే. అయితే వారి పట్ల ఎంత వివక్ష ఉందో ఈ ఒక్క వివాహం గురించి రేగిన దుమారం ద్వారా చెప్పవచ్చు. పాకిస్తాన్‌ను నిరంతరం వెనకేసుకొచ్చే ఉదారవాదులు, సెక్యులరిస్టులు దీనికి ఏమంటారో!

విద్య కాషాయీకరణ అంటూ ఎదురు కొట్లాటకు వస్తున్న సెక్యులరిస్టులు, ఉదారవాదులు ఈ విషయం గమనించాలి. సాక్షాత్తు బీజేపీ ప్రభుత్వం పాలిస్తున్న మధ్య ప్రదేశ్‌లో జరిగిన ఘటన ఇది. రెసెన్ జిల్లాలోని బేబీ కాన్వెంట్ స్కూల్ అనే ఒక ప్రైవేటు

# జిహాద్ జన్మ రహస్యం ఇదే అయితే...

'హిందూ ఆమీర్ ఆఫ్ ముస్లిమ్స్: ఇండిజినైజ్డ్ ఇస్లాం ఫ్రం ది ఇండియన్ ఓషన్ లిటోరల్ మలబార్' ఇది చరిత్రకారుడు అబ్బాస్ పన్నకల్ రాసిన పుస్తకం. ఉగ్రవాద ముస్లిం సంస్థలు, పాశ్చాత్య దేశాలు వర్ణిస్తున్నట్టు జిహాద్ అంటే అసలు అర్థం అది కాదని ఈ పుస్తకం చెప్పే ప్రయత్నం చేసింది. ఇస్లాం ఆధిపత్యాన్ని రుద్దడానికి జరిపే హింసాత్మక దాడే జిహాద్ అంటే అని ఉగ్రవాద సంస్థలు, పాశ్చాత్య దేశాలు చెబుతాయని, కానీ దాని ఉద్దేశం కానేకాదని అంటాడు అబ్బాస్. కానీ జిహాద్ కేరళలో పుట్టిందని, ముస్లింలు, ముస్లిమేతరులు కలసి ఒక హిందూ పాలకుడిని రక్షించే ప్రయత్నం దీని ద్వారా జరిగిందని ఆయన చెబుతున్నారు. ఒక హిందువును ఆమీర్ అని గౌరవించడం ఇస్లాం ప్రకారం విరుద్ధమని, షేక్ జైనుద్దీన్ మఖ్దూమ్, ఖాజీ మహమ్మద్ వంటి ముస్లిం మత పండితులు గ్రంథాలు ఇదే చెబుతున్నాయని అన్నారు అబ్బాస్.




అలాగే ఇస్లాం గురించి కొన్ని ముస్లిం సంస్థలు ఏం చెబుతున్నాయో కూడా ఆయన చెప్పారు. ఇస్లాం పట్ల నిజమైన అనురక్తి ఉంటే ఇస్లామిక్ పాలన తేవడానికి కనీసం మానసికమైన సంసిద్ధతనైనా ఉండాలి, లేదంటే అతడు లేదా ఆమె ఇస్లాం విశ్వాసం అసంపూర్ణమని ఆ సంస్థలు చెబుతాయట. కేరళలో 16వ శతాబ్దం నాటి ముస్లిం పండితులు పోర్చుగీస్‌కు వ్యతిరేకంగా జిహాద్ ప్రకటించారని, జామరిన్ పాలకులతో ఆ పరాయి వారు యుద్ధానికి దిగినప్పుడు ఇది జరిగిందని అబ్బాస్ పేర్కొన్నారు. ఇప్పుడు జిహాద్ అంటే వర్గాల మధ్య హింసను ప్రేరేపించేదిగా వ్యాఖ్యానిస్తున్నా, ఆనాడు జిహాద్‌ను రెండు వర్గాల మధ్య సుహృద్భావానికి ఉద్దేశించారని అబ్బాస్ చెబుతున్నారు. చాలియం కోట సంఘర్షణ గురించి కవి ఖాజీ మహమ్మద్ రాసిన కవిత ఆ విషయం స్పష్టం చేస్తున్నదని అంటారాయన. చాలియం కోట పోర్చుగీస్ నిర్మించినది. కానీ అక్కడి రాజులు జామొరిన్లు. వీరు ఆ కోట మీద దాడి చేసినప్పుడు జామొరిన్‌ల కోసమే (హిందూరాజులు, జామొరిన్ అనేది వారి బిరుదు) కోసం త్యాగం చేయాలని ముస్లింలు ప్రతిన పూనారట. కానీ హిందువులు మాత్రం, ముస్లింలు తమ వర్గం వారు చనిపోవడానికి అవకాశం ఇవ్వరాదని, అందుకు కారణం వారు




# 'ఎమ్' ఫర్ మసీదట, 'ఎన్' ఫర్ నమాజ్ అట!

పాఠశాల నిర్వాకమిది. ఇది పాఠ్య ప్రణాళికకే పంగనామాలు పెట్టింది. కొత్త సూత్రాలు ప్రవేశ పెట్టింది. దీని ప్రకారం ఎమ్ అనే ఆంగ్ల అక్ష రాన్ని గుర్తు పెట్టు కోవడానికి మసీదు అని చెబుతోంది. ఆ మేరకు చార్టులు కూడా ముద్రించుకున్నారు. ఇంతే కాదు. ఎన్ అంటే నమాజ్ అని చెబుతోంది. ఒక విద్యార్థి పుస్తకాలు తీసి చూసిన అతడి పినతండ్రి ఈ విషయాన్ని కనుగొన్నాడు. మామూలుగా అయితే ఎమ్ ఫర్ మచిలీ అని చెబుతారు. కె అంటూ కబూతర్ అని చెబుతారు. ఈ పాఠశాల కొత్త సిలబస్‌లో అక్షరాలన్నీ ఇస్లాం మతం రుద్దేందుకే ఉపయోగించు కునే ప్రయత్నం జరిగింది. దీని మీద అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆందోళన ప్రారంభిం చింది. ఈ విద్యార్థి సంఘం, విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ముందు ఆందోళనకు దిగారు. అయితే ఆ స్కూలు ప్రిన్స్‌పాల్ దీనికి ఒక పరిష్కారం చూపించాడు. అది తుని తగువులా ఉంది. ఎమ్ ఫర్ మసీదు అని చెబుతున్న తాము, ఇకపై ఎమ్ ఫర్ మందిర్ అని కూడా చెబుతాం అన్నాడు. దీనితో గొడవ ఇంకాస్త పెరిగింది. పరిస్థితిని అదుపు చేయడానికి జిల్లా విద్యాశాఖ అధికారులు, పోలీసులు రంగ ప్రవేశం చేశారు. ఇంత గొడవ జరిగాక ఆ ప్రిన్స్‌పాల్ ఏం చెప్పాడు? ఆ చార్ట్‌ని సరిగా తనిఖీ చేయకుండా తెచ్చారట. తాము పొరపాటున మదర్సాలో ఉపయోగించే ఆ చార్ట్‌ను భోపాల్‌లో కొనుక్కుని తెచ్చామని కూడా నిజం ఒప్పేసుకున్నాడు. దీని మీద దర్యాప్తు జరిపిస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రకటించారు. ఆ మధ్య ఇలాంటి తింగర వ్యవహారమే ఉత్తరప్రదేశ్‌లో కూడా బయటపడింది. అక్కడ పీడీఏ పాఠశాలలు పేరుతో సమాజ్ వాదీ పార్టీ కొన్ని పాఠశాలలు నిర్వహిస్తున్నది. అందులో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దాదాపు ఇలాంటి చార్ట్‌లే ఇచ్చారు. అందులో ఏ ఫర్ అఖిలేశ్ యాదవ్, ఎమ్ ఫర్ ములాయం సింగ్ యాదవ్ అని ఉందని గొడవ మొదలయింది. హతవిధీ!

# కేరళ స్టోరీ కొనసాగింపు

హిందూ యువతులను ఇస్లాంలోకి మార్చడానికి ఎన్ని కుట్రలు జరుగుతాయో చెప్పిన 'కేరళ స్టోరీ' సినిమాను విమర్శించిన మూర్ఖ శిఖామణులు ఈ వార్త తెలుసుకోవాలి. సోనా యల్దూస్ అనే 23 ఏళ్ల ఉపాధ్యాయ శిక్షణ విద్యార్థిని స్నేహితుడిని కేరళ పోలీసులు అరెస్టు చేశారు. కొత్తమంగళం (ఎర్నాకులం)లో ఇది జరిగింది. రామీస్ అనే



ఆ స్నేహితుడు ఇస్లాంలోకి మారాలంటూ బలవంతం చేశాడని, అందుకే తాను బలవన్మరణానికి పాల్పడుతున్నానని సోనా చనిపోతూ రాసిన ఉత్తరంలో ఆరోపించింది. పెళ్లి గురించి మాట్లాడుదామని తన ఇంటికి తీసుకువెళ్లిన రామీస్ చేయి చేసుకున్నాడని, మతం మారాల్సిందేనని అతడి ఇంట్లోవాళ్లు బలవంత పెట్టారని సోనా వివరించింది. కాబట్టి బీజేపీ ఎందుకు ఊరుకోవాలి? జిహాదీ ఉగ్రవాదం కేరళలో బాగా ముదిరిందని ఆ రాష్ట్ర బీజేపీ నేతలు ఆరోపించారు.

మైనారిటీ కావడమేనని భావించారట. దీనితో ముస్లింలు, హిందువులు కలసి రాజు కోసం పోరాడాలని ఏకమయ్యారట. అందుకోసం శాంతియుత సహజీవనం కూడా చేయాలని నిర్ణయించుకున్నారట. ఖాజీ మహమ్మద్ కవిత ఫతుల్ ముబిన్‌లో ఈ ఘట్టం వర్ణించాడు. ఈ కవిత రాసిన ఖాజీ హిందూ రాజు క్షేమం కోసం ప్రార్థించి, మిగిలిన ముస్లింలు కూడా ప్రార్థించాలని ఆదేశించాడట. అదే సమయంలో పోర్చుగీస్‌తో ఒప్పందాలు చేసుకోవడం ద్వారా వారి అకృత్యాలను సమర్థించిన భారత్‌లోని ఇతర ముస్లిం పాలకులను ఖాజీ విమర్శించాడట. ఇక్కడ అర్థం చేసుకోవలసిన విషయం జిహాద్ అనేది కేరళలో స్థానిక హిందూ రాజుకు మద్దతుగా వచ్చింది. అంతేగాని ముస్లిం పాలకుడు లేదా ముస్లింగా మారిన హిందూ పాలకుని రక్షణ కోసం కాదని కూడా అబ్బాస్ వ్యాఖ్యానించాడు. జామొరిన్ రాజ్యంలో జిహాద్ అనేది రెండు మతాల మధ్య సుహృద్భావ వాతావరణానికి ఒక పనిముట్టుగా ఉపయోగపడిందంటాడు అబ్బాస్. పోర్చుగీస్‌పై యుద్ధంలో తమకు సహకరించవలసిందిగా జామొరిన్ తల్లి కుంజలి మరక్కర్, ఉమర్ అంతాబ్ది, అబ్దుల్ అజీజ్ వంటి ముస్లిం పాలకులకు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. దీనితో వీరు ఆ విషయం గురించి చర్చించడానికి కొజికోడ్ దగ్గరలోని ఒక మసీదులో సమావేశ మయ్యారని ఈ పుస్తకం వెల్లడించింది. తుఫత్ అల్ ముజాహిదీన్ అనే పుస్తకం జైనుద్దీన్ మఖ్దూమ్ మరొక విషయం ప్రస్తావించారట. జామొరి రాజులు ముస్లింలను ఏ విధంగా అక్కున చేర్చుకున్నదీ ఈ రచన వెల్లడిస్తున్నది. ఆ రాజులు ముస్లిం కోసం ప్రత్యేక శ్మశాన వాటికలు ఇచ్చారు. మసీదులు నిర్మించుకోవడానికి, ముస్లిం మత సంస్థలు స్థాపించుకోవడానికి ఇతర ముస్లిమేతర పాలకులు కూడా ముందుకు వచ్చారట. ఆఖరికి ముస్లిం న్యాయమూర్తుల (కాజీలు)కు జీతాలు కూడా వారే ఇచ్చేవారట. ఇంతకీ అబ్బాస్‌గారు ఏం చెప్పబోతున్నారు. జిహాద్ అనేది రెండువర్గాలను కలిపి ఉంచుతుందనేగా. కానీ వాస్తవికంగా అలా లేదు. అలా ఉంటే ఎవరికీ అభ్యంతరం? జిహాద్ పేరుతో కేరళలో జరుగుతున్న మత మార్పిడులు, యువతుల అక్రమ రవాణా, వివాహాలు, భూ ఆక్రమణలు, హిందువుల ఊచకోత గురించి ఇందులో అబ్బాస్ రాశారో లేదో తెలియదు. కొద్దిగానే అయినా అబ్బాస్ రాసిన విషయాన్ని నేటి ముస్లిం సంస్థలు ఎంతవరకు ఆమోదిస్తాయో? ★

## కథ

రఘునాథం చాలా అదృష్ట వంతుడు.

ఒక్కగానొక్క కొడుకు వరుణ్.. పెద్ద డాక్టర్. అదీ అమెరికాలో! ఊళ్లో అంతా అతని గురించి గొప్పగా చెప్పుకోవడమే కాక, వీలైనప్పుడల్లా రఘునాథాన్ని పొగిడేస్తుంటారు. వాళ్లూరు ధర్మారం నుంచి అప్పటికి కనీసం ముంబాయ్ వెళ్లిన వాళ్లు కూడా లేరు. అలాంటిది ఏకంగా అమెరికా వెళ్లి చదువుకోవడమే కాక పెద్ద డాక్టరవడం, అది కూడా అక్కడే వైద్యం చేయడమంటే మాటలా?

అదే విషయం సందర్భం వచ్చినప్పుడల్లా ఊరిజనం గుర్తుచేస్తూ రఘునాథాన్ని పొగిడేస్తుంటారు.

ఆయనకీ గర్వంగానే అనిపిస్తుంటుంది. నిజంగానే తాను అదృష్టవంతుడుగా అనుకుంటూ పొంగి పోతుంటాడు. ప్రభుత్వోద్యోగిగా పనిచేసిన రఘునాథం వరుణ్‌ను హైస్కూల్ చదువుల వరకు వీధి బడిలోనే చదివించాడు. ఇంటర్మీడియట్‌ను పట్నంలో చదివిన వరుణ్, ఎంబీబీఎస్ చదువుకోసం మాత్రం పట్టుబట్టి అమెరికా వెళ్లాడు. అక్కడే ఎంఎస్ పూర్తిచేసిన ప్రముఖ వైద్యశాలలో కొంతకాలం పనిచేసి, ప్రస్తుతం సొంతంగా కార్డియాలజీ సెంటర్ నిర్వహిస్తున్నాడు.

అందరూ అనుకొంటున్నట్లు రఘునాథం అదృష్టవంతుడే! లేకుంటే.. కార్పొరేట్ కళాశాలల్లో వేలకు వేలు ఫీజులు పోసి చదివించినా, లాంగ్ టర్మ్ కోచింగ్‌లకు పంపించినా సాధించని మెడికల్ సీటును స్థానికంగా చదివి సింగిల్ అటెమ్ట్‌లో సాధించడం అదృష్టమేకదా! అప్పట్లో తన మిత్రులు చాలాసార్లు అన్న విషయమే.. ఊరివాళ్లు అప్పుడప్పుడూ గుర్తుచేస్తుంటే పొంగిపోతుంటాడు రఘునాథం.

మేడారం హైస్కూల్లో క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్‌గా పదవీ విరమణ చేసిన రఘునాథానికి విద్యార్థులతో అనుబంధం తక్కువే అయినప్పటికీ తన జీవితాన్ని తాను బాగానే చక్కదిద్దుకున్నాడు. తండ్రి ఆ ఊళ్లో ఐదొందల గజాల స్థలంలో సొంతిల్లిచ్చిపోయాడు. తన ఉద్యోగ జీవితంలో పాతింటి పక్కనే రెండంతస్తుల భవనం లేపాడు రఘునాథం. ఒక్కగానొక్క కొడుకు, అనుకూలవతియైన భార్య, ఏ బాదరబందీ లేని జీవితం.

కొడుకు అమెరికాలో సెటిలయ్యాక నలుగురి ముందూ నాలుగంగుళాల ఛాతిని పెంచి తిరుగాడు తున్న రఘునాథానికి నాలుగేళ్ల క్రితం భార్యను కోల్పోవడం తొలిదెబ్బ. జీవితంలో పెద్దగా ఆటుపోట్లు ఎదుర్కోని ఆతను భార్యలేని జీవితాన్ని కాస్త ఇబ్బందిగానే వెళ్లదీస్తున్నా.. ఇప్పటికీ తాను అదృష్టవంతుడిగానే భావిస్తాడు.

తల్లి చనిపోయినపుడు వచ్చి వెళ్లిన వరుణ్ ఇప్పటివరకూ మళ్లీ ఇటువైపు రాలేదు. పేరుమోసిన కార్డియాలజిస్టుగా బిజీ షెడ్యూల్‌తో గడిపే అతనికి జన్మభూమికి వచ్చిపోయేంత సమయం ఉండదు. అయితే.. పుట్టినూరు అని కాకున్నా తనకు పుట్టుకనిచ్చిన తండ్రి ఉన్నాడన్న విషయం ఆ కొడుక్కి బాగానే గుర్తుంది. అందుకే వారంలో రెండుసార్లు తండ్రితో వీడియోకాల్‌లో మాట్లాడుతునే ఉంటాడు.

* * *

"ఏం రఘునాథం బావా! భోజనం అయిందా..?" అన్నాడు అటుగా వచ్చిన శేఖరం.

మిట్టమధ్యాహ్నం బయట వరండాలో కూర్చొని పేపర్ చదువుతూ కునికిపాట్లు పడుతున్న రఘునాథం తేరుకొని అటువైపు చూశాడు. "నువ్వా శేఖరం.. రా.. రా.."

భుజం మీద టవల్ వేసుకొని అటుగా వెళ్తున్న శేఖరం ఆగి వరండాలోకొచ్చి కూచున్నాడు. అతను ఆ ఊరివాడే! రఘునాథానికి దూరపు బంధువు. బావమరిది వరసవుతాడు. ఏదైనా పని ఉండి అటువైపుగా వచ్చినపుడు కలుస్తూ ఉంటాడు. "వంట చేసుకున్నావా.." అన్నాడు.

"ఆ.. అయింది.." అన్నాడు. భార్య పోయాక రఘునాథానికి వంట చేసుకోవడం తప్పింది కాదు. రిటైర్ అయ్యాక ఇంటి వెనుక ఖాళీ స్థలంలో స్వయంగా కూరగాయలు పండిస్తున్నాడు. చేసే పని కూడా ఏమీ లేకపోవడంతో కూరగాయ చెట్లకు నీళ్లు పట్టడమూ, వాటి బాగోగులు చూసుకోవడమూ కాలక్షేపంగా మారింది. ఏరోజుకారోజు తాజా కూరగాయలతో స్వయంగా వంట చేసుకొని ఆరగిస్తాడు. మిగిలిన కూరగాయలను అవతలి వీధిలో ఉండే యాదమ్మ వారానికోసారి తెంపుకెళ్లి మార్కెట్‌లో అమ్మేస్తుంది. ఆయనకివ్వాల్సింది ఆయనకు ముట్టజెప్పుతుంది.

"ఈ వయసులో ఎందుకు నీకీ కష్టం. నువ్వూ మీ కొడుకుతో వెళ్లరాదూ. అంతపెద్ద డాక్టర్ కదా! నీకు ఏ అనారోగ్య సమస్య రాకుండా చూసుకుంటాడు"

"ఇప్పుడు నాకు ఏ అనారోగ్య సమస్యా లేదు కదా! అక్కడిదాకా వెళ్లడం ఎందుకు?"

"పోనీ ఇక్కడకే రప్పించుకోలేకపోయావా? ఎట్లాగూ పెళ్లి చేయాలి కదా!"

"అవుననుకో! కానీ పెళ్లి విషయంలో ఇంకా వాడేమీ చెప్పడం లేదు శేఖరం. ఎన్నిసార్లు కదిలించినా చూద్దాం.. చేద్దాం.. అంటున్నాడు"

"అదికాదు బావా! ముందు అతని స్థాయికి తగిన ఓ మంచి అమ్మాయిని చూడు. ఫోటో పంపించు. నచ్చితే డైరెక్టుగా పెండ్లి చూపులు.. ఆటెనుకే పెళ్లి. ఆళ్లతో పాటు నువ్వూ అమెరికాలో సెటిల్ కావచ్చు"

"నాకు అమెరికాలో సెటిల్ కావాలనేంత ఆశలేమీ



లేవు శేఖరం. కానీ నువ్వన్నట్లు పెళ్లి మాత్రం ఇక్కడే ఘనంగా చేయాలనుంది. అమ్మాయి విషయంలో నీకు తెల్సినవాళ్లకు చెప్పి నువ్వూ సాయం చెయ్యి"అడిగాడు రఘునాథం.

"నాకు చెప్పావుకదా.. ఇక చూస్కో.. అదేపనిలో ఉంటా. వెళ్లొస్తా బావా! ఆరోగ్యం జాగ్రత్త" అంటూ వెళ్లిపోయాడు శేఖరం.

అతను వెళ్తుంటే ఆలోచన్లో పడిపోయాడు రఘునాథం.

కొడుక్కి ముప్పై ఏళ్లు పైబడ్డాయి. ఇంకా పెళ్లి ఆలోచన చేయడం లేదు. వాళ్లమ్మ ఉన్నప్పుడు గట్టిగానే ప్రయత్నాలు చేసినా 'అప్పుడే తొందరేమిటమ్మా..' అనేవాడు. ఇపుడు వాళ్లమ్మ పోయి నాలుగేళ్లవుతుంది.

తను విషయాన్ని లేవనెత్తిన ప్రతిసారీ ఎటూ చెప్పకుండా మాటమారుస్తాడు. అసలేంటీ ఇతగాడి ఉద్దేశం? అక్కడే ఎవర్నైనా కట్టబెట్టుకోవాలని చూస్తున్నాడా? లేదు లేదు. అలాంటి ఉద్దేశమే ఉంటే చెప్పేవాడు. శేఖరం చెప్పినట్టు మనమే అమ్మాయిని చూపెట్టి లైన్లోకి లాగాలేమో..! అదీ చూద్దాం.. అనుకుంటుండగా పడక్కుర్చీలోనే సన్నగా కునుకు పట్టేసింది.

* * *

అశనిపాతంలాంటి వార్త.

వరుణ్‌కు ఏం చేయాలో పాలుపోవడం లేదు. నాన్నగారు చనిపోవడం ఏంటి?

ఏ బాదరబందీ లేకుండా సొంతూరులో హాయిగా జీవితం గడుపుతున్న ఆయన హఠాత్తుగా ప్రాణాలు కోల్పోయాడనే వార్తను జీర్ణించుకోలేక పోతున్నాడు. వార్త తెలియగానే హాస్పిటల్ వదిలి ఇంటికొచ్చి కూర్చున్నాడు వరుణ్.

ఎలా.. ఇప్పుడెలా..?

నిన్న రాత్రి బాగున్నాడు. తనతో పెళ్లి సంబంధం గురించి మాట్లాడాడు. ఒకమ్మాయి ఫోటో పంపించి తమకు దగ్గరివాళ్లు.. చేసుకోవాలంటాడు. ఇండియా వచ్చేస్తే నేరుగా పెళ్లిచూపులకు వెళ్లొచ్చంటాడు.

ఎకాఎకిన ఓ అమ్మాయి ఫోటో చూసి ఎట్లా ఓకే చేసేది? సడెన్‌గా ఇండియా వెళ్లడం కుదిరే పనేనా? అయినా నాన్నకు నచ్చినంత మాత్రాన తనకూ నచ్చాలనేముంది?

# శిథిల బంధం

## కటుకోజ్వల మనోహరాచారి



ఎప్పుడూ లేంది తను కాస్త చీరాగ్గానే చెప్పాడు. 'అసందర్భంగా విసిగించకు నాన్నా' అన్నాడు. ఎప్పుడూ లేంది నాన్న కూడా అసహనంగానే మాట్లాడాడు. 'అక్కడే ఎవర్నైనా కట్టబెట్టుకుంటావా..' అనికూడా అన్నాడు. తను మరింత అసహనానికి లోనై 'ఏదైనా మీకు చెప్పే చేస్తాలే' అంటూ విసురుగానే ఫోన్ పెట్టేశాడు తను.

నాన్న నొచ్చుకొని ఉంటాడా? ఇంతదానికే మనసుకెక్కించుకొని మధనపడ్డాడా? దాని ఫలితమేనా ఈ హార్ట్ ఎటాక్?

ఎంత దయనీయం?! కొడుకు అమెరికాలో ప్రముఖ కార్డియాలజిస్టు. తండ్రి ఇండియాలో హార్ట్ ఎటాక్‌తో మరణం. ఇంతకంటే విషాదం ఏముంటుంది?

వరుణ్ కాలుగాలిన పిల్లిలా హాల్లో అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు.

తను.. తను.. అంత కఠినంగా మాట్లాడుండాల్సింది కాదేమో! దూరాబారాన ఉన్న తండ్రిని నొప్పించి ఉండాల్సింది కాదేమో!

అతను ఉద్విగ్న స్థితిలో పచార్లు చేస్తుంటే వాట్సాప్ కాల్ రింగయింది. ఇండియా నుంచే. జానకిరాం. ఇందాక నాన్నగారు తెల్లవారుజామున చనిపోయారన్న వార్త తెల్పిన వ్యక్తి అతనే. నాన్నగారిని అప్పుడప్పుడూ కలిసి పోతుండే స్నేహితుడు. ఊళ్లోనే ఆ చివరలో



రఘునాథం ఆత్మీయ బంధుమిత్రులందరూ ఒకేసారి కట్టగట్టుకొని వచ్చినట్లు ఒక్కసారిగా హడావిడి మొదలైంది. వచ్చిన వాళ్లలో ఓ పదిమందిదాకా మహిళలు వస్తూనే గొల్లుమన్నారు. రఘునాథం పార్థివదేహం చుట్టూ చేరి తలలు బాదుకుంటూ రోదిస్తున్నారు. తమలో తాము కుమిలిపోతున్న కొంతమంది మగవారు కూడా ఇక తమాయించుకోలేమన్నట్లు భోరున విలపించారు.

ఉంటాడు. అప్పుడప్పుడూ నాన్నగారి యోగక్షేమాలు కనుక్కొని తెలియజేస్తుంటాడు.

ఫోన్ ఎత్తి "హలో అంకుల్" అన్నాడు వరుణ్. ఇండియాలో వాళ్లకు ఉదయమే అయినా ఇక్కడ చీకటిపడిన సమయం.

అట్నుండి "కాగల కార్యం గురించి ఇంకా ఏం చెప్పలేదు బాబూ!?" అన్నాడు.

"నేనే.. నేనే కాల్ చేద్దాం అనుకుంటున్నాను అంకుల్. ట్వంటీఫోర్ అవర్స్ పైగా ఫ్రిజర్వ్ చేయాల్సి ఉంటుంది బాడీని. చాలా దూరాన ఉన్నాను కదా.." అన్నాడు సిన్సియర్‌గా బాధపడుతూ.

"అంటే.. రేపు పొద్దున దాంక అన్నట్లు.. సరేలే! అట్లానే చూస్కుంటాం. ఫ్రీజర్ కూడా తెప్పిస్తున్నాం. బంధుమిత్రులందరికీ చెప్పేదా..?" అన్నాడు అట్నుండి.

"పర్లేదు అంకుల్. నేను చూసుకుంటాను. మీకు వీలైన మేరకు చెప్పండి" అంటుంటే కాల్ కట్టైంది.

వరుణ్ కుర్చీలో కూర్చొని ఒకరిద్దరికి కాల్ కలిపాడు. లిఫ్ట్ కాలేదు. అతనలాగే ఫోన్ నంబర్లు సెర్చ్ చేస్తూ ఆలోచిస్తున్నాడు.

నాన్నగారు ప్రభుత్వ ఉద్యోగి. పెన్షన్ మీద ఆధారపడి బతికారు కనుక ఆర్థికంగా ఇబ్బంది పడలేదు. ఇల్లు, పరిసరాలు ఆయనకు అనుకూలంగానే ఉన్నాయి. కాకపోతే మరీ దగ్గరి బంధువులు లేకపోవడమే కాస్త విచారించదగిన విషయం. ఆయనకు పెద్దగా మిత్రులు కూడా లేరు.

వరుణ్ తల విదిలించాడు. ఎవరున్నా లేకున్నా నాన్నగారి అంత్యక్రియలు ఘనంగా జరుగుతాయి... జరగాలి. అతను టకటకా ఫోన్లు కలపడంలో నిమగ్నమైపోయాడు.

* * *

మరునాడు సరిగ్గా పదిగంటలకు ఏర్పాట్లు ముమ్మురమయ్యాయి.

రఘునాథం ఆత్మీయ బంధుమిత్రులందరూ ఒకేసారి కట్టగట్టుకొని వచ్చినట్లు ఒక్కసారిగా హడావిడి మొదలైంది. వచ్చిన వాళ్లలో ఓ పదిమందిదాకా మహిళలు వస్తూనే గొల్లుమన్నారు. రఘునాథం పార్థివదేహం చుట్టూ చేరి తలలు బాదుకుంటూ రోదిస్తున్నారు. తమలో తాము కుమిలిపోతున్న కొంతమంది మగవారు కూడా ఇక తమాయించుకోలేమన్నట్లు భోరున విలపించారు.

స్థానికంగా అక్కడ చేరుకున్నవారికి అదనంగా సుమారు వంద మందిదాకా తోడయ్యారు. కాసేపు విలపించారు. రఘునాథం వ్యక్తిత్వం, మంచితనం గురించి తోటివారితో చర్చించుకున్నారు.

తర్వాత.. కాగల కార్యం గురించి విచారించారు. ఓసారి అక్కడి పరిస్థితులన్నీ సమీక్షించాక అంతిమయాత్రకు ఏర్పాట్లు మొదలుపెట్టారు వచ్చినవారు. ఒక నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం బృందాల వారీగా, విడివిడిగా ఎవరి పాత్ర వారు సమర్థ వంతంగా పోషిస్తున్నట్లు తమ పని చేసుకుపోతున్నారు. వాళ్లంతా రఘునాథానికి ఆత్మీయులో, అభిమానులో స్థానికులకు అర్థం కాలేదు. 'ఇంతమంది అభిమానుల్ని కూడబెట్టుకున్న రఘునాథం మాత్రం ధన్యుడేలే' అనుకున్నారు.

ఓ పది మంది దాకా పూనుకొని అరగంటలో పూలపల్లకీ లాంటి పాడె నిర్మాణం చేశారు. ఫ్రీజర్ చుట్టూ చేరి తలలు బాదుకుంటూ రోదిస్తున్న మహిళల ఆవేదన హృదయాల్ని కదిలించేలా ఉంది. వాళ్లను ఓదారుస్తూనే నెమ్మదిగా పార్థివ దేహాన్ని బయటకు తీసి కుర్చీలో కూర్చోబెట్టారు నలుగురు. స్నానాది కార్యక్రమం, అనంతరం కొత్త వస్త్రాలు చుట్టి, పెద్దగా బొట్టు పెట్టి పూలమాలలతో అలంకరించారు. రకరకాల పూలతో అలంకరించిన పాడెను మోయడానికి ఆ నలుగురు సిద్ధంగా ఉన్నారు. భుజాలు మార్చుకోవడానికి మరో నలుగురు చేరారు. స్థానిక పెద్దలతో మాట్లాడి ఓ పదిమందిదాకా అప్పటికే ఊరి శివారు శ్మశానవాటికలో దహన సంస్కారానికి ఏర్పాట్లు పూర్తిచేశారు.

అక్కడ వచ్చినవారి రోదనలు వింటుంటే మాత్రం గుండెలు తరుక్కుపోతున్నాయి. "కాకా.. నీకేం కష్టమొచ్చిందే.. ఇంత తొందరగ మాకు దూరమై పోతివీ.. అన్నిట్లా మాకు అండనుంటివి. ఇప్పుడు మాకు దిక్కెవరు కాకా.." అక్కడ కొందరు యువకుల రోదన చూసేవారి హృదయాలను కదిలించి వేస్తుంది.

స్త్రీమూర్తులైతే కంటికి మింటిగా ఏడుస్తున్నారు. "బాపూ..! బంగార మసుంటి మనిషివి. మా బతుకులు బండలపాలు చేసిపోతివా..? మమ్ముల్ని దిక్కులేని పక్షుల్ని చేస్తివే బాపూ.." వాళ్లు తల్లడిల్లుతున్న తీరు కఠిన హృదయుల కరుకు గుండెల్ని కూడా కరిగించేదిలా ఉంది.

"ఏం చేయగలం.." స్థానికులు కొందరు వాళ్లను ఆపే ప్రయత్నం చేశారు. రఘునాథానికి ఆత్మీయులు, అభిమానులూ బాగా ఎక్కువే అనుకుంటూ వాళ్లతో పాటు వీళ్లూ గొంతుకలిపి వేదన పంచుకొన్నారు. ఎవరితో పెద్దగా సత్సంబంధాలు నెరపినట్టుగా అనిపించని రఘునాథం, తెరవెనుక తనకోసం మంటికి మింటికి ఏకధాటిగా ఏడ్చే మనసున్న మనుషుల్ని మాత్రం తయారు చేసుకొన్నాడు.. అని అబ్బురపడ్డారు.

అంతిమ యాత్రకు ఏర్పాట్లు పూర్తికాగానే అందరూ ఒకరొకరుగా పాదాలవైపు వచ్చి



నమస్కరించి పక్కకు తప్పుకొంటున్నారు.

బ్యాండు మేళం, సన్నాయి వాయిద్యంవారు ఎప్పుడో వచ్చేశారు. అగ్ని సంస్కారం కోసం ఉట్టిచిప్పలో అగ్నితో సిద్ధమయ్యాడు ఓ యువకుడు. కదిలే ముందు అందరూ వచ్చినట్లేనా మనవారు.. అన్నాడు వేదనాభరిత వదనంతో చుట్టూ చూస్తూ. నలుగురు పెద్దమనుషులు ఔనన్నట్లు తలాడించారు.

రఘునాథం అంతిమయాత్ర ఆరంభమైంది. స్థానికులు, దూరపు బంధుమిత్రులు, అభిమానులతో కలిపి దాదాపు మూడొందల మంది వరకు అంతిమయాత్రలో పాల్గొన్నారు. గంటపాటు సాగిన యాత్రలో గంపలకొద్దీ పూలు, కర్పూర చందనాది సుగంధ పొడులు, రకరకాల స్ప్రేలు, చిల్లర డబ్బులతో పాటు నోట్లు కూడా వెదజల్లుతూ అత్యంత వైభవంగా రఘునాథం పార్థివదేహాన్ని ఊరేగించారు శ్మశానం వరకు.

**రఘునాథం అంతిమయాత్ర ఆరంభమైంది. స్థానికులు, దూరపు బంధుమిత్రులు, అభిమానులతో కలిపి దాదాపు మూడొందల మంది వరకు అంతిమ యాత్రలో పాల్గొన్నారు. గంటపాటు సాగిన యాత్రలో గంపలకొద్దీ పూలు, కర్పూర చందనాది సుగంధ పొడులు, రకరకాల స్ప్రేలు, చిల్లర డబ్బులతో పాటు నోట్లు కూడా వెదజల్లుతూ అత్యంత వైభవంగా రఘు నాథం పార్థివదేహాన్ని ఊరేగించారు శ్మశానం వరకు.**



ఎవరు బంధువులో, ఎవరు మిత్రులో, ఎవరూ ఎవరికీ అర్థం కానంత వైభవంగా సాగింది యాత్ర. రఘునాథం పార్థివదేహం చితిపైకి చేరింది. దాని చుట్టూ మూడుసార్లు తిరిగిన ఆ యువకుడు అగ్నిసంస్కారం చేయడానికి సిద్ధపడ్డాడు.

“ఒక్క నిమిషం ఆగు బాబూ!” అని వినిపించడంతో తలయెత్తి అటువైపు చూశాడు ఆ యువకుడు.

శేఖరం ముందుకు వచ్చాడు.

“వరుణ్ ఎక్కడ బాబూ? రాలేదా?”

అతను కొంచెం తటపటాయించి “రాలేదు. రాలేకపోయారు..” అన్నాడు చుట్టూ చూస్తూ.

“ఇంతకీ మీరెవరు బాబూ! వీళ్లంతా ఎవరు?”

అతను తమాయించుకొంటూ “మేమంతా పేయిడ్ రిలేటీవ్స్. డబ్బిస్తే అంతా మేమే చూసుకుంటాం. దాదాపు వందమంది దాకా వచ్చాం హైదరాబాద్ నుంచి. వరుణ్ గారి అభ్యర్థన మేరకు రంగంలోకి దిగాం” అన్నాడు తడుముకోకుండా.

చాలా మందికి విషయం అర్థం కాలేదు ముందు. అర్థంకాగానే ఒక్కసారిగా విస్తుబోయారంతా.

శేఖరం మరో ప్రశ్న వేశాడు. “మీ బృందానికి ఎంత చెల్లించాడు?”

అతను చెప్పాడు “ఇరవై లక్షలు!”

అందరూ నోరెళ్లబెట్టారు.

సమీప బంధుమిత్రుల మాదిరి నటించి, ఏలోటు రాకుండా అంత్యక్రియలు సజావుగా పూర్తిచేసి మరునిమిషంలో మాయమయ్యే బృందానికి ఇరవై లక్షల ప్యాకేజీ!? ఏర్పాట్లూ, పాల్గొన్న సంఖ్యను బట్టి మినీ, మెగా వంటి ప్యాకేజీలు ఉండవచ్చు!!

తల్లిదండ్రుల అంత్యక్రియల్లో పాల్గొనడం కంటే తమ మనుగడే ముఖ్యమనుకునే అపుత్రులైన వారి సౌకర్యార్థం పుట్టుకొచ్చిన దిక్కుమాలిన సంప్రదాయ మేమో! ఈ వింత సంప్రదాయాన్ని జీర్ణించుకోవడానికి అక్కడి వాళ్ల మనసులు సహకరించకపోయినా చేసేదేమిలేక అట్లాగే నివ్వెరపోయి చూస్తున్నారు.

అతనో విజిటింగ్ కార్డు అందిస్తూ “అవసరమైన వాళ్లు సంప్రదించొచ్చు.. రేటును బట్టి ఏర్పాట్లుంటాయి..'' అన్నాడు తర్వాతి కార్యానికి ఉద్యుక్తుడవుతూ.

వచ్చినవారు అట్లాగే నోరెళ్లబెట్టి చూస్తున్నారు. కాలంలో వస్తున్న మార్పులను జీర్ణించుకోనట్లుగా భారంగా నిట్టూరుస్తుంటే.. చేసేదేమీ లేక ఆ యువకుడి చేతిలో నుండి కొరివి తీసుకొన్నాడు శేఖరం.

కునారిల్లుతున్న కుటుంబ బంధాల విషయమై లోలోనే కుములుతున్నట్లుగా అనిపిస్తుంటే.. వచ్చిన స్థానికులు, బంధుమిత్రులవైపు ఓసారి నిర్వికారంగా చూసిన శేఖరం తనే తలకొరివి పెట్టేందుకు ఉద్యుక్తుడయ్యాడు.

మనసు పొరల్లో ఎగిసిపడుతున్న మంటలను మించి క్రమక్రమంగా రఘునాథం చితి మంటలు పైకెగుస్తుంటే, భారమైన గుండెల్ని బిగబట్టుకొని ఒకరొకరుగా నిష్క్రమిస్తున్నారు శ్మశానవాటిక నుంచి.



వచ్చేవారం కథ..
**మతిమరుపు మనిషి**
– శరత్ చంద్ర







# సంఘం నిర్వహించే సేవా ద్వారా ధార్మిక వారియర్స్,నేషన్ బిల్డర్స్ తయారవుతారు

**– దక్షిణ మధ్య క్షేత్ర ప్రచారక్ భరత్**

**కర్నూలు:** పత్తి వత్తిగా మారింది,అది నూనెలో తడిసి, దీపపుసెమ్మెలో నిలబడి, అగ్నిసాన్నిహిత్యంతో దీపంగా మారి వెలుగులు పంచుతోంది. మనుష్యులలోనూ పత్తి, నూనె, దీపపుసెమ్మె, అగ్నిలాంటి వ్యక్తులున్నారు. వీళ్ళంతా కలిసి సమాజానికి వెలుగులు ప్రసరింపజేయాలంటే వారందరి మధ్య సమన్వయం అవసరమని శ్రీ అచలానంద ఆశ్రమానికి చెందిన విరజానంద స్వామి ఆశీః ప్రసంగంలో అన్నారు. కర్నూలులోని కేశవ స్మృతిమండలి ఆధ్వర్యంలో మునగాలపాడులోని శ్రీ భగవాన్ బాలసాయిబాబా ప్రాంగణంలో నూతన భవన సముదాయ నిర్మాణానికి ఆగస్ట్ 11,2025న భూమిపూజ జరిగింది.

స్వామిజీ ప్రసంగిస్తూ పరాయిపాలన అనే ఎలుక చచ్చినా ఈనాటికీ దుర్వాసన పోలేదు. ఎలుక కళేబరాన్ని తొలగిస్తే తప్ప ఆ దుర్వాసన పోదని, మన సమాజం మనవైనవి మరచిపోయిందని, మన ఆచార సంప్రదాయాలను మళ్లీ ప్రచారంలోకి తెచ్చినపుడే మన దేశం ప్రపంచానికి వెలుగులనందజేయగలదని అన్నారు. సమాజంలో వెనుకబడినవారికి అవకాశం కల్పించాలని ఉద్దేశంతో ఈరోజు ఇక్కడ అంకురార్పణ జరిగింది. దానికి మనం సాక్షులమయ్యాము. ఈ కేంద్రం పరిపూర్ణంగా ఆ బాధ్యత పోషిస్తుందన్నారు.

దక్షిణ మధ్యక్షేత్ర ప్రచారక్ భరత్ మాట్లాడుతూ సంఘం సేవా కార్యక్రమాలు చేసేది, ఏదో ఒక సంస్థను నడపాలనే ఉద్దేశంతో కాదని, వ్యక్తిలో మార్పు తీసుకు రావడం కోసం నిర్వహిస్తుందని తెలిపారు. సంఘం నిర్వహించే సేవ ద్వారా ధార్మిక వారియర్స్, నేషన్ బిల్డర్స్ తయారవుతారని, ఈ సేవా కార్యక్రమాలకు ఆర్థిక సహాయంతో పాటు, కార్యకర్తలు సమయమివ్వాలన్నారు. డబ్బు అనే దానికి మనుషులమైన మనం వెలకట్టామని, భగవంతుడు సమయానికి వెల కట్టాడని, ఆ డబ్బును, సమయాన్ని మనం సమాజానికివ్వాలని, అంటే సంఘం చేసే సేవాకార్యక్రమాలకు ఆర్థిక సహాయంతో పాటు సమయాన్నీ కూడా ఇవ్వాలి అన్నారు.

అఖిలభారత సహ సేవాప్రముఖ్ సెంథిల్ ప్రసంగిస్తూ, ఆర్ఎస్ఎస్ సంస్థాపకులు డాక్టర్‌జీ 1926లోనే సేవ గురించి మార్గదర్శనం చేశారని, స్వయంసేవక్ హృదయంలో సమాజ సేవ చేయాలనే భావన ఉంటుందని అన్నారు. ప్రపంచంలో రెండే జాతులున్నాయి. 1. సమాజానికి ఇవ్వడం తెలిసిన సజ్జనులు, 2. సమాజం నుండి లబ్ధిపొందే స్వార్థపరులు. సమాజంలోని వారందరినీ మొదటిరకం వారిగా మార్చే ప్రయత్నం మనం చేయాలని సూచించారు. అందరూ సేవ చేస్తారు. సంఘం సేవచేయడంలో ఉన్నత లక్ష్యముంది. సేవ ద్వారా జీవన నిర్మాణం జరగాలని సంఘం భావిస్తుందన్నారు. ఈనాడు సేవ పొందేవారు భవిష్యత్తులో సేవ చేసేవారుగా మారాలనేది సంఘ ప్రయత్నమని చెప్పారు.

కేశవస్మృతి మండలి ద్వారా జరిగిన ఈ కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యులు, పారిశ్రామికవేత్త, టి.జి.వెంకటేశ్, శ్రీ భగవాన్ బాలసాయిబాబా సెంట్రల్ ట్రస్టీ రామారావు, క్షేత్రసేవాప్రముఖ్ ఎక్కా చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ సేవాప్రముఖ్ మనోహర్, కర్నూలు జిల్లాలో పనిచేసిన సంఘ ప్రచారకులు, పురప్రముఖులు, పాల్గొన్నారు.

భూమిపూజా కార్యక్రమం కర్నూలు విభాగ్‌సంఘచాలక్ నీలకంఠం దంపతులు, కర్నూలు జిల్లా సంఘచాలక్ ఎన్‌వీఎస్ గుప్తా దంపతులు, సంఘ జ్యేష్ఠ కార్యకర్త రఘురామయ్య దంపతుల ద్వారా జరిగింది.






భారత క్రికెట్‌లో సుసంపన్నమైన వారసత్వం కొనసాగుతోంది. తరతరానికి ప్రతిభావంతులైన ఆటగాళ్లు అందుబాటులోకి రావడంతో ప్రపంచ క్రికెట్ అత్యుత్తమ జట్లలో ఒకటిగా భారత్ తన ప్రత్యేకతను నిలబెట్టుకొంటూ వస్తోంది.

# భారత టెస్టు క్రికెట్లో నవశకం..!

ప్రపంచంలోనే అత్యధిక యువజన జనాభా కలిగిన భారత్‌లో ప్రతిభకు లోటేలేదు. దానికి క్రీడారంగం, ప్రధానంగా... క్రికెట్ సైతం ఏమాత్రం మినహాయింపు కాదు. సాంప్రదాయ టెస్టు క్రికెట్లో గత దశాబ్దకాలంగా విరాట్ కోహ్లీ, రోహిత్‌శర్మలాంటి దిగ్గజాల అండతో ప్రపంచ అత్యుత్తమ జట్టుగా నిలిచిన భారత్ తొలిసారిగా ఆ ఇద్దరూ లేకుండానే కళ్లు చెదిరే విజయాలతో వారేవ్వా అనిపించుకొంది. ఇంగ్లండ్ గడ్డపై ఆ దేశంతో ముగిసిన ఐదు మ్యాచ్‌ల యాండర్సన్- టెండుల్కర్ ట్రోఫీ సిరీస్‌ను 2-2తో డ్రాగా ముగించి సంచలనం సృష్టించింది.

**యువ కెప్టెన్ నాయకత్వంలో...**

ఇంగ్లండ్ పర్యటన ప్రారంభానికి ముందే భారత క్రికెట్ కృష్ణార్జునులు విరాట్ కోహ్లీ, రోహిత్‌శర్మ టెస్టు క్రికెట్‌కు సైతం రిటైర్మెంట్ ప్రకటించడంతో జట్టుకు నవతరం ఆటగాళ్లే దిక్కయ్యారు. జస్‌ప్రీత్ బుమ్రా, కెఎల్ రాహుల్, రవీంద్ర జడేజా లాంటి సీనియర్లు అందుబాటులో ఉన్నా, అజిత్ అగార్కర్ నాయకత్వం లోని ఎంపిక సంఘం మాత్రం భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్, వైస్ కెప్టెన్‌గా రిషభ్‌పంత్‌లను ఎంపిక చేయడంలో సాహసోపేతమైన నిర్ణయం తీసుకొంది. బుమ్రా, రాహుల్ లాంటి అనుభవం కల వారిని కాదని అంతంత మాత్రమే అనుభవం, నాయకత్వ లక్షణాలు కలిగిన వారికి బాధ్యతలు అప్పజెప్పటం పైనా విమర్శలు వెల్లువెత్తాయి. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ లాంటి హేమాహేమీల నాయకత్వంలోనే ఇంగ్లండ్ టూర్‌లో సిరీస్ విజేతగా నిలువలేని భారత్‌కు శుభ మన్ గిల్ లాంటి పసివారి నాయకత్వంలో ఘోర పరాజయం తప్పదని పలువురు ఇంగ్లండ్, భారత మాజీ క్రికెటర్లు జోస్యం చెప్పారు.

**అంచనాలు తలకిందులు.....**

భారత టెస్టుజట్టుకు రెండుకళ్లు లాంటి రోహిత్, విరాట్ లేకుండా తొలిసారిగా బరిలో నిలిచిన భారత యువజట్టు.. ప్రధాన శిక్షకుడు గౌతం గంభీర్ వ్యూహాలను తు.చ. తప్పకుండా అమలు చేసి స్వింగ్, ఫాస్ట్ బౌలింగ్‌కు అనువుగా ఉండే ఇంగ్లండ్ పచ్చికపై వికెట్ల రికార్డుల మోత మోగించింది.

కెప్టెన్ శుభ్‌మన్ గిల్ విశ్వరూపంతో బర్మింగ్ హామ్ టెస్టులో 336 పరుగుల భారీవిజయం సాధించిన భారత్ నిర్ణయాత్మక ఆఖరి (ఓవల్) టెస్టులో 6 పరుగుల అనూహ్య విజయంతో సరికొత్త చరిత్ర సృష్టించింది. తొలి ఇన్నింగ్స్‌లో వెనుకబడినా రెండో ఇన్నింగ్స్‌లో పుంజుకొని ఇంగ్లండ్‌కు గట్టి సవాలే విసిరింది. ఓపెనర్ యశస్వి జైశ్వాల్ శతకానికి నైట్ వాచ్‌మన్ ఆకాశ్ దీప్ వీరోచిత హాఫ్ సెంచరీ తోడు కావడం.. మిడిలార్డర్లో ఆల్ రౌండర్ల జోడీ రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ తమతమ బ్యాట్లకు పని చెప్పడంతో భారత్ పట్టు బిగించ గలిగింది.

యార్కర్ల కింగ్ జస్ ప్రీత్ బుమ్రా లేకుండానే.. యువపేసర్ల త్రయం మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ కృష్ణ, ఆకాశ్ దీప్ ముప్పేట దాడితో ఇంగ్లండ్‌ను చావుదెబ్బ తీశారు. మన హైదరాబాదీ బుల్లెట్ సిరాజ్ రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల ప్రదర్శనతో భారత్‌ను 6 పరుగులతో విజేతగా నిలిపాడు. బర్మింగ్ హామ్, ద ఓవల్ క్రికెట్ మైదానాలలో భారతజట్టు.. టెస్టు విజయాలు సాధించడం గత నాలుగున్నర దశాబ్దాల కాలంలో ఇదే మొదటిసారి. భారత యువజట్టు 2-2తో సిరీస్‌ను సమం చేయటం ద్వారా యాండర్సన్-టెడుల్కర్ ట్రోఫీని కైవసం చేసుకోగలిగింది.

భారతజట్టులో కొన్నేళ్లుగా రోహిత్, విరాట్‌ల నీడన ఉంటూ వచ్చిన శుభ్ మన్ టెస్టు కెప్టెన్‌గా జట్టును ముందుండి నడిపించడంలో సఫల మయ్యాడు. ఆడిన ఐదుటెస్టులు,10 ఇన్నింగ్స్‌లో ఓ ద్విశతకం, మూడు శతకాలతో 754 పరుగులు సాధించి ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచాడు.

యువఓపెనర్ యశస్వి జైశ్వాల్ 3 శతకాలు, సీనియర్ ఓపెనర్ కెఎల్ రాహుల్ 2 శతకాలు, వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్‌పంత్ ఒకే టెస్టు రెండు ఇన్నింగ్స్‌లోనూ శతకాలు బాదటం ద్వారా భారత బ్యాటింగ్‌ను కొత్తపుంతలు తొక్కించారు. జోడీ జడేజా, వాషింగ్టన్ సుందర్ చెరో శతకం సాధించడం ద్వారా తమవంతు పాత్ర నిర్వర్తించగలిగారు. భారత పేస్ బౌలింగ్ తురుపుముక్క బుమ్రా ఆడిన మూడు టెస్టుల్లో రెండుసార్లు ఐదేసి వికెట్లు సాధిస్తే.. మరో ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్ మొత్తం 5 టెస్టుల్లో 23 వికెట్లు పడగొట్టడం ద్వారా తనకుతానే సాటిగా నిలిచాడు.

ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్ పరుగుల హోరు, సెంచరీల జోరు, రికార్డుల వెల్లువలా సాగింది. టెస్టు క్రికెట్ చరిత్రలోనే రెండు జట్లు కలసి మొత్తం 10 ఇన్నింగ్స్‌లో 7187 పరుగులు సాధించడం ద్వారా రెండో అత్యుత్తమ అత్యధిక స్కోరు నమోదు చేయగలిగాయి. అంతేకాదు.. రెండుజట్లూ 14సార్లు 300కు పైగా స్కోర్లు సాధించాయి. రెండుజట్లకూ చెందిన తొమ్మిది మంది బ్యాటర్లు 400కు పైగా పరుగులు సాధించడం, మొత్తం 10 ఇన్నింగ్స్ లోనూ రెండుజట్ల ఆటగాళ్లు కలసి 50 అర్ధ శతకాలు, 21 శతకాలు సాధించడం అరుదైన రికార్డుగా మిగిలిపోతుంది. భారతజట్టు 336 పరుగుల అతిపెద్ద విజయాన్ని మాంచెస్టర్ టెస్టులోనూ..6 పరుగుల అత్యల్ప విజయాన్ని ఓవల్ టెస్టులోనూ నమోదు చేయడం ద్వారా సంచలనం సృష్టించింది.



**కృష్ణారావు చొప్పరపు**
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969



# ఉత్తరాఖండ్ ఉత్పాతం.. పర్యావరణ ప్రకోపం

**ఉత్తరాఖండ్‌లోని ధరాలీ గ్రామాన్ని ఆగస్ట్ 6వ తేదీన వరదలు తుడిచిపెట్టేసిన సంగతి దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆగస్ట్ 5న సంభవించిన క్లౌడ్‌బరస్ట్‌తో ముంచెత్తిన వర్షాలు, అదే సమయంలో ఖీర్ గంగకు వచ్చిన వరదలు కలసి ఈ ఉత్పాతాన్ని సృష్టించాయి. ఈ పరిణామం సముద్ర మట్టానికి 8600 అడుగుల ఎత్తున ఉన్న ఉత్తరాఖండ్‌లో ఊహించని ప్రాణనష్టాన్ని, ఆస్తినష్టాన్ని కలిగించింది. ధరాలీతో పాటు సుఖి, జస్పూర్, పురాలీ, ఝూలా, హర్సిల్, బాగోరీ, ఖుఖ్వా గ్రామాలు కూడా వరద తాకిడికి గురైనాయి. 30 వరకు గృహాలు, హోటళ్లు పేకమేడల్లా కుప్పకూలాయి. రోడ్లు, మౌలిక సదుపాయాలు ఛిన్నాభిన్నమైనాయి. ఆరుగురు చనిపోయారని ఇప్పటివరకు తెలిసింది.**

వరదలు, వానలు, కొండ చరియలు విరిగి పడడం వంటి ప్రకృతి ప్రకోపాల నుంచి మనలను మనం రక్షించుకోవడానికి ఇంకా మనం పూర్తి స్థాయి ప్రయత్నాలు చేయలేకపోతున్నాం. ఇందుకు అనేక కారణాలు. ఇటు నిర్లక్ష్యం, అటు ప్రకృతి నిగూఢత కారణాలే. ఉత్తరాఖండ్‌లో ఈ వైపరీత్యాల కారణంగా గడచిన పదేళ్లలో 705 మంది చనిపోయారని లెక్కలు చెబుతున్నాయి. ఈ మృతులలో 389 మంది ఆకస్మిక వరదల పాలబడినవారే.

వరదలు ప్రకృతికి కొత్తకాదు. అయినా ఎలాంటి సంకేతాలు లేకుండా ఇలా ఆకస్మికంగా వరదలు సంభవించడం, ఇంత ఉధృతంగా రావడం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. 2014లో కేదారనాథ్, 2021లో చమోలిలలో, (ఇప్పుడు ధరాలీలో) ఇలాగే ఆకస్మిక వరదలు వచ్చి చాలా ప్రాణ, ఆస్తి నష్టం జరిగింది. కొండ ప్రాంతాలలో ముఖ్యంగా ఉత్తరాఖండ్‌లో ఇలాంటి ఆకస్మిక వరదలు రావడం పరిపాటి. దీనికి మేఘాల ఉత్పతనం (క్లౌడ్ బరస్ట్)తో పాటు, ఇంకా ఇతర కారణాల సమూహం ఉందని గుర్తించారు. ఈ కారణాలన్నిటిని లోతుగా విశ్లేషించడం తక్షణావసరం. మూలకారణాన్ని కచ్చితంగా నిర్ధారించి భవిష్యత్తులో ఇలాంటి ఉపద్రవాలు సంభవించడాన్ని ముందుగానే పసిగట్టి తగు జాగ్రత్తలు తీసుకుని ప్రాణనష్టం జరుగకుండా చూసుకోవడం అవసరం. ఆ పరిశోధన, ఆ నష్టాలను నివారించడం అంత తేలికైనది కాదు. అయినా దేశంలోని సంబంధిత పరిశోధన సంస్థలు, శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు, విశ్లేషకులు ప్రత్యేక దృష్టి పెట్టి ఈ సమస్యను అధిగమించడానికి యుద్ధ ప్రాతిపదికన కృషి చేయాలి.

ముందుగా మేఘాల ఉత్పతనం–క్లౌడ్ బరస్ట్ గురించి కొంత చర్చిద్దాం. ఎత్తయిన ప్రదేశాలలో, అంటే భూమి ఉపరితలానికి 1000 మీటర్ల కంటే ఎత్తయిన ప్రదేశాలలో మేఘాలు ఎక్కువగా ఏర్పడి సాంద్రతతో ఉంటే ఆ ప్రదేశంలో వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. అతితక్కువ ప్రదేశంలో అతి ఎక్కువ వర్షపాతం నమోదు అయ్యేది ఇలాంటి ఎత్తయిన కొండ/పర్వత ప్రాంతాలలోనే. అందుకే మనం ఏదైనా పర్వత శ్రేణుల్లోకి గాని, హిమాలయ ప్రాంతంలోగాని చూస్తే పీఠభూమి ప్రాంతంలో ఎండ ఉంటే ఈ పర్వత ప్రాంతాల్లో మబ్బులతో కూడిన వర్షపాతం కనిపిస్తూ ఉంటుంది. ఎక్కడో ఎందుకు! తిరుమల కొండపై ఈ దృశ్యాలను మనం తరచుగా చూస్తుంటాం. హిమాలయ దక్షిణ ప్రాంతంలో ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్ లాంటి ప్రదేశాలలో అందుకే మేఘాల ఉత్పత్తి, ఉత్పతనం ఎక్కువగా ఉంటుంది. క్లౌడ్‌బరస్ట్ అంటే అతి తక్కువ సమయంలో, అతి తక్కువ ప్రదేశంలో అతి ఎక్కువ వర్షపాతం నమోదవడం. భారత వాతావరణ పరిశోధన శాఖ నిర్వచనం ప్రకారం సుమారు 20 నుంచి 30 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో, గంట వ్యవధిలో 100 మిల్లీ మీటర్లకు పైగా వర్షపాతం నమోదవడాన్ని కారణం క్లౌడ్ బరస్ట్ అంటారు. ఇవి ఒక్కొక్కసారి గంటకు 200 నుండి 1000 మి. మీ. వర్షపాతానికి దారి తీయచ్చునని అంచనా. పైగా క్లౌడ్ బరస్ట్ ఎప్పుడు వస్తుందో, ఎంత పరిమాణంలో వర్షం పడుతుందో ఇదమిత్థంగా అంచనా వేయలేని పరిస్థితి. అందుకే క్లౌడ్ బరస్ట్ అయిన తరువాత జరిగిన పరిణామాలు, ప్రాకృతిక విధ్వంసం జరిగిన తీరు, పరిమాణాన్ని బట్టి మనం దాని తీవ్రతను తెలుసుకుంటున్నాం. ఈలోగా జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. అందుకే ఆకస్మిక వరదలకు క్లౌడ్ బరస్ట్‌ని ముఖ్య కారణంగా పేర్కొంటున్నాం. దీనినే రూట్ కాజ్ అనవచ్చు. అయితే ఇంకా ఇతర కారణాలు కూడా పరిస్థితి తీవ్రతరమవడానికి దోహదం చేస్తున్నాయనడంలో సందేహం లేదు. అవేమిటో ఇప్పుడు గమనిద్దాం.

1. ముఖ్యంగా హిమాలయ పర్వత ప్రాంతాలలో తరచుగా ఎత్తయిన మంచుగుట్టలు, ఏటవాలు ప్రాంతాలలో ప్రకృతి సిద్ధంగా జరిగే మార్పులు ఈ క్లౌడ్ బరస్ట్ అవకాశాకులకు కొంతవరకు దోహదం చేస్తాయి. తరచుగా జరిగే ఈ మార్పులను గమనించడం గాని, జరగబోయే పరిణామాలను కచ్చితంగా అంచనా వేయడం గాని కొంచం కష్టం.

2.క్లౌడ్ బరస్ట్‌లు వర్షాకాలంలో, మరీ ముఖ్యంగా ఆగస్ట్, సెప్టెంబర్ నెలల్లో సంభవిస్తూ ఉంటాయని అంటారు. మూలిగే నక్క మీద తాటిపండు పడ్డట్టు అసలే వర్షాకాలం.ఆ వానలకు తోడు క్లౌడ్ బరస్ట్‌ల వల్ల ఆకస్మిక వరదలు అనివార్యమౌతున్నాయి. దీనివల్ల పరిస్థితులు మరింత క్లిష్టంగా మారుతున్నాయి.

3.జనావాసాల నిర్మాణం–క్లౌడ్ బరస్ట్ జరిగే ప్రదేశాలు : కొండప్రాంతాలలో నివాసానికి, వ్యవసాయానికి అనుగుణమైన చోటును చూసుకుని జనావాసాలను నిర్మించుకోవడం అనాదిగా జరుగుతున్న ప్రక్రియ. శాస్త్రీయమైన అవగాహనతో (అంటే డిజాస్టర్ మానేజ్మెంట్ స్టడీస్ సిఫారసులను అనుసరించి) పూర్వం జనావాసాలు కొండప్రాంతాలలో నిర్మించలేదు. ఇప్పుడు నిర్మిస్తున్నారు. అందుకే ఆకస్మిక వరదలు వచ్చిన సందర్భాలలో ఊళ్లు రాత్రికి రాత్రే, లేదా రాత్రి పగలు తేడా లేకుండా వరదల్లో కొట్టుకుపోతున్నాయి.

4. గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులు–



> భవిష్యత్తులో నిర్మించే ఇండ్లు, రవాణా సదుపాయాలు, కొత్త నగరాలు, పరిశ్రమలు మొదలైనవి సరస్సులకు, వరదలు వచ్చే నదులకు దూరంగా ఏర్పాటు చేయాలి. క్లౌడ్ బరస్ట్ మీద సమగ్ర శాస్త్రీయ అధ్యయనాలు ముమ్మరం చేయాలి.

వాటి పరిణామాలు : గువ్వ గూటికి పోతే నాకేంటి? ఎద్దు ఏటికి పోతే నాకేంటి అన్నట్లుగా ప్రపంచంలో ఎవరికి వారు ఒంటెత్తు పోకడలతో గ్లోబల్ వార్మింగ్‌ని పెంచుతున్నారు. దీనివల్ల నానాటికి మంచుపర్వత శ్రేణుల్లో ఉష్ణోగ్రతలు పెరిగి, మంచు కరిగి పర్వత ప్రాంతాలలో సరస్సులు, నీటి వనరులు ఆ నీటితో నిండుతున్నాయి. క్లౌడ్ బరస్ట్ లాంటి విపరీత పరిస్థితులలో ఆ నీరు పొంగి పొరలి కొండ ప్రాంతాలు తెగిపోయి, హఠాత్తుగా వరదల రూపంలో జనావాసాలను ముంచేత్తుతుండడం కూడా ఒక కారణంగా భావించవచ్చు.

5.హిమనీనదాలు (గ్లేసియర్స్) వాటి స్థితిగతులు: హిమాలయ పర్వత ప్రాంతం నుండి మంచు కరిగి ఉత్తరాఖండ్ ప్రాంతంలోకి ప్రవహించి అక్కడ గ్లేసియర్స్ గా ఏర్పడడం తెలిసిన విషయమే. ఇలాంటి అనేక వాటిల్లో గ్లేసియర్స్ దాదాపు 200 దాక ఉత్తరాఖండ్ కొండ ప్రాంతాలలో ప్రమాదాలకు కారణం కావచ్చని అంచనా. క్లౌడ్ బరస్ట్ సమయంలో లేదా ఒక పాటి వర్షం పడ్డా ఈ గ్లేసియర్స్‌లోని నీరు బయటికి ప్రవహించి 'గ్లేసియల్ లేక్ ఔట్ బరస్ట్ ఫ్లడ్స్' అంటే గ్లేసియర్స్ సరస్సుల నుంచి నీరు వరదగా ప్రవహించి ముంచెత్తడం లాంటివి సంభవించి ఆస్తి,ప్రాణ నష్టం జరుగుతున్నది. ప్రస్తుతం ఆగష్టు 5 న జరిగిన ఆకస్మిక వరదలు ఈ గ్లేసియల్ లేక్ ఔట్ బరస్ట్ ఫ్లడ్స్‌గా చెబుతున్నారు. ఎందుకంటే అప్పుడు క్లౌడ్ బరస్ట్ అయ్యేటంత వర్షపాతం నమోదు కాలేదంటున్నారు. ఏది ఏమైనప్పటికీ జరిగిన విధ్వంసం హృదయ విదారకం.

6. ప్రాకృతిక విపత్తులమీద బహుశా సమగ్ర శాస్త్రీయ పరిశోధన జరగక పోవడం: కొన్ని పరిశోధనా సంస్థలు, ఔత్సాహికులైన పరిశోధకులు, వాతావరణ విభాగం పరిశోధనలు జరుపుతున్నా ఒక నిర్దిష్టమైన, సమగ్ర విధానంలో నిర్వహించడం లేదేమోనన్న అభిప్రాయాన్ని తిరస్కరించలేం. ఎందుకంటే గత కొన్ని దశాబ్దాలుగా ఇలాంటి ఆకస్మిక వరదలు సంభవిస్తున్నప్పటికీ వాటిని అరికట్టడం లేదా ఆస్తి, ప్రాణ నష్టాన్ని నివారించచడంలో మనం ఇంకా పట్టు సాధించలేదు.

7. గ్లేసియర్స్ సమగ్ర పరిశీలన, స్థితి గతులు: పైన పేర్కొన్న ప్రమాదకరమైన గ్లేసియర్స్ స్థితిగతులను ఒక నిర్దిష్ట ప్రణాళికలో అధ్యయనం చేయకపోవడం, వాటి అంచులు/కట్టలు బలహీనమై ఉన్నాయా? అధిక నీరు చేరితే అవి తెగి ఆకస్మిక వరదలు సంభవించే అవకాశం ఉందా? వాటిని పెంచి, బలోపేతం చేసి, తెగకుండా ఉండేందుకు ఏమైనా చర్యలు అవసరమా? అనే కోణంలో సమగ్ర పరిశీలన ఆశించినంత స్థాయిలో జరగట్లేదేమో అనిపిస్తోంది.

8. అడవుల నరికివేత : నగరాభివృద్ధి, రహదారుల విస్తరణ పేరుతో చేపడుతున్న అడవుల నరికివేత వలన కూడా వర్షపు నీరు భూమిలోకి ఇంకడం తగ్గి ఆ నీరు సరస్సుల్లోకి చేరి వరదలు వచ్చే అవకాశం లేకపోలేదు.

9. బలమైన పరిశోధనలు జరుగక పోవడం: పీహెచ్‌డీ కోసం రాసే థీసిస్‌ను చూసుకుని, లేదా గ్రాంట్స్‌ను ఖర్చుపెట్టడానికి మొక్కుబడిగా చేసే పరిశోధనలుగాని, సమస్య వచ్చినపుడు మాట్లాడి కొన్ని రోజులయ్యాక ఆ విషయాన్ని వదిలేసే రాజకీయ ప్రసంగాలు కానీ ఈ సమస్యకు సమాధానం కాలేవు. అవి 'కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు'గా మిగిలి పోతాయి. అసలు సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంటున్నది.

10. ఎన్.డి.ఆర్.ఎఫ్. లాంటి సంస్థతో పాటు ఉత్తరాఖండ్‌కు ఒక ప్రత్యేక ప్రాధికారిక సంస్థ ఇలాంటి సమస్యను నిరోధించే దశలో 24 గంటలు పని చేయడానికి లేకపోవడం. ఎందుకంటే ఎన్.డి. ఆర్.ఎఫ్ ముఖ్యంగా డిజాస్టర్ అయిన తరువాత సహాయ సహకారాలు అందించడానికి పనిచేస్తుంది. డిజాస్టర్‌లను జరుగకుండా నిరోధించడానికి మరొక సమగ్ర సంస్థ అవసరం.

ఉత్తరాఖండ్ ప్రాంత భవిష్యత్తు మీద ఈ ఆకస్మిక వరదల ప్రభావాలు: ముఖ్యంగా మళ్లీ మళ్లీ వచ్చే వరదల వల్ల జరిగే ఆస్తినష్టం, ప్రాణనష్టం భరించ లేనిదిగా ఉంటుంది. ఇప్పటివరకు జరిగిన ఉపద్రవాల వల్ల కొట్టుకుపోయిన ఆస్తిని, ఇళ్లను, మౌలిక సదుపాయాలను తిరిగి నిర్మించుకోడానికి ఎంతో సమయం, ధనం కావలసి వస్తాయి. కొండ ప్రాంతాలలో ఇండ్లు, రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ, మెడికల్ వ్యవస్థ, స్కూళ్లు, కాలేజీలు, ప్రభుత్వ కార్యాలయాలు, రైల్వేస్ మొదలైన మౌలిక సదుపాయాల పునర్నిర్మించ డానికి ప్రభుత్వం చాలా వ్యయ ప్రయాసలకు గురి కావలసి వస్తుంది. కాబట్టి ఇలాంటి ఘటనలు పునరావృతం కుండా తగిన అన్ని చర్యలు తీసుకోవ డానికి ప్రభుత్వం ఒక పూర్తి సమయం, డెడికేటెడ్ డిజాస్టర్ ప్రిడిక్షన్ & నష్టాన్ని తగ్గించే సంస్థను, ఇప్పుడున్న ఎన్.డి.ఆర్.ఎఫ్ సంస్థకు అనుబంధంగా ఏర్పాటు చేసి, ఇతర సంస్థల ప్రతినిధులను ఈ రెండు సంస్థలతో అనుసంధానించి పని చేయించాలి. గ్లేసియర్స్‌నన్నిటినీ సర్వే చేసి "గ్లేసియర్స్ లేక్ ఔటబరస్ట్ ఫ్లడ్స్" రాకుండా తగిన చర్యలు తీసుకుని, గ్లేసియర్ల నుండి వచ్చే నీరు సమీప నదుల్లో కలవకుండా ఇతర మార్గాలను వీలైతే ఏర్పాటుచేసే దిశలో ఆలోచిం చాలి. భవిష్యత్తులో నిర్మించే ఇండ్లు, రవాణా సదుపాయాలు, కొత్తనగరాలు, పరిశ్రమలు మొదలైనవి సరస్సులకు, వరదలు వచ్చే నదులకు దూరంగా ఏర్పాటుచేయాలి. క్లౌడ్ బరస్ట్ మీద సమగ్ర శాస్త్రీయ అధ్యయనాలు (ముఖ్యంగా ఫాస్ట్ & ఎఫెక్టివ్ ప్రిడిక్షన్ అండ్ వార్నింగ్ టెక్నిక్స్, ఇన్స్ట్రుమెంట్స్ అభివృద్ధి చేయాలి) ముమ్మరం చేసి తరచుగా జరిగే ఈ ప్రాకృతిక విపత్తులనుంచి జరిగే ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించే దిశలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికంటే మరింతగా అవిరళ కృషి చేస్తాయని ఆశిద్దాం.

**సర్వే జనాః సుఖినోభవంతు.**



**మహావాది రామకృష్ణ**

భక్తాగ్రేసరులు

# 'సింహగిరి' కృష్ణమాచార్య



తిరుమలేశునికి అన్నమయ్యలా సింహాచలేశుడికి కృష్ణమాచార్యులు పరమభక్తుడు. కాకతీయ చక్రవర్తి రెండవ ప్రతాపరుద్రుని సమకాలికుడు. పుట్టు అంధుడైన ఆయనకు మేనమామ కూతురితో వివాహమైంది. వారి ఏకైక కుమారుడు ఏడవ యేట మరణించటంతో ఆ దుఃఖాన్ని అధిగమించే యత్నంలో ఆయన సంకీర్తన రచన, ఆలాపనలో మరింతగా నిమగ్నమయ్యారు. సింహగిరి నరహరి ఆదేశానుగ్రహాలతో 'సింహగిరి వచనాలను రాగి రేకులపై నిక్షిప్తం చేసినట్లు చరిత్ర చెబుతోంది. ప్రతి వచనం 'దేవా!' అనే సంబోధనతో మొదలై 'సింహగిరి నరహరి నమోనమో దయానిధీ' అనే మకుటంతో ముగుస్తుంది. ఆయన గణనీయమైన సంఖ్యలో వచనాలు రాసినట్లు రుజువులు ఉన్నా లభించినవి తక్కువే. ఒకసారి ఆయన స్వామి సన్నిధిలో గానం చేస్తుండగా బాలరూపంలో వచ్చిన నరహరి ఆయన తొడమీద కూర్చొని ఘంటంతో తాటాకుల మీద రాశాడని ప్రతీతి. తన్మయత్వంలో పాడుతూ ఉంటే అప్పన్న స్వామి నాట్యం చేసేవాడట.

## కథ | కోపం తగ్గే మందు



కృష్ణాపురం అనే గ్రామంలో కేశవానంద అనే స్వామీజీ ఉండేవాడు. ఓ రోజు ఆయన దగ్గరకి కేశవ అనే యువకుడు వచ్చాడు. రాగానే ఆయన కాళ్లపైన పడి 'అయ్యా! నాకు కోపం చాలా ఎక్కువ. మాటలు కటువుగా ఉంటు న్నాయి. దాంతో అందరితోనూ పోట్లాడు తున్నాను. ఇంట్లోనే కాదు, ఊర్లోనూ నన్ను అందరూ ద్వేషిస్తున్నారు. నేనేం చేయాలి?' అని అడిగాడు.

అప్పుడు స్వామీజీ 'నీ కోపం తగ్గాలంటే నువ్వు మెడలో అసలైన పులిగోరు వేసుకోవాలి. మన పక్క ఉన్న అడవిలో ఓ ముసలి పులి ఉంది. దాని దగ్గరకు వెళ్లి నేను పంపానని చెబితే అది నిన్నేమీ చేయదు. వెళ్లి తెచ్చుకో!' చెప్పాడు.

ఆ తర్వాతి ఉదయమే కేశవ అడవికెళ్లాడు. బక్కచిక్కిన ముసలి పులి దగ్గరకు వెళ్లి స్వామీజీ పేరు చెప్పాడు. దాంతో అదేమీ చేయలేదు కానీ 'నాకు వయసై పోయింది. వేటాడలేకపోతున్నాను. కాబట్టి నాకు ప్రతిరోజూ ఆహారం తెచ్చిపెడితే... గోరు ఇస్తాను!' అని చెప్పింది.

అప్పటి నుంచీ కేశవ ప్రతిరోజూ దానికి మాంసం, చేపలు తీసుకుపోవడం మొదలు పెట్టాడు. రోజంతా దానితోనే ఉండేవాడు. కళ్లు కూడా కనిపించని, పైకి కూడా లేవలేని

## పద్యం

ఎద్దుకైనగాని యేడాది తెలిపిన
మాట దెలిసి నడుచు మర్మమెరిగి
మొప్పె తెలియలేడు ముప్పదేండ్లకునైన
విశ్వదాభిరామ వినురవేమ

**భావం :** ఎద్దు(జంతువు)కు ఒక ఏడాది పాటు శిక్షణ ఇస్తే అది మన మనసెరిగి నడుచుకుంటుంది. కానీ మూర్ఖుడు ముప్పయ్యేళ్లు నేర్చినా ఏమీ తెలుసుకోలేడు.

## శ్లోకం

వేషో భాషా సదాచారః
రక్షణీయ మిదం త్రయం
అంధానుకరణ మన్యేషాం
అకీర్తికర ముచ్యతే

**భావం :** దేశీయమైన వేషం, భాష, సంప్రదాయం అనే మూడింటిని రక్షించుకుంటే దేశానికి కీర్తి ప్రతిష్ఠలు కలుగుతాయి. అందుకు విరుద్ధంగా అన్య దేశాల భాషాచారాలను గుడ్డిగా అనుకరిస్తే అపకీర్తి కలుగుతుంది.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| ఇరుళ | ఆంధ్రప్రదేశ్ |
| జైంతియా | గుజరాత్ |
| చుటియా | తమిళనాడు |
| గుర్జార్లు | అసోం |
| చెంచు | మేఘాలయా |

జవాబులు : ఇరుళ–తమిళనాడు 'జైంతియా–మేఘాలయా 'చుటియా–అసోం 'గుర్జార్లు–గుజరాత్ 'చెంచు–ఆంధ్రప్రదేశ్

నిర్వహణ : నయనశ్రీ



## శాస్త్రవేత్తలు

### నిరుపమ రాఘవన్

**త**మిళనాడుకు చెందిన శాస్త్రవేత్త. భారతీయ ఖగోళ శాస్త్ర, తొలి భౌతిక శాస్త్రవేత్తగా గుర్తింపు పొందారు. ఖగోళ శాస్త్రాన్ని పురాతత్వ శాస్త్రంతో మేళవించి, సాహిత్యం, గణిత శాస్త్రాలకు ముడిపెట్టి పలు పరిశోధనలు చేశారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో ఉపన్యసించారు. ఢిల్లీలోని నెహ్రూ ప్లానిటోరియం డైరెక్టరుగా దశాబ్ద కాలం పని చేశారు. ఢిల్లీలో "అమెచ్యూర్ అస్ట్రానమర్స్ సొసైటీ"ని స్థాపించి యువతరాన్ని ఖగోళ శాస్త్రం వైపునకు మళ్లించారు.

## జనరల్ నాలెడ్జ్

1. భారతదేశంలో అత్యధిక వర్షపాతం నమోదయ్యే ప్రాంతం ఏది?
2. పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఎప్పుడు జరుపుకుంటారు?
3. కుట్టుమిషన్‌ను కనుగొన్న శాస్త్రవేత్త

సమాధానాలు : 1. మాసిన్ రామ్ (మేఘాలయా), 2. ఏప్రిల్ 24, 3. సింగర్.



దాన్ని చూసి జాలిపడటం మొదలుపెట్టాడు. దాన్ని ప్రేమగా దగ్గరకి తీసుకునేవాడు.

ఓ రోజు పులి.. కేశవతో 'నేను చనిపోయే సమయం వచ్చింది. చనిపోయాక నా గోళ్లు తీసుకెళ్లు!' అని చెబుతూ కన్నుమూసింది. కేశవ దాని మరణాన్ని చూసి తట్టుకోలేక పోయాడు. స్వామీజీ దగ్గరకొచ్చి ఏడుస్తూ జరిగిందంతా చెప్పాడు.

'ఒక జంతువు చనిపోయిందనే ఇంతలా విలపిస్తున్నావు కదా! అదే సానుభూతి, ప్రేమను నీ చుట్టూ ఉన్న మనుషుల మీద చూపించు కేశవా...! మనసు లోపల ప్రేమ, జాలీ ఉంటే సరిపోదు. దాన్ని చూపాలి. అలా చూపడం మొదలుపెడితే నీ కోపమూ తగ్గుతుంది. నిన్ను అందరూ ప్రేమిస్తారు!' అని చెప్పాడు. అప్పటి నుంచీ కేశవ ఎదుటివాళ్ల ఇబ్బందులను పట్టించుకుంటూ సౌమ్యంగా మాట్లాడటం నేర్చుకున్నాడు. అందరి బంధువు అనిపించుకున్నాడు. ★

## మెదడుకు మేత

మేకల్ని తోలేసి తడికలకి పాలు పిండుతారు?

జవాబు : తేనెపట్టు

## మంచిమాట

గెలుపు అన్నది ప్రయాణం.. లక్ష్యం కాదు!



# వారఫలాలు

18-24 ఆగస్ట్ 2025




సింహంభట్ల సుబ్బారావు

6300674054


**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

బంధువులను కలుసుకుని ముఖ్య విషయాలు చర్చిస్తారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. అనారోగ్యం, ఔషధసేవనం. ఉద్యోగ ప్రయత్నాలకు విరామం. వ్యాపారులు పెట్టుబడుల్లో తొందరపాటు వీడాలి. ఉద్యోగులకు అదనపు పని భారం మీదపడ వచ్చు. కళాకారులకు అవకాశాలు చేజారతాయి. రచయితలు, క్రీడాకారులు కొంత అసంతృప్తి చెందుతారు. 23,24 తేదీల్లో శుభవార్తలు. వాహనయోగం. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

ఆర్థిక లావాదేవీలు క్రమేపీ మెరుగుపడతాయి. ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. నేర్పుగా కొన్ని సమస్యల నుంచి బయట పడతారు. వివాహాది శుభకార్యాలపై బంధువుల సలహాలు స్వీకరిస్తారు. వ్యాపారులు భాగస్వాముల నుంచి ఒత్తిడులు అధిగమిస్తారు. ఉద్యోగస్తులు ప్రతిభ చాటుకుంటారు. కళాకారులు,రచయితల కృషి ఫలిస్తుంది. 20,21 తేదీల్లో అనారోగ్యం. లేనిపోని చికాకులు. వేంకటేశ్వర స్వామి స్తోత్రాలు పఠించండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

అనుకున్న సమయానికి ఆదాయం సమకూరుతుంది. ఎంతటి వారినైనా మాటలతో ఆకట్టుకుంటారు. భూయోగం కలిగే సూచనలు. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారస్తులు పెట్టుబడులు మరింత పెంచుకుంటారు. ఉద్యోగులకు కొత్త హోదాలు. రాజకీయవేత్తలు ఆశించిన పదవులు. రచయితలు, కళాకారులకు తగినంత గుర్తింపు లభిస్తుంది. 18,19 తేదీలలో వృథా ఖర్చులు. ఆరోగ్య సమస్యలు. అన్నపూర్ణాష్టకం పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

మీ నిర్ణయాలు కుటుంబసభ్యులు ఆమోదిస్తారు. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. వ్యాపారులు కార్యసాధనదిశగా సాగి ఆశించిన లాభాలు దక్కించుకుంటారు. ఉద్యోగులకు విధుల్లో ప్రశంసలు అందుతాయి. పారిశ్రామిక వేత్తలలో నూతనోత్సాహం, ప్రభుత్వపరంగా ప్రోత్సాహం. క్రీడా కారులు, పరిశోధకులు స్వీయాను భవాలతో ముంద డుగు వేస్తారు. 22,23 తేదీలలో వ్యయప్రయాసలు. మానసిక అశాంతి. హయగ్రీవస్తోత్రాలు పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

చీటికీమాటికీ ఎదురవుతున్న ఆరోగ్యసమస్యలు తీరతాయి. ఆప్తుల సలహాలు స్వీకరిస్తారు. పలుకుబడి పెరుగుతుంది. విద్యార్థులు కొన్ని అవకాశాలు సాధిస్తారు. భూములు, వాహనాలు కొనుగోలు చేస్తారు. రాజకీయవేత్తలు ప్రయత్నాలు ముమ్మరం చేస్తారు. కళాకారులు, రచయితలు సత్తా నిరూపిం చుకుంటారు. 21,22 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. అనారోగ్యం. శివస్తోత్రాలు పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

ఆదాయానికి పడ్డ ఇబ్బందులు తీరి ఉపశమనం పొందుతారు. ఇంటి నిర్మాణయత్నాలలో వేగం పెంచుతారు. వ్యాపారస్తులకు నూతనోత్సాహం, కొత్తగా పెట్టు బడులకు అనుకూలం. ఉద్యోగులకు హోదాలు పెరుగుతాయి. పారిశ్రామిక వేత్తలు మంచి గుర్తింపు. క్రీడాకారులు, పరిశోధకులకు అన్ని విధాలా కలసివస్తుంది. 18,19 తేదీల్లో ఖర్చులు పెరుగు తాయి. ఆరోగ్యసమస్యలు. గణపతి స్తుతి మంచిది.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

కీలకదశలో కొన్ని నిర్ణయాలు తీసుకుంటారు. వ్యవహారాలు పూర్తి చేయడంలో బంధువుల చేదోడు లభిస్తుంది. వ్యాపారులు నూతన వ్యాపారాలకు శ్రీకారం చుడతారు. ఉద్యోగస్తులపై ఒత్తిడులు తొలగి ఊరట లభిస్తుంది. పారిశ్రామికవేత్తలు అనుకున్నది సాధిస్తారు. కళాకారులు, రచయితలకు కొత్త అవ కాశాలు. 20,21 తేదీల్లో దూరప్రయాణాలు. అనుకోని ఖర్చులు. శ్రీరామస్తోత్రాలు పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

చిన్ననాటి మిత్రుల నుంచి శుభవార్తలు వింటారు. కొంతకాలంగా వేధిస్తున్న సమస్యల నుంచి గట్టెక్కు తారు. వ్యాపారులు క్రమేపీ లాభాల దిశగా పయ నిస్తారు. ఉద్యోగులకు ఉన్నత స్థితి రావచ్చు. రాజకీయ వేత్తలు విదేశీ పర్యటనలు జరుపుతారు. క్రీడాకారులు, పరిశోధకులకు ఉత్సాహవంతంగా గడుస్తుంది. 21,22 తేదీల్లో అనారోగ్యం. కుటుంబంలో సమస్యలు. గణేశాష్టకం పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

నూతనోత్సాహంతో చేపట్టిన కార్యక్రమాలు పూర్తి చేస్తారు. రాబడి మరింత మెరుగుపడుతుంది. ఆప్తుల నుంచి కీలక సమాచారం. కొత్త విషయాలు గ్రహి స్తారు. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. వ్యాపారులకు లాభసాటిగా ఉంటాయి. క్రీడాకారులు, పరిశోధకులు శుభవార్తలు వింటారు. 23,24 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. శారీరక రుగ్మతలు. ఆంజనేయ దండకం పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

చిన్ననాటి స్నేహితులనుకలిసి ముఖ్య విషయాలు చర్చిస్తారు. ఇంటి నిర్మాణయత్నాలు ముమ్మరం చేస్తారు. కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుం టారు. వ్యాపారస్తులు పెట్టుబడుల అన్వేషణలో విజయం. ఉద్యోగులకు ముఖ్య సమాచారం. రాజకీయవేత్తలు కొన్ని ఆశయాలు సాధిస్తారు. వైద్యులు, క్రీడాకారులు ప్రతిభ నిరూపించుకుంటారు. 19,20 తేదీల్లో ఆప్తులతో కలహాలు. దత్తాత్రేయ స్తోత్రాలు పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

ఆదాయంకోసం ఎదురుచూసే అవసరం ఉండదు. నూతన విద్య, ఉద్యోగావకాశాలు లభి స్తాయి. వ్యాపారులు విస్తరణ కార్యక్రమాలను సాఫీగా పూర్తిచేస్తారు. ఉద్యోగులకు ఊహించని పదోన్నతులు. రాజకీయవేత్తలు కొన్ని పదవులు పొందుతారు. క్రీడాకారులు, రచయితలకు ఎదురుచూడని అవకా శాలు. 18,19 తేదీల్లో బంధువులతో వివాదాలు. సూర్యారాధన మంచిది.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

రాబడికి ఎటువంటి ఇబ్బంది లేకుండా గడిచి పోతుంది. దేవాలయాలు సందర్శిస్తారు. కొన్ని సమస్యల నుంచి గట్టెక్కుతారు. కోర్టు వ్యవహారాలు ఎట్టకేలకు కొలిక్కి వస్తాయి. వ్యాపారస్తులకు లాభాలు. ఉద్యోగులకు ఉన్నత పోస్టులు కళాకారులు మరిన్ని అవకాశాలు సొంతం చేసుకుంటారు. వైద్యులు, క్రీడా కారులకు శుభవార్తలు అందుతాయి. 20,21 తేదీల్లో ఆరోగ్య సమస్యలు. మనశ్శాంతి లోపిస్తుంది. శ్రీరామ రక్షాస్తోత్రాలు పఠించండి.

# పదరసం-527

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | ■ | 3 | 4 | ■ | 5 | | 6 |
| | ■ | 7 | 8 | ■ | | ■ | | ■ | |
| | ■ | 9 | | 10 | ■ | 11 | | ■ | |
| 12 | 13 | ■ | 14 | | | ■ | 15 | | ■ |
| 16 | | | ■ | | ■ | 17 | | ■ | 18 |
| ■ | | ■ | 19 | ■ | ■ | 20 | | 21 | |
| 22 | | 23 | | ■ | 24 | | ■ | 25 | |
| | ■ | 26 | | | ■ | ■ | 27 | | |
| ■ | 28 | | | ■ | 29 | | | ■ | ■ |
| 30 | | ■ | ■ | 31 | | ■ | 32 | | |

## ఆధారాలు

**అడ్డం**

1. నమస్కారం.. అభివాదం (3)
2. రాత్రి (2)
5. జాప్యం (3)
7. అదృష్టం.. జీవితకాలం (2)
9. తోరణం... భూషణం (3)
11. ప్రసంగించేవాడు (2)
12. మన కాదు... (2)
14. వేణువు... (3)
15. నకుల సహదేవుల తల్లి (2)
16. సంతోషం.. ఎర్రచందనం (3)
17. జీవితదశల్లో మొదటిది (2)
20. సదనానికి బహువచనం (4)
22. ఖయ్యాం రుబాయత్‌లపై దువ్వూరి రచన (4)
24. దారి... మార్గం (2)
25. అనేక.. పలు (2)
26. అడ్డం 14 నుంచి ధ్వని (3)
27. మధ్యనా... (3)
28. సత్యం,శివం.. (3)
29. మహిళ (3)
30. ఒడి..అధ్యాయం లాంటిదే (2)
31. నిలువు 29పై కోపం దీనిపైనా...! (2)
32. అంధకారం... (3)

**నిలువు**

1. బంకించంద్ర జాతీయ గీతం (5)
2. విష్ణువు పంచాయుధాల్లో ఒకటి (3)
4. వంద (2)
5. రాయలవారి ప్రముఖ కావ్యం (6)
6. రథం (3)
8. యుగం లాంటిదే...(3)
10. రక్షణ కోరడం... కింద నుంచి (3)
13. బహుమానం (4)
17. సహాయం... అండ (3)
18. ఆస్తులపై ఇష్టపూర్వకంగా రాసేపత్రం (4)
19. కలత... ఆందోళన (4)
21. రోజురోజు (3)
22. సగంలో సగం (2)
23. శృంగేరి పీఠం పేరు (3)
27. తొంభయ్ (3)
28. పన్ను (2)
29. మామ భార్య (2)

### పదరసం - 526 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 ద్వా | ప | 2 ర | ■ | 3 రా | జ | 4 సూ | యం | ■ | 5 జాం |
| ర | ■ | 6 వ | సు | ధ | ■ | తు | ■ | 7 అం | బ |
| క | ■ | ళి | ■ | ■ | 8 పు | డు | కృ 9 | ■ | వ |
| ■ | 10 రా | ■ | 11 గి | 12 త | ■ | ■ | ష్ణ | ■ | తి |
| 13 ము | స | 14 లం | ■ | 15 శ | 16 కు | ని | ■ | 17 అ | ■ |
| ■ | ■ | 18 కు | బ్జ | ■ | చే | ■ | 19 అ | ష్ట | మి |
| 20 పై | ■ | గో | ■ | 21 న | లు | పు | ■ | ■ | ■ |
| 22 జ | య | ■ | 23 క | ■ | డు | ■ | 24 దే | 25 వ | కి |
| యం | ■ | 26 పె | న్ను | ■ | ■ | 27 స | ■ | సు | ■ |
| 28 తి | కుం | ■ | య్య | ■ | 29 సా | త్య | కి | ■ | ■ |







# షూటింగ్స్ బంద్: నేర్చుకోవాల్సిన పాఠాలు!

**ఆగస్ట్ నాలుగో తేదీ నుంచి సినీ కార్మికులు బంద్ ప్రకటించడంతో చాలా సినిమాల షూటింగ్‌లు ఆగిపోయాయి. ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ బంద్ ఏకపక్ష నిర్ణయమని ఫిల్మ్ ఛాంబర్ కార్యవర్గం వాపోయింది. అయితే తమ వేతనాల సవరణ గురించి ఎంతో కాలంగా విజ్ఞప్తులు చేస్తున్నా ఛాంబర్ పట్టించుకోకపోవడం వల్లే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ఫెడరేషన్ నాయకులు వివరించారు. కాగా, ఈ బంద్ నుంచి సినిమా రంగం నేర్చుకోవాల్సిన పాఠాలు ఎన్నో ఉన్నాయి.**

సినిమా కార్మికులకు వేతనాలను మూడేళ్లకు ఒకసారి పెంచడం ఆనవాయితీగా వస్తోంది. ఎంప్లాయిస్ ఫెడరేషన్ కోరిన స్థాయిలో కాకపోయినా, ఎంతో కొంత పెంపునకు ఛాంబర్ అంగీకరిస్తూ ఉంటుంది. ఈసారి మాత్రం ఫెడరేషన్ కోరుతున్నట్లు వేతనాలు పెంచడానికి నిర్మాతలు ససేమిరా అనేశారు. దాంతో లేబర్ కమీషనర్‌కు విషయాన్ని తెలిపిన ఫెడరేషన్ సమ్మెకు పిలుపునిచ్చింది. షూటింగ్‌లకు పూర్తిగా హాజరు కాబోమని చెప్పకుండా... 30 శాతం పెంచే నిర్మాతల షూటింగ్‌లకు హాజరవుతామని ప్రకటించింది. దాంతో అగ్ర కథానాయకులతో సినిమాలు తీస్తున్న కొందరు నిర్మాతలు, మంచి రోజులు కాబట్టి సినిమాలు ప్రారంభించాలనుకున్న వారు... వారి డిమాండ్ మేరకు తమ షూటింగ్స్‌ను కొనసాగించారు. నిజానికి రెగ్యులర్‌గా సినిమాలు తీసే నిర్మాతలు గిల్డ్ పేరుతో వేరు కుంపటి పెట్టుకున్నారు. చిన్న నిర్మాతలు నిర్మాతల మండలి పక్షాన నిలిచారు. వేతనాల పెంపునకు తాము వ్యతిరేకమని వారు స్పష్టం చేశారు. ఇదే సమయంలో ఫెడరేషన్‌లోని యూనియన్లతో సంబంధం లేకుండా నచ్చినవారితో సినిమా షూటింగ్స్ చేసుకోవచ్చని ఫిల్మ్ ఛాంబర్ ప్రతిపాదన తెచ్చింది. అలానే, అన్ని యూనియన్లకూ ఒకేసారి 30 శాతం కాకుండా విడతల వారీగా పెంచుతామని కొందరు క్రియాశీలక నిర్మాతలు ఛాంబర్ ముందు ఓ ప్రతిపాదన పెట్టారు. దానిని ఫెడరేషన్ తోసిపుచ్చింది. దాంతో ఫిల్మ్ ఛాంబర్ అనుమతి లేకుండా ఏ నిర్మాత షూటింగ్ చేయడానికి వీల్లేదంటూ ఛాంబర్ కార్యవర్గం అల్టిమేటమ్ ఇచ్చింది.

రోజులు గడుస్తున్నా సమ్మె ఓ కొలిక్కి రాకపోవడంతో నిర్మాతలు రెండు తెలుగు రాష్ట్రాల సినిమాటోగ్రఫీ మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కందుల దుర్గేష్‌తో చర్చలు జరిపారు. ఇది ఫిల్మ్ ఛాంబర్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ మధ్య జరగాల్సిన చర్చ అని మంత్రులు వారికి నచ్చచెప్పారు. కొంత రాజీ ధోరణి ప్రదర్శించాలని, చిన్న నిర్మాతలకు ఇబ్బంది లేకుండా వేతనాల పెంపు గురించి ఆలోచించాలని కోమటిరెడ్డి కోరారు. ఈ మధ్యలో నిర్మాతలు చిరంజీవి, బాలకృష్ణలు తమ గోడును విన్నవించుకున్నారు. సమస్యను ఫిల్మ్ ఛాంబర్ అడ్ హాక్ కమిటీ ద్వారానే పరిష్కరించుకోవాలని చిరంజీవి సలహా ఇవ్వగా, పరిశ్రమ శ్రేయస్సు దృష్ట్యా తన వంతుగా ఎక్కువ సినిమాలు చేయడానికి సిద్ధమని బాలకృష్ణ చెప్పారు. కాగా, యూనియన్లతో సంబంధం లేని వారిని మధ్యవర్తిత్వం వహించమని కోరడం ఏమిటని సీపీఐ నేత నారాయణ తప్పు పట్టారు.

ఏ సంస్థ అయినా ఏడాదికో, రెండేళ్లకో ఉద్యోగులకు వేతనాలు పెంచక తప్పదు. అయితే, ఆ పెంపు తమకు భారమనుకున్నప్పుడు అందుకు తగ్గ వనరులను సమకూర్చుకునేందుకు ప్రయత్నిస్తుంది. లేదా ఉద్యోగుల సంఖ్యను కుదించుకుంటుంది. కానీ ఇక్కడ నిర్మాతలకు ఈ రెండు అవకాశాలు మృగ్యమయ్యాయి. సినిమాల విజయాలు తగ్గుముఖం పట్టాయి. నష్టాలు పెరిగిపోయాయి. పోనీ కార్మికులను తగ్గించుకుందామంటే యూనియన్ నాయకులు నిబంధనలు మాట్లాడుతున్నారు. తారలకు రూ.కోట్లలో పారితోషికాలు చెల్లించే బదులు వేతనాలు పెంచితే తప్పేముందని చాలామంది అంటుంటారు.

నిజమే కానీ.. హీరోకో, డైరెక్టర్‌కో అధిక పారితోషికం అనేది వారి డిమాండ్‌ను బట్టి ఉంటుంది.. ఖాళీగా ఉండే హీరోకు ఎవరు అలా ఇవ్వరు. కానీ కార్మికుల దగ్గరకు వచ్చే సరికీ ఒకసారి పెంచడమో, మరోసారి తగ్గించడమో ఉండదు. ఒక నిర్ణయం తీసుకున్న తర్వాత దానికి తగ్గట్టుగా వేతనాలు ఇవ్వాల్సిందే. ఫెడరేషన్‌లోని నాయకుల చర్యల వల్ల చిన్న సినిమాలకు నటీనటుల పారితోషికాల కంటే కార్మికుల వేతనాలకే ఎక్కువ బడ్జెట్ అవుతుందనే వారూ లేకపోలేదు.

నటీనటులు, సాంకేతిక నిపుణుల పారితోషికాలను అటుంచితే...మార్పు రావాల్సింది ప్రధానంగా నిర్మాతలలో. ఇటీవల వచ్చిన చాలా సినిమాలకు సంబంధించిన, సరైన ప్రణాళిక లేకుండా చాలా సినిమాలకు ఇబ్బడి ముబ్బడిగా షూటింగ్ కాలాన్ని పెంచేసుకున్నారు. రూ.కోట్లతో పాటలు, పోరాట సన్నివేశాలను చిత్రీకరించి ఫైనల్ ఎడిటింగ్‌లో వాటిని పక్కన పెట్టేశారు. అలా బడ్జెట్‌తో పాటు వడ్డీలు పెరుగుతాయి. బయ్యర్లకు అధిక మొత్తాలకు సినిమా అమ్మాల్సి ఉంటుంది. టిక్కెట్ రేట్లు పెంచాలంటూ ప్రభుత్వాలను కోరుతుంటారు. ఆ భారం సగటు ప్రేక్షకుడి మీద పడుతుంది.

అంటే... నిర్మాత నిర్లక్ష్యం, దర్శకులు చెప్పేదంతా గుడ్డిగా నమ్మడం వల్ల జరుగుతున్న నష్టం ఇది. 'మూవీ మొఘల్' రామానాయుడు వంటి వారు బౌండ్ స్క్రిప్ట్‌ను పక్కన పెట్టుకునే సినిమా తీసేవారు. షూటింగ్ సమయంలో అనవసర మైన ఆర్భాటాలకు పోయేవారు కాదు. సినిమాకు పెట్టుబడి, దానికి జరిగే బిజినెస్, ఒకవేళ పరాజయం పాలైతే వచ్చే నష్టం వంటివాటిని ముందుగానే లెక్కలు వేసుకునేవారు. ఇవాళ నిర్మాతలలో అలాంటి ఆలోచన లోపించి తారలకు, దర్శకులకు రూ. కోట్లు గుమ్మరిస్తూ, ఆ తర్వాత ఖర్చు పెరిగిందని శోకాలు పెడుతున్నారు. నిర్మాత సరిగా వ్యవహరించినప్పుడు సినిమా కచ్చితంగా బాగుంటుంది. ఒకవేళ నష్టం వచ్చినా అది భరించే స్థాయిలో ఉంటుంది. అప్పుడు కార్మికుల వేతనాల పెంపు పెద్ద సమస్య కాబోదు. ఫెడరేషన్ నాయకులు కూడా కాలమాన పరిస్థితులను బట్టి నిర్మాతలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తే మంచిది. లేదంటే అవకాశాల కోసం ఎదురు చూస్తున్న ఎందరో ప్రతిభావంతులను నిర్మాతలు తీసుకోవడం మొదలుపెడితే... యూనియన్ వ్యవస్థే కూలిపోతుంది.

– **అరుణ**, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్





# మెట్రో రైలులో మోదీ

ప్రధాని నరేంద్ర మోదీ ఆగస్టు 10న బెంగళూరులో మెట్రో రైలు ఎల్లో లైనును ప్రారంభించారు. ఆర్వీ రోడ్డు స్టేషన్ నుంచి ఎలక్ట్రానిక్ సిటీ మెట్రోస్టేషన్ వరకు మెట్రో రైలులో ప్రయాణించారు. విద్యార్థినీ విద్యార్థులతో ముచ్చటించారు. వారితో కరచాలనం చేశారు. ప్రయాణికులతో మాట్లాడారు. మెట్రో రైలు ప్రయాణంలో ప్రధాని మోదీతో పాటుగా కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, తదితరులు ఉన్నారు.







From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 77 Issue : 43

# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు












వెల : ₹.300/- | వెల : ₹.100/- | వెల : ₹.400/- | వెల : ₹.200/- | వెల : ₹.150/-











వెల : ₹.499/- | వెల : ₹.50/- | వెల : ₹.250/- | వెల : ₹.300/- | వెల : ₹.100/-












వెల : ₹.499/- | వెల:₹.49/- | వెల :₹.450/- | వెల : ₹.499/- | వెల : ₹.125/-

పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠీ, హైదరాబాద్. 9440589722.